అక్షర వికాసం

# మార్గదర్శిని

## MARGADARSHINI



వయోజన విద్యా శాఖ

తెలంగాణ ప్రభుత్వం

# అక్షర వికాసం

# మార్గదర్శిని

# MARGADARSHINI


సంపాదకులు

**శ్రీమతి కె. కాత్యాయిని,** రిసోర్స్ పర్సన్

**శ్రీ వై. మాలకొండయ్య,** పి.ఓ., జె.ఎస్.ఎస్.

**శ్రీ టి. రమేష్ రెడ్డి,** పి.ఓ., డి.ఏ.ఇ.

**శ్రీ పి. శ్రీనివాస్ బాబు,** ఏ.పి.ఓ., డి.ఏ.ఇ.

ప్రధాన సంపాదకులు

**సంచాలకులు,** వయోజన విద్యా శాఖ, తెలంగాణ

**సంచాలకులు,** ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ



ప్రచురణ

**వయోజన విద్యా శాఖ**

తెలంగాణ, హైదరాబాద్

సమన్వయం

**రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ**

తెలంగాణ, హైదరాబాద్

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1 | మనం చదవగలం | 08 |
| 2 | ఆదాయం పెంచుకుందాం | 13 |
| 3 | ఇరుగు పొరుగు మాటా మంతి | 19 |
| 4 | ఒకరికి ఒకరు తోడైతే అదే సంఘం | 23 |
| 5 | ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనం | 27 |
| 6 | పూడిక తీద్దాం-చెర్లను నింపుదాం-వనరులను రక్షిద్దాం | 30 |
| 7 | పోషకాహారలోపం-అనారోగ్యాలకు మార్గం | 33 |
| 8 | అమ్మకు బ్యాంక్ ఖాతా తప్పనిసరి | 36 |
| 9 | చట్టాన్ని తెల్సుకుందాం - భద్రంగా బతుకుదాం | 39 |
| 10 | స్వచ్ఛ భారత్ అంటే ఏమిటో బిడ్డలకు నేర్పాలి | 43 |
| 11 | ఫోన్ లేకుంటే ఈరోజుల్లో ఇబ్బందే | 47 |
| 12 | ఎన్నికల్లో ఓటా? నోటా?... నిర్ణయం మీదే | 50 |
| 13 | నైపుణ్యాలను పెంచుకో - అభివృద్ధిని సాధించు | 53 |
| 14 | దేశాన్ని ప్రేమిద్దాం - జాతి ఘనతను చాటుదాం | 56 |
| 15 | జాగ్రత్తలు తీసుకుందాం - విపత్తులను ఎదుర్కొందాం | 59 |
| 16 | జజ్జనకరి జనారే తెలంగాణ భళారే! | 61 |

# మార్గదర్శిని

## స్వాగతం.. మిత్రులారా!

మనం ఇప్పుడు ఒక ఉత్తమైన పని ప్రారంభించాం. మీరు చేయనున్న పని ఎంత గొప్పదో మీకు పూర్తిగా తెలుసో లేదో నాకు తెలియదు గానీ... ముందు ముందు మీకే తెలుస్తుంది. చుట్టుపక్కల మీ విలువ ఖచ్చితంగా పెరుగుతుంది. దానాలలో కెల్ల విద్యాదానం గొప్పదని మనందరం వింటూనే ఉన్నాం. ఇప్పుడు మీరు చేయబోతున్న పని అదే. ఎందరికో మీరు గురువులు కానున్నారు. నలుగురిలో గురువుగా మీ పరపతి పెరిగిపోనుంది. ఈ మీ పనిలో మీరు శ్రద్ధపెడితే ఉత్తమ వాలంటీరు అవార్డు మీకే రావచ్చు. కాబట్టి మనసు పెట్టండి. పదిమందికి విజయవంతంగా చదువు చెప్పండి. నలుగురి మేలులో మనమేలు కూడా ఉంటుంది. జనం బాగుపడితే మన ఊరు బాగుపడుతుంది. మీకన్నీ తెలుసు... మళ్లీ మళ్లీ గుర్తు చేసుకోడానికే ఈ ప్రయత్నం.

మిత్రులారా! మనం ఇప్పుడు వయోజనులకు చెప్పబోయే వాచకం పేరు **"అక్షర వికాసం"**. ఇది వాళ్ల జీవితాలతో పాటుగా మన ఊరంతా వెలుగు నింపుతుందని ఆశిద్దాం. ఈ **"అక్షర వికాసం"** పుస్తకం తయారీలో ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకున్న కొన్ని అంశాలు ఉన్నాయి. వాటిని మీరు తెలుసుకుంటే బోధనలో మీకు ఉపయోగపడతాయి.

ఈ పుస్తకాన్ని తయారు చేసేటప్పుడు మన అభ్యాసకులు ఎవరన్న విషయంపై శ్రద్ధ పెట్టాం. 15 ఏండ్లు దాటి, చదువుకోవాల్సిన వయసులో చదువుకునే అవకాశానికి నోచుకోక రకరకాల కారణాలవల్ల చదువుకు దూరమైన వారు. అక్షరాస్యులు కానివారంటేనే ఆర్థికంగా వెనుకబడి, సాధారణ జీవితం గడుపుతున్నవారే ఎక్కువగా ఉంటారు. కూలీనాలి, ఇతర చిన్న పనులతో జీవనం గడుపుతున్నవారు. అయితే వీరంతా జీవితానుభవంలో పండిపోయినవారు. కష్టసుఖాలతో తలమునకలుగా ఉన్నవారు. నిత్య జీవనభారం మోస్తున్నవారు. క్షణం తీరికలేదు అనుకునే వారు. ఎంతో అవసరమయితే తప్ప సమయాన్ని కేటాయించలేనివారు.

వీరికి తెలియని విషయాలంటూ ఎక్కువగా ఏమీ ఉండవు. ప్రపంచంలో ఉన్న చాలా విషయాలు తెలుసు. రోజువారి జీవితంలో ఖర్చులు, ఆదాయం లెక్కలు అన్నీ చెపుతారు. వీరికి తెలియనిది ఆ విషయాలకు అక్షర రూపం. ఆ అక్షరాలను, అంకెలను చదవడం రాయడం రాదు. దానివల్ల వారు అప్పుడప్పుడు మోసపోతుంటారు, అవమానపడుతుంటారు. వేరే ఊళ్ళకు వెళ్లేటప్పుడు ఏ బస్ ఎక్కాలో తెలియక ఇబ్బంది పడుతుంటారు. బ్యాంకు లావాదేవీలు, చట్టాలు తదితరాల్లో ఇతరులపై ఆధార పడుతుంటారు. అవి తగ్గించే ప్రయత్నం ఇప్పుడు మనం చేస్తున్నాం.

ఈ పుస్తకం ద్వారా అక్షరాలు, అంకెలు నేర్చుకోవడం మాత్రమే కాదు. వయోజనులు వారి జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోడానికి కావలసిన సామాజిక చైతన్యాన్ని కలుగచేయడంతోపాటు

వారివారి వృత్తుల్లో అభివృద్ధిని సాధించడానికి కావలసిన పరిజ్ఞానాన్ని పొందేలా చేయడం, మౌలిక అక్షర మరియు సంఖ్యా జ్ఞానంతో పాటుగా దైనందిన జీవితంలో ఉపయోగపడే ఆరోగ్యకరవిషయాలు, శుభ్రత, పరిసరాల పరిరక్షణ, మాటామంతి, మన సంస్కృతి, ఆధునికమైన ఫోన్, బ్యాంక్ లావాదేవీలు, చట్టం గురించిన పరిజ్ఞానం, పొదుపు, నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరాన్ని వివరిస్తాం. నేటి కాలంలో వారికి కావలసిన విషయాలను పరిచయం చేస్తాం. పనిలో పనిగా వారి వెనుకబాటుతనం నుంచి బయటపడడం, జీవన స్థాయిని పెంచుకునే అంశాల గురించిన ఆలోచనలు రేకెత్తించే ప్రయత్నం చేయడం జరుగుతుంది.

ఈ పుస్తకంలో చెప్పే పలు అంశాలు మన అభ్యాసకుల జీవితానికి, పరిసరాలకు సంబంధించినవై ఉంటాయి. ముందుగా వారికి తెలిసిన విషయాలనుంచి తెలియని విషయాలకు, సులభతరమైన అంటే తేలికైన విషయాలనుంచి కష్టమైన అంశాలకు వెళతాం. ఎక్కడా నేర్చుకోవడంలో వారికి కష్టంగా ఉండకూడదు. విసుగ్గానూ ఉండకూడదని మనం తెలుసుకోవాలి. ఈ వాచకం పూర్తయ్యింది అంటే వారు సాధించిన అక్షర, సంఖ్యా పరిజ్ఞానాన్ని జీవితంలో ఉపయోగించగలగడాన్ని కూడా చూస్తాం. వారు ప్రతి విషయాన్ని గురించి ఆలోచించేలా ప్రయత్నం చేస్తాం. ఆలోచించడం ప్రారంభించిన మనిషి అక్కడితో ఆగడు అన్న విషయం మనందరకూ తెలిసిందే. ఆ విధంగా మనం మనవారి జీవితాల్లోకి వెలుగు తెచ్చే ప్రయత్నం చేస్తాం. మనవారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ప్రయత్నం ఈ వాచకం తెస్తుందన్న నమ్మకంతో పనిచేద్దాం.

## వాచకం ప్రత్యేకతలు

**“నవ భారత సాక్షరతా కార్యక్రమం”** కోసం మన భారత ప్రభుత్వం వారు రూపొందించిన వాచకాల పద్ధతి, మార్గదర్శక సూచనలను అనుసరించి **“అక్షర వికాసం”** వాచకాన్ని తయారుచేశాం. ఇందులో ప్రారంభంనుంచి ప్రతి పాఠం అంశాల ఆధారితంగా ఒక లక్ష్యంతో రాసినదై ఉంది. 15 సంవత్సరాల వయసు దాటిన వారికి ఉపయోగపడే అంశాలను చెప్పే ప్రయత్నం జరిగింది.

పాఠాలు రాసేటప్పుడు మన లక్షిత వర్గం యొక్క సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకోవడం జరిగింది. మహిళా కేంద్రితంగా ఆలోచించడం జరిగింది.

అక్షరజ్ఞానం, సంఖ్యాపరిజ్ఞానాలను కలిపి అందించడం వల్ల వారికి నిత్యజీవితానుభవాన్ని చదువులో కలగలుపుతున్నాం. దానివల్ల వారికి ఇదంతా అనవసర ప్రయాస అనిపించకుండా ‘ఇది మనకు పనికి వస్తుంది’ అన్న భావనను కల్పించగలుగుతాం.

**‘మనం చదవగలం’** అనే నమ్మకాన్ని వయోజనులలో కలిగించాలనే ఉద్దేశంతో ఆ పాఠంతో వాచకం ప్రారంభించాం.

అభ్యాసకులకు తెలిసిన సందర్భాలు ఉన్న బొమ్మలను చూపించడం ద్వారా వారిలో చదువగలరనే విశ్వాసాన్ని పెంపొందింప చేయడం జరుగుతుంది.

అక్షరాల వాడుకను దృష్టిలో పెట్టుకుని పాఠాల పేర్లను రూపొందించడం జరిగింది. ఎక్కువగా ఉపయోగించే అక్షరాలను ముందు పాఠాల్లో చెప్పే ప్రయత్నం చేశాం. అందుకే ప్రారంభ పాఠాలలో ప్రతి అంశం వారికి తెలిసినవే ప్రస్తావించడం జరిగింది.

అఆ ఇఈ – అక్షరమాల క్రమాన్ని ఈ వాచకంలో అనుసరించలేదు. అవసరాన్ని బట్టి ఎక్కువ వాడుకలో ఉండే అక్షరాలను ముందుగా పరిచయం చేసే ప్రయత్నం జరిగింది. మనిషిని ముందస్తుగా ఆకట్టుకునేవి బొమ్మలు. వారికి వస్తువులన్ని తెలుసు కాబట్టి తెలిసిన బొమ్మల ద్వారా తెలియని అక్షరాలను పరిచయం చేసే ప్రయత్నం జరిగింది.

బొమ్మల పేర్ల ద్వారా నేర్పిన అక్షరాలను వాడి మరికొన్ని పదాలను తయారుచేయడం చెపుతాం. దాని ద్వారా వారు ఆయా అక్షరాలను పునశ్చరణ ద్వారా గుర్తుంచుకోవడానికి ఉపయోగపడేలా ప్రణాళికను రూపొందించుకున్నాం.

## వయోజనులకు చదువు చెప్పేవారు గుర్తుంచుకోవాల్సిన విషయాలు...

1. వారికి చదవడం, రాయడం తెలియదుగాని జీవిత అనుభవం ఎక్కువ. కాబట్టి చిన్నచూపు చూడకూడదు. చదువుకున్న మీరు వారికన్నా గొప్పవారం అనే భావాన్ని చూపకండి. మీరు మంచి స్నేహితులన్న నమ్మకాన్ని కలిగించాలి. చాలా వినయంతో చదువు చెప్పాలి.
2. వయస్సు దాటిపోయింది ఇప్పుడు చదువు వస్తుందా? అవసరమా? అనుకునే వయోజనులలో ఏ వయసులోనైనా చదువు వస్తుంది, ఏ వయసులోనైనా అక్షరజ్ఞానాన్ని సంపాదించ గలం అనే నమ్మకం కలిగించే ప్రయత్నం మొదటి పాఠంనుంచే చేశాం. ప్రతి పాఠం చివరన అభ్యాసాలు ఉంచడం జరిగింది. ఎందుకంటే, అభ్యాసకులలో క్రమంగా పరీక్షల భయం పోగొట్టడానికి. ఇవి అభ్యాసకులు తాము ఎంత నేర్చుకున్నారో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇట్టి విషయం మీరూ, ఎంత నేర్చుకున్నారన్న విషయం మీకు, అలాగే మీ ద్వారా అభ్యాసకులూ తెలుసుకోడానికి ఉపయోగపడతాయి.
3. అభ్యాసకులకు జీవిత అనుభవాలతో ఎక్కువ విషయాలు తెలుసు. వారు సామాన్యంగా వారికి తెలిసిన విషయాలను నలుగురికి చెప్పాలనుకుంటారు, చెప్పనివ్వాలి. వారికి తెలిసిన విషయాలు చెప్పడం ద్వారా వారి గుర్తింపు దొరికిన భావన కలుగుతుంది. వయోజనులకు మెప్పు పొందే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. మీరా అవకాశం ఇప్పుడు ఇవ్వాలి. ఉదా. ఇడ్లీలు మెత్తగా రావాలంటే ఏంచేయాలి? అని అడిగితే, అది చెప్పిన అమ్మ ఎవరైనా ఆరోజు సంతోషంగా ఇల్లు చేరతారు. అంతటి గౌరవం ఇచ్చిన కేంద్రానికి రావడం ఇక ఆపరు. బోధన ప్రక్రియలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా చేయడం వల్ల వారు ఎంతో తృప్తిని ఆనందాన్ని పొందుతారు. నిత్యజీవిత సమస్యలు, సంసార భారంతో కుంగిపోతున్నవారికి ఇది ఎంతో ఊరట నిస్తుంది.
4. వారికి ఉపయోగం కనిపించని పనులకోసం ఒక్క నిమిషం ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉండరు. కేంద్రానికి వస్తున్నందుకు ఉపయోగం కనిపించి తీరాలి. అందుకే కేంద్రానికి వస్తున్న ప్రతి ఒక్కరి సమస్యలను, ఇష్టాయిష్టాలను గమనించుకుంటూ మీ స్థాయిలో పరిష్కారాలు చెపుతూ వారి మనిషిగా ఆ కాసేపు వారి ప్రపంచాన్ని మరచిపోయేలా చేయాలి. వారికి ఉపయోగపడే లేదా మనోల్లాసాన్ని కలిగించే విధంగా బోధన జరగాలి.
5. రాగానే బడిలోలాగా పాఠాలను మొదలు పెట్టకుండా, వారి యోగక్షేమాలు అడిగి, కాస్త పనికి వచ్చే లేదా వారికి సంతోషం కలిగించే విషయాలు మాట్లాడాలి.

## బోధనా విధానం

- కేంద్రానికి వెళ్లేముందు ఆ రోజు చెప్పాలనుకుంటున్న పాఠం ఎలా చెప్పాలో, ఏయే విషయాలు చెప్పాలో చూసుకోండి. ఈ పుస్తకంలో చెప్పిన విషయాలతో పాటుగా మీకు తెలిసిన కొన్ని మెలకువలు జోడించండి.
- పాఠం చెప్పడానికి ముందు అభ్యాసకులందరిని పలకరించి క్షేమసమాచారాలు తెలుసుకోండి. ఊరిలోనో వారింటిలోనో జరిగిన విషయాలను గురించి మాట్లాడండి. వారు చెప్పే విషయాలకు ప్రాధాన్యత ఇవ్వండి.
- మీ సంభాషణ పాఠ్యాంశం దిశగా మరలించాలి.మాటల్లో చెప్పుకోబోయే పాఠం పేరో అంశమో వచ్చేయాలి.
- పాఠం ముందున్న బొమ్మను చూపి, బొమ్మలోని అంశాలను అభ్యాసకుల నోట చెప్పించాలి. దాంతో వారిలో ఒక ఉత్సాహం వస్తుంది. వారు చెప్పని విషయాలు వివరించాలి.
- బొమ్మను బట్టి ఆలోచన రేకెత్తించే ప్రశ్నలు వేయాలి. అవి ఈ మార్గదర్శినిలోవి కావచ్చు లేదా మీరు సొంతంగా ఆలోచించినవి కూడా కావచ్చు. పాఠ్యాంశాలు ఎక్కువగా అభ్యాసకుల జీవితానికి సంబంధించినవి కాబట్టి చాలా సందేహాలు మీ ముందుంచుతారు. ఆ సందేహాలు తీర్చి, అవసరమైన, వారికి కావాల్సిన సమాచారాన్ని అందించాలి. అందుకు ఈ మార్గదర్శిని మీకు ఉపయోగపడుతుంది. ఇంకా అవసరమైన సమాచారాన్ని మీరు సేకరించి వారికి చెప్పగలగాలి. దానివల్ల వారి దృష్టిలో మీ స్థాయి, గౌరవం చాలా పెరుగుతాయి. వారికోసం మీ జ్ఞానాన్ని మీరు పెంచుకుంటారు. అది మీకు చాలా మేలుచేస్తుంది.
- పాఠం పేరును మీరు పలుకుతూ పదేపదే అభ్యాసకులచేత పలికించాలి.
- నేర్చుకోబోయే పాఠం పేరులో అక్షరాలను విడివిడిగా రాసి చూపుతూ ఆ అక్షరాలను వారికి పరిచయం చేయాలి. పదే పదే అక్షరాలను చూపుతూ పలికించి వారికి గుర్తుండిపోయేలా చేయాలి.
- ఆ అక్షరాలతో కొత్త పదాలను చెప్పించడం వల్ల వాటి పునఃశ్చరణ జరుగుతుంది.
- రెండవ పాఠం నుంచి, కొత్తగా వచ్చే అక్షరాలను రాసి చూపుతూ వాటి పరిచయం చేయించాలి. వాటితో పాటుగా అప్పటి వరకు నేర్చుకున్న అక్షరాలకు కొత్త అక్షరాలను కూడా జోడించి సొంతంగా పద నిర్మాణం చేయగలగడం వారికి అలవాటు చేయాలి. దానివల్ల నేర్చుకున్న అక్షరాలను మర్చిపోరు.
- అక్షరం గుర్తులు. ఒత్తులు వచ్చినప్పుడు వాటిని ఆ పాఠంలో వచ్చిన అక్షరాలకు జోడించి చెప్పడమే కాదు, పాత పాఠాలలో వచ్చిన అక్షరాలకు కూడా జోడించి చూపాలి. అక్షరాలకు ఆ గుర్తును కలిపితే ఎలా ఉంటుందో చెప్పడం వల్ల వారికి గుర్తుండిపోతుంది.
- అభ్యాసకులు అక్షరాన్ని గుర్తించగలుగుతున్నారు అనుకున్నాక రాయడం నేర్పాలి. నోటుపుస్తకాలలో రాస్తున్నప్పుడు వారు సరిగ్గా రాస్తున్నారో లేదో గమనించాలి. అక్షరాలను రాయడం ఎక్కడ మొదలు పెట్టి ఎలా రాయాలో ముందు రాసి చూపించాలి.

- పాఠంలో వచ్చిన ప్రతి అక్షరం, పదం విడిగా రాసి చూపుతూ వారికి గుర్తుండిపోయేలా చేయగలగాలి. అక్షరబ్యాంక్ ఇక్కడ బాగా ఉపయోగపడుతుంది.
- పాఠంలో వచ్చిన అక్షరాలతో వచ్చే మాటలను చెప్పించాలి. పుస్తకంలో ఇచ్చిన కొన్ని మాటలకు తోడుగా అభ్యాసకులతో కొత్త మాటలు కూడా చెప్పించి వారిలో ఉత్సాహాన్ని పెంచాలి.
- పాఠం పూర్తయ్యాక అభ్యాసాలను చేయించాలి. ప్రతి పాఠం ప్రారంభించేటప్పుడు లేదా చివరన అప్పటి వరకు నేర్చిన అక్షరాలు గుర్తింప చేయాలి.
- పాఠంతో పాటుగా దానికి సంబంధించిన విషయాలు, మీ అనుభవాలతో పాటుగా, అభ్యాసకుల అనుభవాలను చర్చించాలి. బోధన ఎక్కడా విసుగు రాకుండా ఉండడానికి సరదా కబుర్లు, ఆటపాటలు, జోకులు కలగలపాలి.
- ప్రతి పాఠానికి చార్టులు, ఫ్లాష్ కార్డులు వంటి బోధనోపకరణాలు తయారుచేసుకుని ఉపయోగించాలి. దానివల్ల అక్షరాలు బాగా గుర్తుండిపోతాయి.
- కాగితం లేదా కార్డు ముక్క మీద నేర్చుకున్న అక్షరాలు రాయించి ఒక అక్షరబ్యాంకును కేంద్రంలో ఏర్పాటు చేయండి. దానితో అక్షరాల, పదాల ఆటలు ఆడగలుగుతారు.
- మూల్యాంకన పత్రాలను వర్క్‌షీట్‌లను రాయించాలి. దానివల్ల వారు అంతవరకు చదువుకున్న విషయాలను ఎంతవరకు గుర్తున్నాయో మీకు తెలిసి పోతుంది. ఎవరికి మళ్లీ చెప్పాలో తెలుసుకోవచ్చు. కాస్త నిదానంగా నేర్చుకుంటున్నారు అనుకునే వారికి నేర్చుకున్నవారిని జోడించి కలిసి చదవమనడం వల్ల ఇద్దరికి లాభం చేకూరుతుంది
- ప్రశ్నా పత్రాలు కేంద్రంలోనే రాయించాలి గాని అది పరీక్ష అనే ఆలోచన, భయం కలుగకుండా చూసుకోవాలి. పరీక్ష అంటే ఇంతేకదా.. అనిపించే వాతావరణం ఉండాలి. నిర్ణీత సమయం కూడా పెట్టుకోరాదు.

## కేంద్రంలో పాఠం బోధించేటప్పుడు ఒక వరుసక్రమాన్ని అనుసరించండి.

1. పలకరింపులు
2. ఆ రోజు పాఠానికి సంబంధించిన పాటో, కథో, వార్తో, ఆటనో ... అభ్యాసకులందరూ పాల్గొనేలా చేయాలి.
3. ఇంతవరకు ఏమి నేర్చుకున్నారో అభ్యాసకులతో చెప్పించాలి.
4. ప్రస్తుత పాఠం బొమ్మపై చర్చతో మొదలు పెట్టాలి.
5. వీలైనంతవరకు బోధనోపకరణాలు వాడడం మంచిది.
6. వారిని జాగ్రత్తగా గమనిస్తూ అభ్యాసాలను కేంద్రంలోనే చేయించాలి.
7. మధ్య మధ్య పొడుపు కథలు, సామెతలు, విజయగాథలు, సంబంధిత లేదా తాజా వార్తలు చెపుతూ ఉత్సాహం తగ్గకుండా చూసుకోవాలి.

పాఠం – 1

# మనం చదవగలం!

మీరు చెప్పబోయే వాచకంలోని మొదటి పాఠం... మీరు అనుకున్న సమయానికి కాస్త ముందే కేంద్రలో సిద్ధంగా ఉండాలి. పనులతో తలమునకలుగా ఉన్న అభ్యాసకులు కాస్త అటుఇటుగా కేంద్రానికి వస్తారు. రాగానే పుస్తకం చదవకుండా అందరిని నవ్వుతూ నవ్విస్తూ పలకరించండి.

**వాలంటీర్** : పెద్దమ్మ నువ్వు రాను రానంటూనే వచ్చినందుకు, నాకు వందమంది వచ్చినట్టుగా అనిపిస్తోంది. సంతోషం. ఈరోజు మనం పాఠాలు మొదలు పెడుతున్నాం కదా! ముందు చక్కగా ఎవరైనా సంతోషంగా పాట పాడితే బాగుంటుంది.

**ఒకరు** : మన నాగన్న బాగా పాడతాడు కదా. పాడితే వినాలని ఉంది.

**నాగన్న** : ఏదో పాడతాను. మీ అందరిముందు ఏం పాడను.

**అందరూ** : పాడు.... పాడు.... పాడు ఏదో ఒకటి.

**నాగన్న** : సరే అప్పుడెప్పుడో విన్న పాట పాడతా. నవ్వకండి.

అక్షరాల పండగొచ్చే మన ఊరికి
ఊరంతా కదులుదాము చదవడానికి
అక్షరాల ముగ్గులేసి అంకెల తోరణం గట్టి
చదువులమ్మ సంబరాలు చేద్దామా
మన ఊరిని చక్కదిద్దుకుందామా
అక్షరాలన్ని కలిపి పదాలుగా అల్లి
అంకెలతో గుర్తులన్ని లెక్కలుగా పేర్చి
చక్కనైన మాటలల్లుకుంటూ అన్ని నేర్చుకుందామా
ఆటా పాటలతో చదువుకుందామా

**అందరూ** : చప్పట్లు... ఎంత బాగా పాడావు! ఎక్కడ నేర్చావు?

**నాగన్న** : అప్పుడెప్పుడో మనూరికి మేడంలు చదువుకోండి అని చెప్పడానికి వచ్చారు చూడు. వాళ్ళు నేర్పించిన పాట ఇది.

**వాలంటీరు** : చాలా బాగుంది నాగన్న. సరే ఈ బొమ్మ చూడండి. మీకు ఏం కనిపిస్తోంది. బాగా చూడండి. చెప్పండి.

ఎవరూ మాట్లాడరు. అట్లే బొమ్మను చూస్తూ ఉంటారు.

వాలంటీరు : ఎవరూ చెప్పరేం. రాజక్క నువ్వు చెప్పు. ఇక్కడేం కనిపిస్తున్నాయి.

రాజక్క : టీచరమ్మ కావచ్చు చదువు చెపుతోంది.

అభ్యాసకుడు 2 : మనలాగే పాఠాలు వినడానికి ఆడా మగా అందరూ వచ్చారు.

అభ్యాసకుడు 3 : అందరూ పుస్తకాలు పట్టి చదువు తున్నారు.

అభ్యాసకుడు 4 : కింద ఒక పెద్దాయన పేపర్ కూడా చదువుతున్నాడు.

అభ్యాసకుడు 5 : ఇద్దరు పిల్లలను అమ్మ చదివిస్తున్నది కదా.



నాగన్న : మొత్తానికి ఈ బొమ్మలో అందరూ చదువుతున్నారు.

వాలంటీరు : కదా! అందరూ చదువుతున్నారు. అదీ సంతోషంగా చదువుతున్నారు.. మరి మనం మాత్రం చదువుకోవద్దా?

రాజక్క : నువ్వు పిలిచావనే వచ్చాను. కానీ చదువు వస్తుందా అనేదే ఇంకా నాకు భయం. ఇంట్లో పిల్లలతో, మీ బావ పనులతో తీరికే ఉండడం లేదు.

వాలంటీరు : అట్లా అనకు అక్కా. మనం అందరం చదవగలం. నన్ను నమ్ము. మనం చదవగలం. పెద్దమ్మ నువ్వు చెప్పు. మనం చదవగలమా? చదవలేమా?

పెద్దమ్మ : నువ్వు చెపుతున్నావు కదా. మనం చదవగలం.

వాలంటీరు : నరసయ్య మామా! మనం చదవ గలమా చెప్పు. పెద్దమ్మ మనం చదవగలం అంది.

నరసయ్య : మీ పెద్దమ్మ చెప్పిందంటే నిజమే. మనం చదవగలం. ఇగంతే.

నాగన్న : ఏందిరా. నువ్వు మా అందరితో మనం చదవగలం అని అనిపించేలా ఉన్నావు.

వాలంటీరు : పకపకా నవ్వి.. భలే చెప్పావు. నిజం మనం చదవగలం. ఎవరికీ అనుమానం అక్కరలేదు. కావాలంటే చూడండి..

నాగన్న : మనం చదవగలం. (నవ్వు)

వాలంటీరు : అవును మనం చదవగలం.. మన ఊరిలో పిల్లలు చదువుకోడానికి బడికి, కాలేజీలకు

వెళతారు. పెద్దవాళ్లు చదువుకోడానికి ఇదిగో, ఇట్లా అక్షరాస్యతా కేంద్రాలు పెట్టారు. ఇక్కడ పెద్దవారు చక్కగా చదువు నేర్చుకోవచ్చు. మన కేంద్రంలో మనం చదవగలం అనే పాఠంతో చదువు మొదలుపెడదాం. ఈ పాఠం పేరుతోనే మనం చదవగలం అనే నమ్మకం వస్తోంది కదూ!

**ఒకరు** : అవును. పాఠం పేరు వింటే మనం చదవగలం అనే నమ్మకం వస్తోంది.

**వాలంటీరు** : చూడండి. మనం చదవగలం అనే మాటను రాస్తే ఎట్లా ఉందో చూడండి. ఇదిగో మ.. నం... చ..ద..వ..గ..లం. ఒకో అక్షరాన్ని సరిగ్గా చూడండి.

(ఒక్కో అక్షరాన్ని వేలు పెట్టి చూపుతూ పలుకుతూ.. అభ్యాసకులతో కూడా పలికించండి.)

**వాలంటీరు** : ఇది 'మ' చూడండి మ ఎట్లా ఉందో... మ.. మ...మ. అందరూ అనాలి. అక్షరాన్ని చూస్తూ చదవండి.

**అందరు** : మ, మ, మ...

**వాలంటీరు** : ఇది న... చూడండి ఈ అక్షరం గోడ కుర్చీ వేసి మనిషి కూర్చున్నట్టే ఉంది కదా. అవునా? కాదా? 'న' ను వేలుతో చూపుతూ చెప్పండి.

**ఒకరు** : అవును. రెండోవారు: ఏం లేదు.

**వాలంటీరు** : సరిగ్గా చూడండి. 'న'ను. నా కట్ల అనిపించింది. చూడండి ఇది న.. న.. న. ఈ 'న' పక్కన సున్న పెడితే 'నం' అవుతుంది. అట్ల 'మనం' అయింది. ఈ సున్న ఎట్లా ఉందో చూడండి. ఉంగరం, గాజులను గుర్తు చేసుకోండి. మళ్లీ చూడండి.. 'మనం'... ఇక్కడో విషయం.. ఈ సున్నాను 'మ' పక్కన చేరిస్తే 'మం' అని, 'న' పక్కన చేరితే 'నం' అంటాం.

**ఒకరు** : మం, నం నేర్చుకున్నాం.

**వాలంటీరు** : ఇంకా నేర్చుకుందాం. ఇదిగో ఇది 'చ'. చూడండి చ ఎట్లా ఉందో.. చూడండి 'చ'ను. చూస్తూ అనండి 'చ'. చ..చ.. చ..

**అభ్యాసకులు** : చ. చ..చ.. చ..

**వాలంటీరు** : ఇదిగో ఇది 'ద'. చూడండి 'ఎట్లా ఉంది.. చూస్తూ అనండి 'ద' ఇది 'ద' 'ద' 'ద' 'ద'

**అభ్యాసకులు** : ద.... ద.... ద.... ద....

**వాలంటీరు** : ఇది 'వ'. చూడండి 'వ' ఎట్లా ఉంది.. చూస్తూ అనండి 'వ'. ఇది 'వ' 'వ' 'వ' 'వ'

**అభ్యాసకులు** : వ.... వ.... వ.... వ....

**వాలంటీరు** : ఇది 'గ'. చూడండి 'గ' .. చూస్తూ అనండి 'గ'. ఇది 'గ'.. 'గ'.. 'గ'..

**అభ్యాసకులు** : గ.... గ.... గ.... గ....

**వాలంటీరు** : ఇదిగో ఇది 'ల' ఎట్లా ఉందో చూడండి. (రాసి కూడా చూపవచ్చు)

**అభ్యాసకులు** : ల.... ల.... ల.... ల....

**వాలంటీరు** : ఈ 'ల' కు ఇందాక చెప్పుకున్న సున్న పెడితే 'లం' అంటాం. 'ల' కు సున్నా పెడితే ఏమంటాం. 'లం' అంటాం. మీరు చెప్పండి.

**అభ్యాసకులు** : 'ల' కు సున్నా పెడితే లం.... లం.... లం.... లం....

**వాలంటీరు** : మొత్తం 'మనం చదవగలం' అన్న మాటను ఎట్లా చదవాలో నేర్చుకున్నాం కదా. ఇందులో ఏమేమి అక్షరాలు వచ్చాయో, మనం ఏమి నేర్చుకున్నామో ఒకసారి చెప్పుకుందాం విడిగా. ఇదిగో ఇవి చూడండి.

**బోధనోపకరణాలు**

మీరు పాఠంలో నేర్పబోతున్న అక్షరాలను ముందుగా అట్టముక్క లేదా కాగితాలపై రాసి ఉంచాలి. ఒక్కొక్కటి తీసి చూపుతూ అక్షరాలను అభ్యాసకులు గుర్తించగలుగుతున్నారో లేదో చూడాలి. అభ్యాసకులతో చెప్పించాలి. దానివల్ల రానివారికి కూడా అవి చదవడం వచ్చేస్తుంది. వాటితో కొత్త పదాలను సొంతంగా తయారు చేయడం కూడా వివరించవచ్చు.)

## తెలిసిన అక్షరాలతో బొమ్మల పేర్లు

అక్షరాలను ఫ్లాష్ కార్డులపై చూపించడం అయిన తరువాత బొమ్మలు వాటికింద పేర్లను చదివించడం చేయాలి. బొమ్మ చూడగానే పేరు చెప్పేస్తారు. చెప్పిన తరువాత కింద ఉన్న అక్షరాలను కూడబలుక్కుని పేరు చదవమనాలి. పేరు తెలుసు, అక్షరాలను కూడా అప్పటికే పరిచయం చేశాం కాబట్టి తొందరగానే గుర్తించి చదువుతారు.

## తెలిసిన అక్షరాలతో పదాలు, వాక్యాలు

ఆ తరువాత ఇచ్చిన పదాలు, వాక్యాలు చదివి వినిపించాలి. అప్పుడే తెలుసుకున్న అక్షరాలతో కూడిన పదాలే కాబట్టి కూడబలుక్కుని బాగానే చదవ గలుగుతారు. మీరు సహాయం చేస్తుండాలి. ఒక్కో అక్షరం పట్టి పట్టి చదవడం వల్ల వారు ఆ అక్షరాలను బాగా గుర్తుంచుకుంటారు.

## రాయడం

ఇప్పటికి చదవడం వచ్చేసింది. ఇక రాయడం నేర్పాలి. ఈ ప్రక్రియలో భాగంగా ఈ వాచకంలో కొన్ని బొమ్మలు ఇచ్చి వాటిలో ఇప్పటి వరకు నేర్చుకున్న అక్షరాలను చూస్తూ కింద రాయమనాలి. రాసే పద్ధతి వారికి చెప్పాలి. సరిగ్గా ఎక్కడ మొదలుపెట్టి ఎట్లా రాయాలో చూపించాలి. ముందుగా ఇచ్చిన బొమ్మలను

చూసి మొదటి అక్షరాన్ని రాయమని చెప్పాలి. ఈ పాఠంలో నేర్చుకున్న అక్షరాలకు సున్నా కలిసే పదాలను ఇవ్వడం జరిగింది. వాటిని కింద రాయించాలి.

## సంఖ్యా పరిజ్ఞానం

ముందుగా నిత్యజీవితంలో ఉపయోగపడే అంకెల, లెక్కల అవసరాన్ని వివరించాలి. మొదటి పాఠంలో 1 నుంచి 9 వరకు అంకెలను నేర్పించాలి. బొమ్మలను లెక్కించి, ఎన్నో చెప్పమనడం ద్వారా వారంతా బోధన ప్రక్రియలో పాల్గొన్నట్లే. లెక్కించిన అంకె పక్కనే ఉంది కాబట్టి సులభంగా గుర్తిస్తారు. మీరు విడివిడిగా అంకెలను జాగ్రత్తగా చూసుకుంటూ చదవమనాలి. తరువాత అంకెలను చదివి రాయించే పని చేయించాలి. చివరగా మీరిప్పటికి ఏమి నేర్చుకున్నారో అవి ఒక్క దగ్గర రాయమనండి. సరిగ్గా రాస్తున్నారో లేదో చూడండి.

## అదనపు సమాచారం

- నూతనంగా అక్షరాస్యత సాధించిన వారికి పై చదువులు చదవటానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి.
- సార్వత్రిక విద్య ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకొని మళ్ళీ చదువు కొనసాగించవచ్చు.
- 10వ తరగతి పాసయిన వారికి ఐటిఐ ద్వారా కంప్యూటర్ కోర్స్, ఫ్యాషన్ టెక్నాలజీ, టైలరింగ్ కోర్సు మొదలైనవి పూర్తి చేసి సొంతగా ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయి.
- ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారికి నర్సింగ్, డిగ్రీ కోర్సులు చేసుకునే అవకాశాలు ఉన్నాయి.
- ముఖ్యంగా మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ వర్క్, బ్యూటీషియన్ కోర్సు డిజైనింగ్‌లు నేర్చుకొని ఉపాధిని పొందవచ్చు.
- మాట్లాడటంలో నైపుణ్యం గలవారు మార్కెటింగ్, యాంకరింగ్‌లలో రాణించగలుగుతారు.
- ఒకప్పుడు ఈ వయస్సులో చదువుకుని మేమేం చేస్తాం ఉద్యోగం చేస్తామా? రాజ్యాలేల్తామా? అన్న వాళ్ళు చాలా మంది అక్షరాస్యులుగా మారి రాజకీయరంగంలో సర్పంచ్‌లు, యం.పి.టి.సిలు, జెడ్.పి.టి.సిలుగా ఎన్నిక కాబడిన వారు కూడా ఉన్నారు. కావున విధిగా ప్రతి ఒక్కరు చదువుకుని తీరాలి.

**"చదువే మనిషికి జీవం.... చదువే మనిషికి జ్ఞానం"**

పాఠం – 2

# ఆదాయం పెంచుకుందాం

నమస్కారం అందరికీ. మీరంతా సరిగ్గా మనం అనుకున్న టైంకి వచ్చేయడం ఎంతో బాగుంది. నా సంతోషం మాటల్లో చెప్పలేను. మీకున్న శ్రద్ధ చూస్తే మీరంతా తొందరగా అన్నీ నేర్చుకుంటారనిపిస్తోంది. ఈ రోజు కొత్త పాఠంలోకి వెళుతున్నాం. మరి పాత పాఠంలో నేర్చుకున్న విషయాలు మర్చిపోవాలా.

అందరూ : అయ్యో! అదెట్లా? అవి గుర్తుంచుకుని ఇంకా వేరేవి నేర్చుకోవాలి కదా!

వాలంటీరు : కదా! ముందు పాత పాఠంలో ఏం నేర్చుకున్నామో ఒకసారి చూసుకుందాం. ఇదిగో మొదట్లో ఇవి నేర్చుకుందాం, పాఠం చివరన ఇంతవరకు ఏమి నేర్చుకున్నాం కింద ఉన్న అక్షరాలు ఒకసారి చదువుకుందాం. (అందరితో చదివించాలి)

వాలంటీరు : ఇక్కడ మీకో కథ చెబుతాను, నిజం కథే. బాలయ్య కొన్ని సంవత్సరాలుగా చిలుకూరులో పూలవ్యాపారం చేస్తున్నాడు. అతనికి పెద్దగా చదువు లేదు. కాని రోజూ అన్ని మార్కెట్‌లు, తోటల దగ్గరకు వెళ్లి ఎక్కడ చవకగా మంచి పూలు దొరుకుతాయో చూసుకునేవాడు. దాంతో వ్యాపారం లాభసాటిగా సాగేది. బాలయ్య మాత్రం తృప్తి పడలేదు. ఆదాయం పెంచుకోవాలనుకున్నాడు. పూల వ్యాపారం తప్ప మరొకటి తెలియదు, ఎలా అని ఆలోచించాడు. ఈ మధ్య ప్రతి చిన్న ఫంక్షన్ మొదలు, పెళ్లిళ్ల వరకు రకరకాలుగా పూల అలంకరణలు చేస్తున్నారు. పెళ్లిళ్లలో కొందరు రోజుకో అలంకరణ చేయించుకుంటున్నారు. ఆ పని తనూ చేయవచ్చు కదా అని అనుకున్నాడు. పట్నంకు వెళ్ళి ఆ పనిలో మెళకువలు తెలుసుకున్నాడు. గుడిలో మంటపాలకు, పెళ్ళిళ్లకు, గృహప్రవేశాలకు, పుట్టినరోజులకు, పండుగలకు కూడా తనే అలంకరణ చేయసాగాడు. మార్కెట్‌లో తోటివారి కన్నా కాస్త ధర తక్కువకు చేసేవాడు. దాంతో వ్యాపారం బాగా పెరిగింది. ఏ ఫంక్షన్ అయినా తన మనుషులతో వెళ్లి చెప్పిన వేళకు ముందే అనుకున్నదానికన్నా అందంగా అలంకరణ చేస్తాడన్న పేరు సంపాదించాడు.

మరో విషయం బాలయ్యకు చదువులేకున్నా , ఫోన్‌లో వాట్సప్ సందేశాలు పంపడం, రిసీవ్ చేసుకోవడం, ఫోటోలు పంపి ఆర్డర్లు బుక్ చేయడం వల్ల కూడా వ్యాపారం పెరిగింది. అట్లా బాలయ్య నైపుణ్యాలను పెంచుకోవడంతో బాటు కొత్తదనం జోడించడం వల్ల బాగా ఆదాయం పెరిగింది. ఆదాయం పెంచుకోవడంతో మంచి ఇల్లుకూడా కట్టుకున్నాడు. బాలయ్య కథ విన్నాక మీకేమనిపించింది?

అభ్యాసకులు : కష్టపడి జాగ్రత్తగా వ్యాపారం పెంచుకున్నాడు. ఆదాయం పెంచుకున్నాడు. బాగుపడ్డాడు.

వాలంటీరు : అవును. ఒక పద్ధతిగా కష్ట పడ్డాడు. తన పనిలో మెలకువలు పెంచుకున్నాడు. ఫోన్‌ను కూడా వాడాడు. ఆదాయాన్ని పెంచుకున్నాడు. ఇట్లా అందరూ చేయవచ్చు కదా. సరే



గాని ఇక మన పాఠంలోకి వద్దాం. ఈ బొమ్మను చూద్దాం. బొమ్మలో ఏం కనిపిస్తున్నవి? పెద్దమ్మ నువ్వు పెద్దదానివి నువ్వు చెప్పు ముందు. అందరూ చెప్పండి.

పెద్దమ్మ : ఏవో పనులు చేస్తున్నారు.

అభ్యాసకులు : కుండలు చేస్తున్నారు.

అభ్యాసకులు : వడ్రంగి పని జరుగుతోంది.

అభ్యాసకులు : తాపీ పని కూడా ఉంది.

అభ్యాసకులు : ఆయనెవరో డబ్బు ఇస్తున్నాడు.

అభ్యాసకులు : ఆయనెవరో ఏంది. ఆలుమగల్లా ఉన్నారు. మగాయన పైసలు భార్యకు ఇస్తున్నట్లు ఉంది.

వాలెంటీర్ : బాగుంది... సరిగ్గా చెప్పారు, అందరం రకరకాల పనులు ఎందుకు చేస్తున్నాం.

అభ్యాసకులు : పనులెందుకు చేస్తాం, పైసల కోసం కదా!

వాలంటీరు : పైసలకోసమే మనకు తెలిసిన పనులు చేస్తాం. బాలయ్య పూల వ్యాపారం ఎట్లా పెంచుకున్నాడు? ఒక్క పూల వ్యాపారంతో వచ్చే ఆదాయం ఆయనకు అక్కడికక్కడే అయింది కదా! ఆ వ్యాపారానికి తోడు ఆయన పూల అలంకరణ పని నేర్చుకున్నాడు. ఫోన్‌లో ఫోటోలు పంపి ఆర్డర్లు తీసుకోవడం చేశాడు. ఆదాయం పెంచుకున్నాడు.

అభ్యాసకులు : అవును పనిలో నేర్పు పెంచుకున్నందుకే ఆదాయం పెరిగింది. లేకుంటే ఎక్కడున్న గొంగళి అక్కడ్నే ఉండేది. ఆదాయం పెంచుకోవాలంటే, తెలివి కూడా పెంచుకోవాల్సిందే.

వాలంటీరు : కదా! ఆదాయం పెంచుకుందాం అని అందరం అనుకుంటాం. మనం చదవబోయే పాఠం కూడా అదే. మనం చదువు నేర్చుకుందాం. ఆదాయం పెంచుకుందాం సరేనా!

అందరం మళ్లీ మళ్లీ అనుకుందాం.. ఆదాయం పెంచుకుందాం... ఆదాయం పెంచుకుందాం. ఆదాయం పెంచుకుందాం. ఇదే ప్రతిజ్ఞ అని అందరూ అనుకోండి.

అభ్యాసకులు : ఆదాయం పెంచుకుందాం. ఆదాయం పెంచుకుందాం. ఆదాయం పెంచుకుందాం.

వాలంటీరు : ఇక చూడండి. ఈ ఆదాయం పెంచుకుందాం అనే మాటలో ఏమేమి అక్షరాలు వచ్చాయో..

నాగన్న : 'ఆ' 'ద' ఈ 'ద' ను మనం ముందు పాఠంలో నేర్చుకున్నాం కాని ఇది వేరుగా ఉంది.

వాలంటీరు : అవును ఇది వేరుగా ఉంది. అప్పుడు 'ద' అని మాత్రమే అన్నాం . ఇప్పుడు 'దా' అంటూ దీర్ఘం తీస్తున్నాం కదా.

అభ్యాసకులు : అవును 'దా' అంటున్నాము.

వాలంటీరు : ఏం లేదు. అప్పుడు నేర్చిన 'ద' తలమీద చెంచా తీసి ఇగో ఈ చారు గంటెను బోర్లించాం చూడండి. దీనిని దీర్ఘం అంటాం. అది దీర్ఘం లేని 'ద'. ఇది దీర్ఘం పెట్టిన 'ద' అంటే 'దా' గుంజి చదవాలి. (రాసి చూపించాలి.) ఈ దీర్ఘం గుర్తు ఇట్లానే వేరే అక్షరాలకు చేరిస్తే ఆ అక్షరాలు కూడా గుంజి దీర్ఘంతో చదువుతాం. దానిని అంటే ముందు 'ద' మీద ఉన్న గుర్తును (చెంచాను అంటూ నవ్వులు) తలకట్టు అంటారు. అది తీసి దీర్ఘం రాస్తే 'చ' 'చా' 'వ' 'వా' 'ల' 'లా' అని దీర్ఘం తీస్తూ చదవాలి. ఇక్కడ మనం ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. మనం 'మ' నేర్చుకున్నాం ఇప్పుడు ఆదాయం'లో 'య' వస్తుంది. కదా వీటికి దీర్ఘాలు ఇస్తున్నప్పుడు ఇదిగో ఇట్లా రాయాలి. 'మా' 'యా'

అభ్యాసకులు : ఈ రెండు ఒక్కలానే ఉన్నాయి కదా

వాలంటీరు : కరెక్ట్. బాగా చూసావు. కానీ ఇంకొంచెం చూడు. అక్కడ 'మ' లో సున్నా చిన్నగా ఉ ండి, ఈ తలకట్టు సున్నా పైకి పోయింది. 'య' లో సున్నా కొంచెం పెద్దగా ఉండడమే కాదు తలకట్టు ఆ పెద్దసున్నా పక్కకు మాత్రమే ఉంది. సున్నా పైకి ఎక్కదు. సరే 'ఆదా' పక్కన ఏముంది.. ఊహించి చెప్పండి.

అభ్యాసకులు : ఏముంది.. ఆదా....యం.... అంతే కదా.. యం ఉంది.

వాలంటీరు : సూపర్. 'య' ఉంది. 'య' చూడండి 'య' ఎట్లా ఉందో.. ఇదేమిటి అంటూ ఫ్లాష్ కార్డులో రాసుకున్న 'య' ను మీరు నోటు పుస్తకంలో విడిగా రాసి చూపిస్తున్న 'య'ను చూపించండి. ఎట్లా ఉందో .. చూడండి. నాతో అనండి. 'య' 'య' తరువాత ఉన్నది సున్నా. ముందుపాఠంలో నేర్చుకున్నాం కదా. దీనిని అక్షరాల పక్కన రాస్తాం. 'య' కు సున్నా పెడితే 'యం' అందరూ చెప్పండి 'య' కు సున్నా పెడితే 'యం'

అభ్యాసకులు : 'య' కు సున్నా పెడితే ....యం..యం..యం..యం..

వాలంటీరు : ఆదాయం తరువాత ఏమి వస్తుంది...

అభ్యాసకులు : పెంచుకుందాం. అంటే 'పె'.

వాలంటీరు : అవును 'పె' వస్తుంది. అసలు అక్షరం 'ప' అయితే ఇందాక దీర్ఘం చేర్చినట్లే 'ప' మీద తలకట్టు తీసి ఎత్వం ' ె ' గుర్తును పెడితే ఆ అక్షరాన్ని 'పె' అని చదువుతున్నాం. ' ె ' గుర్తును 'ఎత్వం' అంటారు. 'ఎ' అక్షరం గుర్తు ఇది. ఇక్కడ ఇదిగో ఈ 'ప' కు తలకట్టు తీసి 'ఎత్వం' పెడితే అది 'పె' అయింది.

అభ్యాసకులు : పెం కదా..

వాలంటీరు : గుడ్. 'పె' కు సున్నా పెడితే 'పెం' అని చదువుతాం. ఇట్లా దేని పక్కకు సున్నా వచ్చినా దానిని కలిపి 'మ్' అని చదువుతాం. చూస్తూ అందరూ నాలుగయిదు సార్లు అనండి. 'పెం' 'పెం'.

అభ్యాసకులు : 'పెం'.... 'పెం'..... 'పెం'... 'పెం'

వాలంటీరు : అక్షరాన్ని బాగా చూస్తూ చదవండి. అది ఎట్లా ఉందో మైండ్‌లో ఉండిపోవాలి. అట్లా చూడండి. ఇక తరువాతి అక్షరం 'చు' ఇక్కడ 'చ' కు కొమ్ము ఇచ్చారు. ఇది 'ఉ' అనే అక్షరం గుర్తు. 'ఉత్వం' అంటారు. కొమ్ములా ఉంది కదా చూడండి ' ు ' అందుకే దీనిని కొమ్ము అన్నట్టున్నారు. ఈ కొమ్మును ఏ అక్షరం పక్కకు చేరిస్తే దానికి ఉత్వం చేరినట్లు. వేరుగా పలకాలి. 'చ' కు కొమ్ము ఇస్తే 'చు' అవుతుంది. మనం నేర్చుకున్న 'మ' కు కొమ్ము ఇస్తే 'ము' అవుతుంది. అనండి 'చ' కు కొమ్ము ఇస్తే 'చు' 'చు' అట్లే ఈ 'చు' పక్కన ఏముందంటారు?

అభ్యాసకులు : పెంచు..... కు..

వాలంటీరు : కరెక్ట్.. ఇది 'క' కు కొమ్ము ఇస్తే 'కు' ఎట్లా రాస్తున్నామో చూడండి.. అందరూ అనండి.. 'క' కు కొమ్ము ఇస్తే కు... కు...కు... కు... అనండి.

అభ్యాసకులు : 'క' కు కొమ్ము ఇస్తే కు... కు...కు... కు...

వాలంటీరు : తరువాత మళ్లీ ఏముంది?

అభ్యాసకులు : ఈ 'కు' కు పక్కన 'సున్నా' ఉంది.

వాలంటీరు : ఆ అదీ. 'కు' కు సున్నా ఇస్తే 'కుం' అనండి అందరూ.

అభ్యాసకులు : 'కు' కు సున్నా ఇస్తే 'కుం' కు' కు సున్నా ఇస్తే కుం' కు' కు సున్నా ఇస్తే కుం'

వాలంటీరు : తరువాత మళ్లీ ఏముంది! మీకు తెలిసిందే చూడండి.

అభ్యాసకులు : ఆదాయంల నేర్చుకున్నాం.. 'దా' ఉంది.

వాలంటీరు : తరువాత ఏముంది. మీకు తెలిసిందే చూడండి.

అభ్యాసకులు : సున్నా ఉంది. 'దా' పక్కకు సున్నా ఉంది.

వాలంటీరు : మీకు తెలుసు కదా 'దా' కు సున్నా రాస్తే 'దాం'

అభ్యాసకులు : 'దా' కు సున్నా రాస్తే 'దాం', 'దా' కు సున్నా రాస్తే 'దాం'

వాలంటీరు : ఇట్లా అన్ని అక్షరాలకు ఇక్కడ మనం నేర్చుకున్న దీర్ఘం, కొమ్ములు పక్కన రాస్తే... వాటిని వేరుగా పలుకుతాం. ఈ పాఠంలోనే కాదు, ఒకటో పాఠంలో నేర్చుకున్న అన్ని అక్షరాలకు ఈ గుర్తులు చేరిస్తే, ఎట్లా పలుకుతామో ఒకసారి చూద్దాం. 'మ' కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'ముం', 'న' కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'నుం', 'చ' కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'చుం', 'ద'కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'దుం' 'వ' కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'వుం', 'గ' కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'గుం', 'ల' కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'లుం', 'య' కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'యుం', 'ప' కు కొమ్ము ఇచ్చి సున్నా పెడితే 'పుం' అవుతాయి. అట్లే అన్ని గుర్తులు అన్ని అక్షరాలకు చేరతాయి. (రాసి చూపిస్తూ చదవాలి)

ఇప్పుడు మన పాఠం మొత్తం పేరు వచ్చేసిందిగా 'ఆదాయం పెంచుకుందాం'. జాగ్రత్తగా ఒక్కొక్క అక్షరాన్ని చూస్తూ చదవండి. మళ్లీ మళ్లీ గుర్తుండిపోయేంత వరకు ఒక్కొక్క అక్షరాన్ని చూస్తూ వేలుపెట్టి చదవండి.

ఈ పాఠంలో కొత్తగా నేర్చుకున్న దీర్ఘం, ఎత్వం, కొమ్ము లను ఇతర అక్షరాలకు కలిపి రాయడం చూపించాలి. చదివించాలి.

## బొమ్మల పేర్లు

పాఠం పేరు అయ్యాక, కింద ఉన్న బొమ్మలు చూపి ఆ కింది పేర్లను చదవించాలి. బొమ్మల ద్వారా పాఠంలో కొత్తగా వచ్చిన అక్షరాలు, గుర్తులను చదివించి బాగా గుర్తుండిపోయేలా చేయాలి.

## పదాలు

బొమ్మల కింద ఇచ్చిన పదాలను చదివించాలి. చదవలేని వారికి సాయం చేయాలి. సొంతపదాలు చెప్పించండి.

## రాయడం

ఆ తరువాత కొత్తగా నేర్చిన వాటిని రాసే అభ్యాసం చేయించాలి. బొమ్మల మొదటి అక్షరాలు కొత్తగా నేర్చుకున్నవై ఉంటాయి. వాటిని రాయడం ద్వారా ఆ అక్షరాలు మనవారికి వచ్చేస్తాయి. రాసేటప్పుడు ఎక్కడ మొదలు పెట్టాలో ఎట్లా తిప్పాలో చూపించి రాయమనాలి.

## లెక్కలు / అంకెలు

ముందు పాఠంలో 1 నుంచి 9 అంకెలను గుర్తు పట్టడం రాయడం నేర్చుకున్నాం. ఇప్పుడు 10 నుండి 20 వరకు సంఖ్యలు నేర్చుకుంటాం. ఒకటి, రెండు అంటు నోటి లెక్కలు బాగానే మనవాళ్లకు

తెలుసు కాబట్టి పక్క డబ్బాలో ఉంచిన బొమ్మలను లెక్కపెట్టి ఆ పక్కన ఉన్న సంఖ్యను గుర్తు పట్టడం నేర్పుతాం. దాన్ని చూసి చదివి గుర్తుపట్టేలా చేయాలి. ఆ తరువాత రాయించాలి. అంకెలు నేర్పేటప్పుడు బోధనోపకరణాలు బాగా వాడవచ్చు. మామూలుగా ఒకటి రెండు మూడునుంచి తొమ్మిది వరకు సంఖ్యలకు ఫ్లాష్ కార్డులు తయారు చేసుకోవాలి. చిన్న చిన్న గులకరాళ్లు, కర్ర పుల్లలు, గింజలు జమ చేసుకుని కూడికలు, తీసివేతలు తేలిగ్గా నేర్పవచ్చు.

తరువాత రూపాయలు నాణాలు చూడ్డం అలవాటే కాబట్టి వాటితో కూడా కూడికలు నేర్పే ప్రయత్నం చేస్తాం. ఇక్కడ ముందుగా బొమ్మలను కూడి చెప్పడం జరిగింది. అర్థమయ్యేలా చెప్పండి.

చివరగా ఇప్పటివరకు ఏం నేర్చుకున్నారో చర్చించండి. సొంతపదాలు చెప్పిస్తే ఉత్సాహంగా ఉంటుంది.

## అదనపు సమాచారం

**నూ**తనంగా అక్షరాస్యులుగా మారిన గ్రామీణ, పట్టణ యువతీ యువకులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ వారి ఆదాయాన్ని పెంచుకుని ఆర్థికంగా ఎదగవచ్చు. అనే విషయాన్ని తెలుపాలి.

**యువతీ, యువకులకు:**

బ్యాంకు ద్వారా ఋణాలు పొంది కిరాణా షాప్, బేకరీ షాప్, వాటర్ సర్వీసింగ్, మెకానిక్ ట్రైనింగ్, కంప్యూటర్‌వర్క్, మొబైల్ రిపేర్, టిఫిన్ సెంటర్‌ల ద్వారా ఉపాధి కల్పించుకుని ఆదాయాన్ని పొందవచ్చు. టైలరింగ్, ఎంబ్రాయిడరీవర్క్, మగ్గం వర్క్, పిండి వంటల తయారీ, పచ్చళ్ళ తయారీ, బ్యూటీషియన్ కోర్సులు దగ్గరలోని వీటిపై శిక్షణ ఇచ్చే వారిని సంప్రదించి వారి కేంద్రాల ద్వారా నేర్చుకుని ఉపాధి పొందవచ్చు. ఆదాయాన్ని పొందవచ్చు.

ఇవే కాకుండా ఇంకా అనేక రంగాల్లో నైపుణ్యాలను సాధించి, సొంతకాళ్ళపై నిలబడగల సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసం పొందుతారు.

**"అక్షరాస్యతను సాధిద్దాం - ఆదాయ మార్గాలను అన్వేషిద్దాం"**

పాఠం - 3

# ఇరుగు పొరుగు - మాటా మంతి

## మాటా మంతీ

వాలంటీరు : అందరికి నమస్కారం. ఇంకా అందరూ రాలేదు కదా!

వాలంటీరు : సీనన్న ఈ సారి ఏం పంట వేసావు?

సీను : ఈ సారి నిజానికి మొత్తం వరి వేయాలనుకున్నా. కాని మన వ్యవసాయ అధికారి రంగా రావు, ఈ సారి వర్షాలు తక్కువ పడొచ్చు, వద్దన్నాడు. మెట్ట పంటలే మేలన్నాడు. మా పొరుగున ఉన్న వాళ్లతో కూడా మాట్లాడాను. అందరం వద్దు అనుకున్నాం.

వాలంటీరు : అవును మా నాన్న కూడా అదే అన్నాడు. ఆయన కూడా వరి వేయలేదు. ఇంటి కోసం కుంట భూమిలో వరి నాట్లు వేశారు. ఇరుగు పొరుగు రైతులం అందరం ఆలోచించుకుని చేస్తే పంటపై లాభం బాగానే వస్తుంది. అందరూ వచ్చేశారా... ఈ విషయాలు అందరికీ తెలియాలి. అందరు లాభపడాలి. మనమంతా ఇరుగు పొరుగు వాళ్లం. మన పొరుగు బాగుంటే మనం బాగుపడతాం. అందుకే మనందరం "ఇరుగుపొరుగుతో మాటామంతి" బాగుండేలా చూసుకోవాలి.

అభ్యాసకులు : అవును. ఇరుగు పొరుగుతో మంచి మాట ఉంటేనే సంతోషం కదా!

వాలంటీరు : అవును. మీరే చెపుతున్నారుగా ఇరుగు పొరుగు, మాటా మంతి.. ఇదే ఈ రోజు మనం మొదలు పెట్టే పాఠం. ముందు మనం ఏం చేయాలి. ఇంతవరకు నేర్చుకున్న రెండు పాఠాల్లో ఏం నేర్చుకున్నామో ఒక సారి గుర్తు చేసుకుందాం. (రెండో పాఠం చివర ఇప్పటి వరకు ఏం నేర్చుకున్నాం అన్న విషయాన్ని మీ దగ్గర ఉన్న అక్షరాలను ఫ్లాష్ కార్డుల్లో చూపుతూ చదివించండి. చదవలేనివారిపై మరింత దృష్టి పెట్టండి). ఇక ఇప్పటి పాఠం

ఆభ్యాసకులు : **ఇరుగు పొరుగు - మాటా మంతి.**

వాలంటీరు : గుడ్. బాగుంది. ఇప్పుడు మనం చదువుకోబోయే పాఠం ముందున్న బొమ్మ చూద్దాం చూడండి ఏముంది బొమ్మలో?

అభ్యాసకులు : బొమ్మ రెండుగా ఉంది. పైన ఎవరెవరో ఉన్నారు.

వాలంటీరు : ఎవరున్నారో బాగా చూడండి. ఏముంది చెప్పండి

అభ్యాసకులు : బొమ్మపైన ఒక పక్కింటామె గిన్నెలో ఏమో పెట్టుకొని వచ్చి ముచ్చట్లు పెట్టినట్టు ఉంది.

అభ్యాసకులు : కింది బొమ్మలో కూడా అందరూ కలిసి మాట్లాడు కుంటున్నారు.

వాలంటీరు : అంటే ఏముంది బొమ్మలో?

అభ్యాసకులు : బొమ్మలో అందరూ ఇరుగు పొరుగు మాట్లాడుకుంటున్నట్లు అనిపిస్తోంది.



వాలంటీరు : కరెక్ట్. ఇరుగుపొరుగు ఇట్లే ఉండాలి. గొడవలు లేకుండా అందరు మాట్లాడుకుంటూ, సాయం చేసుకుంటూ బతకాలి. మంచి మాటతో కలిసి ఉండాలి. ఆ మంచి మాటనే మాటా మంతి అంటారు. అందరూ బాగుండాలి అని చెప్పడానికే చెప్పిన పాఠం ఇది. మనం ఇప్పుడు చదివే పాఠం.. ఇరుగు పొరుగు – మాటా మంతి. ఏ పాఠం చదువుతున్నాం మీరు చెప్పండి.

అభ్యాసకులు : ఇరుగు పొరుగు – మాటా మంతి.

వాలంటీరు : ఇందులో మనం ఇప్పటి వరకు నేర్చుకున్న అక్షరాలు ఉన్నాయా. బాగా చూడండి.

అభ్యాసకులు : ఉన్నాయి. ఉన్నాయి.

అభ్యాసకులు : ఇరుగు పొరుగు .. ఆ ఇక్కడ 'గ' కొమ్ము ముందే అనుకున్నాం.

అభ్యాసకులు : 'మ' కు దీర్ఘం కూడా నేర్చుకున్నాం. 'మ' కు దీర్ఘం ఇస్తే 'మా' అయింది.

వాలంటీరు : నిజంగా సూపర్. అందరూ జాగ్రత్తగా వింటున్నారు. చదువుతున్నారు అని నాకు తెలిసింది. మీరు అందరూ గుడ్. ఈ ఇరుగు పొరుగు లో మొదటి అక్షరం ఏదో మీరే చెప్పండి

అభ్యాసకులు : ఇ..

వాలంటీరు : తరువాత..

అభ్యాసకులు : 'రు'

వాలంటీరు : 'రు' ని చూస్తూ మీరేమైనా చెప్పగలరా... ఆలోచించండి.

అభ్యాసకులు : కొమ్ము వచ్చింది.

వాలంటీరు : కరెక్ట్. ఇక్కడ ఇది 'ర' అక్షరం. ఆ 'ర' కు కొమ్ము ఇస్తే 'రు' అయింది. పక్కన ఉన్నది

'గ' కు కొమ్ము. మనం ముందే చదువుకున్నాం. కొత్తగా 'ఇ', 'ర' మనకు వచ్చాయి. ఇంకా చదవండి.

అభ్యాసకులు : ఇదేమిటో... పొరుగు అన్నావు కదా... 'పొ'

వాలంటీరు : ఇది 'పొ' మనం ముందు నేర్చుకున్న పాఠంలో ఉన్న 'ప' కు 'ఎత్వం' లాగానే ఇది 'ప' కు 'ఒత్వం' '౦ా' గుర్తు. 'ఒ' అనే అక్షరం గుర్తు 'ఒత్వం'. 'ప' కు 'ఒత్వం' ఇస్తే 'పొ' 'ర' కు 'ఒత్వం' ఇస్తే 'రొ' ఇంతవరకు ఏమి నేర్చుకున్నారో అభ్యాసకులతో చెప్పించాలి. 'గ' కు 'ఒత్వం' ఇస్తే 'గొ' అన్నమాట. ఇక తరువాత 'రు', 'గు' చెప్పుకున్నవే కదా. ఆ తరువాత..

అభ్యాసకులు : 'మ' కు దీర్ఘం చెప్పావు కదా... 'మా'.

వాలంటీరు : అవును 'మా' తరువాత అక్షరం మీరు ఊహించగలరు... 'ట' 'ట' కు దీర్ఘం ఇస్తే 'టా' అవుతుంది. చూడండి ఇది 'ట' అక్షరం.. దీనికి ఈ దీర్ఘాన్ని చేరిస్తే 'టా' అయ్యింది. సరిగ్గా చూడండి. 'ట' ఎట్లా ఉందో. రాము బాబాయ్ నువ్వు భుజంపై వేసుకునే టవలు ఈ 'ట' తోనే మొదలవుతుంది.

అభ్యాసకులు : 'టమాటా' కూడా కదా.

వాలంటీరు : అవును. ఈ 'ట' కు దీర్ఘం ఇచ్చారు. 'ట' కు దీర్ఘం ఇస్తే....

అభ్యాసకులు : 'ట' కు దీర్ఘం ఇస్తే 'టా' 'ట' కు దీర్ఘం ఇస్తే 'టా'

వాలంటీరు : అందరూ చూస్తూ చదవండి.

అభ్యాసకులు : 'ట' కు దీర్ఘం ఇస్తే 'టా' 'ట' కు దీర్ఘం ఇస్తే 'టా'

వాలంటీరు : ఆ తరువాత 'మ' కు సున్నా తెలిసిందే. అయినా మళ్లీ చూసి , ముందు అనుకున్నట్లు వేలు పెట్టి చదవండి.

అభ్యాసకులు : 'మ', మకు సున్నా ఇస్తే 'మం'

వాలంటీరు : ఆ తరువాతి అక్షరం మనం ఇప్పటివరకు నేర్చుకోలేదు. 'త' కి గుడి ఇచ్చారు. నెత్తిమీద ఇట్లా చుడుతున్నాం.. సరిగ్గా చూడండి.. నేను రాస్తుంటే... మళ్లీ రాస్తున్నాను చూడండి. ఇది 'త' అక్షరం. తలకట్టు తీసేసి... 'గుడి' పెట్టాను. 'గుడి' అనేది మనం ఇప్పుడు నేర్చుకున్న 'ఇ' అక్షరానికి గుర్తు. ఈ గుడిని మనం ఇంతకు ముందు నేర్చుకున్నట్లుగానే వేరే క, గ, చ, ట, త, ద, ప ,వ, ల, మ, య లకు కూడా గుడి పెట్టి చూద్దాం. అయితే అన్ని అక్షరాలకు తలకట్టు తీసి రాస్తాం. 'య' విషయంలో మాత్రం వేరుగా ఉంటుంది. తలకట్టు తీస్తే చాలు. అంటే ఇట్లా 'యి' . దీన్ని యకి గుడి ఇస్తే యి (ఇ) అని చదువుతాం. ఇక్కడో విషయం. య గుడి తో యి అనేది, ఇరుగులో వచ్చిన అచ్చు అక్షరం 'ఇ' సౌండ్ ఒక్కటిగా ఉండడం గమనించాలి. బాబాయ్ ఇప్పుడు నేను చెప్పినది నువ్వు కూడా చెప్పు

అభ్యాసకుడు : ఏది?

వాలంటీరు : 'య' కి గుడి గురించి చెప్పిన విషయం.

అభ్యాసకుడు : అదా. 'య' కి గుడి ఇచ్చి చదివితే యి, 'ఇ' అక్షరం చదివినా 'ఇ' అనే అంటాం.

వాలంటీరు : అర్థం అయ్యింది కదా చాలు. ఇదే రకంగా 'వ' కి కొమ్ము ఇస్తే 'ఉ' అని చదువుతాం. అక్షరం 'ఉ' కూడా ఉంది. అది ముందు తెలుసుకుంటాం.

సంఖ్యా పరిజ్ఞానం : ఇక్కడ మనం 21 నుంచి 30 వరకు సంఖ్యలు గుర్తు పట్టాలి, చదవాలి, రాయాలి. అందుకోసం వాడిన ప్రక్రియ... 20 కి ఒకటి కలిపితే... 21 అలాగే 2 కలిపితే 22. 3 కలిపితే 23. 4 కలిపితే 24... ఇట్లా 30 వరకు మీరు చెప్పి వాళ్లతో చెప్పించండి. ఆ తరువాత లడ్డూల లెక్క ఉంది. చూడండి. కూడికలు చేయడం వస్తుంది. తరువాత కూడి సంఖ్య రాసే అభ్యాసం ఉంది. అన్ని చక్కగా చెప్పి చేయించండి.

ఆ తరువాత రూపాయి నోట్లు, నాణేలు కలిపి కూడడం నేర్పండి. అది నిజానికి చదువు లేకున్నా వాళ్లు ఇప్పటి వరకు చేస్తున్నదే. 20కి నాలుగు రూపాయి నాణేలు కలిపితే ఎంతో చెపుతారు. అది రాయడం ఇప్పుడు నేర్చుకుంటారంతే.

చివరగా ఇప్పటివరకు నేర్చుకున్న అక్షరాలను మననం చేయడంతో ఈ పాఠం పూర్తయినట్లు.

## అదనపు సమాచారం

- మాట్లాడటం ఓ కళ. చక్కగా మాట్లాడేవారు ఇతరుల అభిమానాన్ని పొందుతారు.
- ఇరుగు పొరుగు వారితో మంచి సంబంధాలు కలిగి ఉండటం అన్ని వేళలా శ్రేయస్కరం. కష్టమొచ్చినా, ఆపద వచ్చిన, ఇబ్బందులు కలిగినా ముందుగా ఆదుకోవడానికి సిద్ధపడేది ఇరుగు పొరుగే.
- ఇంట్లో జరిగే శుభకార్యాలకు, అశుభకార్యాలకు కూడా వారే ముందుండి సాయం చేస్తారు.
- మనం నివసించే ప్రాంతంలోని అసౌకర్యాలను తొలగించటంలో, సౌకర్యాలను కల్పించుకోవటంలో కలిసి పని చేయడం వల్ల విజయవంతంగా పూర్తిచేయగలుగుతాము.
- ఇరుగు పొరుగుతో మంచిగుంటే ఇతరులు మన మంచితనాన్ని గుర్తిస్తారు. మంచితనం ఎప్పటికి మంచినే చేస్తుంది.
- పండుగలు, వేడుకలు చేసుకున్నప్పుడు, ఒకరిండ్లకు ఒకరు వెళ్ళటం ద్వారా వారసత్వంగా భావితరాలకు దానిని అందించినవారం అవుతాము. లేదంటే ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉంటుంది.

కనుక అందరం కలిసి మెలిసి ఉండటం మంచిది. ఒకరికొకరు సహాయం చేసుకోవడం వల్ల గొప్ప అనుభూతి కలుగుతుంది.

**"కలిసి ఉంటే కలదు సుఖం"**

పాఠం – 4

# ఒకరికి ఒకరు తోడైతే అదే సంఘం

## మాటా మంతి

యథా ప్రకారం అందరిని నవ్వుతూ పలకరించాలి. పనులు చేసిచేసి అలసి వచ్చేవారికి ఉల్లాసం కలిగేలా ఏమైనా సరదాగా మాట్లాడండి.

వాలంటీరు : అందరికీ నమస్కారం. పెద్దమ్మ ఏంది నీ కోడలిని అదే మా వదినెను తిడుతున్నావట. సూర్యకాంతం లెక్కన.

పెద్దమ్మ : నేనెప్పుడూ మీ వదినెను తిట్టనే లేదు. ఎవరు చెప్పారు నీకు. అత్తలంతా చెడ్డోళ్లు అన్నట్లు చేసేశారు. నేను నా కోడలు బాగానే ఉంటాం. అయినా అత్త కోడళ్ల సినిమాలలో సూర్యకాంతం అట్ల తిట్టినట్టు చూపారు కాని, నిజానికి ఆమె చాలా మంచిదటరా.

వాలంటీరు : నిజమే పెద్దమ్మ. సినిమాలలో చూపించే వన్ని నిజం కాదు. విలన్‌లు నిజంగా చెడ్డవాళ్లు కాకపోవచ్చు. నేనూ విన్నా. సూర్యకాంతం చాలా మంచి మనిషి అని. రా నాగన్న. నీతో అందరూ వచ్చినట్టేనా.. లేదు ఇంకా భాగ్యం వదిన రాలేదు కదా!

పెద్దమ్మ : భాగ్యంతో వాళ్ల ఆయన రాత్రి ఏదో గొడవ పడినట్టున్నారు. వస్తుందో రాదో!

నాగన్న : అదిగో వస్తూనే ఉంది.

అందరూ : నీకు నూరేళ్లు. ఇప్పుడే అనుకుంటున్నాం.

భాగ్యం : ఎందుకు నూరేళ్లు. ఎప్పుడు చావాలా అని చూస్తున్న. ఏం బతుకు ఇది. నాలుగు రోజులు బాగుంది, సంపాదన సరిపోతుంది అనుకుంటే. అయిదో రోజు ఆయన ఇంటికి పైసలు తేడు... తాగి పడతాడు. ఉన్నది ఉంచుకున్నది అంతా ఆ మందు (వైన్స్) దుకాణానికి పోతుంది. పైగా పత్తాల ఆటకు నేను దాచుకున్న డబ్బు కూడా పట్టుకపోయాడు. పిల్ల కొత్తబట్టలు కావాలి అని అడుగుతోంది, అవి దాచిన పైసలు. నన్ను కొట్టి... ఏడ్చేసింది భాగ్యం.

పెద్దమ్మ : అయ్యో. ఇంతకే చావాలనుకోడం ఏమిటి. మేమంతా నీకు లేమా! మీ ఆయనకు బుద్ధి చెపుతాం. మనమంతా ఒకటి. ఒకరికి ఒకరం తోడుగ ఉండాలి. నీ కష్టం మా కష్టం కాదా!

వాలంటీరు : పెద్దమ్మ బాగా చెప్పింది. మనమంతా ఒకరికి ఒకరం తోడు. అయినా భాగ్యం వదినా, నువ్వు పెద్దమ్మ ఒక సంఘంలో ఉన్నారు కదూ. ఒకరికి ఒకరు తోడైతే అదే సంఘం కదా. మీరంతా ఒకరికి ఒకరు తోడు ఉంటారు కదా..

నాగన్న : నువ్వన్న మాట చాలా బాగుంది. 'ఒకరికి ఒకరం తోడైతే అదే సంఘం' అన్న మాట చాలా బాగుంది.

అవును నాక్కూడా.  ఒకరికి ఒకరం తోడైతే అదే సంఘం అన్న మాట బాగుంది. అది నిజం కదా. 'ఒకరికి ఒకరం తోడైతే అదే సంఘం'.

వాలంటీరు : నిజం. ఒకరికి ఒకరం తోడైతే అదే సంఘం. ఈ రోజు మన పాఠం కూడా అదే. బొమ్మ చూడండి.

అభ్యాసకులు : ఇది పొదుపు సంఘం బొమ్మే కదా? పొదుపు సంఘంలో కూడా ఒకరికి ఒకరు తోడైతే అన్నట్లే ఉంటారు ఒక్కమాట మీద ఉంటారు.



వాలంటీరు : అవును ఇది పొదుపు సంఘం. ఇట్లా మనకు చాలా సంఘాలు ఉన్నాయి. రైతు మిత్ర సంఘం, గోపాల మిత్ర సంఘం, విద్యా కమిటీలు ఇట్లా చాలా ఉన్నాయి. ఏ సంఘంలోనైనా సభ్యులు అందరూ ఒకరికి ఒకరు తోడుగా నిలబడాల్సి ఉంటుంది. ఒక్కరుగా చేయలేని పనులు పదిమంది కలిసి చేయగలం. అప్పుడే సంఘంగా బాగా పనిచేయగలుగుతారు అప్పుడే అందులో సభ్యులు, సంఘం బాగా పనిచేస్తుంది. మొత్తానికి ఇప్పుడు మన పాఠం 'ఒకరికి ఒకరు తోడైతే అదే సంఘం'. ఇందులో మనం ఇంతకు ముందు నేర్చుకున్న అక్షరాలు, కొత్త అక్షరాలు ఉన్నాయి చూద్దాం.

భాగ్యం వదిన ఇదిగో ఈ పాఠం పేరు చూడు. అక్షరాలేమిటో చెప్పు.

భాగ్యం : 'ఒ' కదూ... ఇది నేర్చుకోలేదు. 'క' వచ్చు. 'ర' కి గుడి 'రి' తెలుసు. 'క' కి 'గుడి' కి తెలుసు.  మళ్లీ ఒకరం అన్నావు ఇది 'ఒ' 'క' తెలుసు. 'ర' పక్కన సున్నా అంటే...

నాగన్న : 'రం'

నరసయ్య : ఇది 'త' కి  ఏదో ఇది

వాలంటీరు : సంతోషం చెప్పినవన్నీ గుర్తు ఉన్నాయి మీకు. ఇది 'త' కి 'ఓత్వం' లేదా ఒత్వం దీర్ఘం. 'త' కి 'ఒత్వం దీర్ఘం' ఇస్తే 'తో' అని దీర్ఘంగా చదువుతాం. ఇందులో మనం 'ఒ' కొత్తగా నేర్చుకుంటున్నాం. చూడండి బాగా... ఇది 'ఒ' ఇది 'ఒ'.. ఏమిటిది?

అభ్యాసకులు : ఒ...ఒ....ఒ..ఒ...ఒ

ఒకరు : ఒంటెలాగుంది.

వాలంటీరు : ఊ. తరువాత ఇక్కడ మనకు 'త' కి 'ఓత్వం దీర్ఘం' 'ో' ఇస్తే 'తో' అన్నాం. మీరంతా చెప్పండి.

అభ్యాసకులు : 'త' కి 'ఓత్వం దీర్ఘం' 'ో' ఇస్తే 'తో', 'త' కి 'ఓత్వం దీర్ఘం' 'ో' ఇస్తే 'తో', 'త' కి 'ఓత్వం దీర్ఘం' 'ో' ఇస్తే 'తో', 'త' కి 'ఓత్వం దీర్ఘం' 'ో' ఇస్తే 'తో'

వాలంటీరు : ఈ 'ఒత్వం దీర్ఘం' 'ో' ను వేరే అక్షరాలకు పెట్టి చూద్దాం. 'క' కి 'ఒత్వం దీర్ఘం' 'ో' ఇస్తే 'కో' అవుతుంది. 'ర' 'ఒత్వం దీర్ఘం' 'ో' ఇస్తే 'రో', పకి ఇస్తే 'పో' ఇట్లా. మనం ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. 'మ' కు 'ఒత్వం దీర్ఘం' 'ో' ఇస్తే 'మో' చూడండి, 'య' కి 'ఓత్వం' ఇస్తే 'యో' అని రాయలి. చదవడం మాత్రం 'మో', 'యో' అనే. ఇవి మళ్లి మళ్లి చూడండి. ఇది 'మో'. ఇది 'యో'.

తరువాత 'తో' తరువాత 'దై' వచ్చింది. (చూపించిన తరువాత చదివి వినిపించాలి.)

ఇది నిజానికి ద అక్షరం, 'ద' కు ఐత్వం 'ై' ఇస్తే అది దై అని చదువుతాము. ఈ 'క' కు 'ై' ఇస్తే 'కై', 'ర' కు ఐత్వం – 'ై' ఇస్తే 'రై' 'త' కు 'ై' ఇస్తే 'తై' అని చదువుతాము. 'మ' కు 'ై' ఇస్తే 'మై', 'య' కు 'ై' ఇస్తే 'యై', 'ప' కు 'ై' ఇస్తే 'పై' ఇట్లా అన్ని అక్షరాలకు ఇవ్వవచ్చు. ఇప్పుడు మన పాఠంలో 'దై' వచ్చింది. 'ద' కు 'ఐత్వం' 'ై' ఇస్తే 'దై' బాగా చూసి అందరం చదువుదాం... మర్చిపోకూడదు మరి.

అభ్యాసకులు : 'ద' కు 'ఐత్వం' 'ై' ఇస్తే 'దై', 'ద' కు 'ఐత్వం' 'ై' ఇస్తే 'దై'

వాలంటీరు : ఇప్పుడు 'తే' అక్షరం వచ్చింది. ఈ అక్షరాన్ని గుర్తు పట్టారా... 'త'. ఇంతకు ముందు 'త' కు 'ఎత్వం' ఇస్తే 'తె' అని చదివాం. ఇప్పుడు 'ఎత్వం దీర్ఘం' లేదా "ే" ఇస్తే 'తే' అని దీర్ఘంతో చదువుతాం. 'క' కు 'ఎత్వం దీర్ఘం' లేదా 'ే' ఇస్తే 'కే' అంటారు. కేటుగాడా, గేటు, రేటు ఇటువంటివి.

(మళ్లీ మళ్లీ చెపుతున్నాం అనుకోవద్దు. ముందు చెప్పుకున్న ఫ్లాష్ కార్డ్లు బోధనోపకరణాలుగా... ఇలాంటి పాఠాలలో చాలా ఉపయోగపడతాయి. కార్డులమీద అక్షరాలు, గుర్తులు, ఒత్తులు అన్ని విడివిడిగా రాసి ఉంచుకుంటే.. వాటిని చూపిస్తూ చెప్పడానికి వీలుగా ఉంటుంది. అట్లాగే చింతగింజలు, చిన్నచిన్న

గులకరాళ్లు, కట్టె పుల్లముక్కలు, రంగు పూసలు వంటివాటిని దగ్గర ఉంచుకోండి. లెక్కలు చెప్పడానికి పనికి వస్తాయి.)

సంఖ్యా పరిజ్ఞానం : ఈ పాఠంలో 31 నుండి 50 వరకు సంఖ్యలు నేర్చుకుంటాం.. తీసివేతలను బొమ్మల సాయంతో నేర్పుతాం. మీరు ఉంచిన గింజలు, గులకరాళ్లు మొదలగు వాటి సహాయంతో కూడా తీసివేతలు నేర్పండి. రోజు వాడే రూపాయల నోట్లు, నాణాల లెక్కలు కూడా చెప్పడం జరిగింది. వాటిని అందరికి అర్థమయ్యేలా చెప్పండి.

చివరన ఇప్పటి వరకు నేర్చుకున్న అక్షరాలు గుర్తుచేయడాన్ని వదలకండి. అభ్యాసాలు జాగ్రత్తగా చేయించండి.

## అదనపు సమాచారం

- సమాజంలో ఉన్న సభ్యులంతా ఒక్కటిగా ఎదగడం వల్ల శక్తి వంతులు అవుతారు.
- గ్రామీణ / పట్టణ ప్రాంతాల్లో పొదుపు చేసుకోవడం, బ్యాంకురుణాలు పొంది చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడంలో మహిళలు ముందున్నారు.
- సంఘంలో ఉన్న సభ్యులు నిర్ణయించిన రోజుల్లో సమావేశాలు పెట్టుకోవడం, సభ్యుల అవసరాలను చర్చించడం, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం లాంటివి సంఘ నియమావళి ప్రకారం చేసుకుంటారు.
- సంఘాలు పనితీరును బట్టి వ్యక్తిగతంగాను, సంఘంగా 10 లక్షల వరకు ఋణాలు పొందే అవకాశం ఉంది.
- సంఘంలో సభ్యుల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవడానికి స్కాలర్ షిప్ పొందే అవకాశం ఉంది.
- పిల్లల పెళ్ళిళ్ళ సమాచారం తెలుసుకోవడం. అకస్మాత్తుగా ప్రమాదాలు జరిగినప్పుడు అండగా నిలబడటం.
- ఎవరికైనా అన్యాయం జరిగినప్పుడు కలిసికట్టుగా ఎదుర్కోవడం సంఘంగా ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. మోసం చేసిన వారిని ప్రశ్నించడం, వారిని ధైర్యంగా ఎదుర్కోవడం జరుగుతుంది.

**"కలిసి ఉంటే కలదు సుఖం"**

పాఠం – 5

# ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనం

## మాటా మంతీ

షరా మామూలే. అందరినీ పలకరించండి. సంభాషణను వానలు, చెట్ల మీదికి మరల్చడం చేయాలి.

వాలంటీరు : బాబాయ్ వానకాలం రాబోతోంది కదా. ఏమి అనుకుంటున్నావ్?

బాబాయ్ : ఏం వానా కాలం రావడంరా. నాలుగు అడుగులు నడవడానికే ఉడకబోసి నిన్నమొన్నటి దాకా... చెమటలు పట్టాయి. మన ఊరు ఎంత పచ్చగా ఉండేది. నీడ పట్టున హాయిగా నడిచేవాళ్ళం.

వాలంటీరు : అరే అందరూ వచ్చేసారు. మాటల్లో పడ్డాం.. చిన్నబాపు మళ్లీ మాట్లాడుకుందాం. హమ్మయ్య అందరూ వచ్చేసారా... నమస్కారం. మబ్బుగా ఉంది కదా. అందరూ రారనుకున్నా.

అభ్యాసకులు : ఇదేం పడే వాన కాదులే. ఊరికి కరువు వచ్చేలానే ఉంది.

వాలంటీరు : చిన్నబాపు నేను అదే మాట్లాడుకుంటున్నాం. పచ్చగా ఉండే ఊరు చెట్లు లేకుండా పోవడంతో, నీడ లేక ఎండన నడిచి వచ్చానంటున్నాడు. మరి కనీసం నీ ఇంట్లో గాని, వాకిట్లో గాని చెట్టు ఉందా. చెప్పు.

బాబాయ్ : లేదురా. ఉన్న ఒక్క మామిడి చెట్టును చిన్నా పెళ్లికి గది కావాలని నరికించాం.

వాలంటీరు : మరి అదే. అందరూ మనలాగే. ఏదో అవసరానకి ఉన్న చెట్లు నరుకుతూ పోయారు. నీడ గాలి ఎక్కడినుంచి వస్తాయి.

భాగ్యం : అవసరం లేకున్నా ఆ చెత్త ఊడవడం కష్టంగా ఉందని మా పొరుగున ఉన్న పెద్ద చెట్టు కొట్టించారు.

వాలంటీరు : అయ్యో! ఆ పని ఎవరూ చేయకండి. ఊరు ఎడారవుతుంది.

అభ్యాసకులు : ఒక్క చెట్టు కొడితే ఊరు ఎడారి అవుతుందా. మరీ చెపుతున్నావు.

వాలంటీరు : నీ ఇంట్లో చెట్టు ఒకటి, నా ఇంటి ముందు చెట్టు ఒకటి ఇట్లా అందరూ నరుకుతూ పోతే ఏమవుతుంది. ఒక మాట వినండి ఇంటింటా చెట్టు ఉంటే.. ఊరంతా పచ్చదనం ఉంటుంది. లేదంటే ఉండదు.

అభ్యాసకులు : నిజమే. చిన్నప్పుడు మా రోడ్డు పొడవున పచ్చని చెట్లు. నీడపట్టున నడుస్తూ పనికి పోయేవారము. నువ్వు చెప్పింది నిజమే. ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనమే.

మన ఊరి పక్కన అంత పెద్ద అడవే పోయిందిగా. అంతా ఇళ్లు కట్టేశారు. అందుకే పాపం ఆ కోతులు ఉండడానికి లేక ఊరిమీదికి వచ్చి పడుతున్నాయి.

వాలంటీరు : నిజం. అడవి లేదంటే అక్కడ ఉండే జంతువులకు ఎంత కష్టం. వాటికే కాదు మనకు కూడా. పచ్చదనం లేకుంటే వానలు కూడా సరిగ్గా పడవు. మనకు చల్లదనం తగ్గుతుంది. ఇంకో విషయం చెట్లు కార్బన్ డై ఆక్సైడ్ అనే గాలిని తీసుకుని మనకు కావలసిన ఆక్సిజన్ ఇస్తాయి. ఆక్సిజన్‌ను ప్రాణవాయువు అనికూడా అంటారు. చెట్టు ఉంటే వాన నీరు నేలలోకి ఇంకి పదును పెరుగుతుంది. వాటి వేళ్లు నేలలో మట్టిని పట్టుకుని వలలా ఉండడంతో మట్టి, నీరు వేగంగా కొట్టుకు పోకుండా ఆపుతాయి. చెట్లు లేనప్పుడు పడిన వాన నీరు ధనధనా పారుతుంది. నేలపై పొరలో మట్టిని కూడా పట్టుకుపోతుంది.

అభ్యాసకుడు : ఆ పై మట్టిలోనే నేలసారం ఉంటుందట.

మరోఅభ్యాసకుడు : అంతే మరి. మట్టి లేకుండా ఇసుక గులకరాళ్లల్లో ఏముంటుంది. ఏం పండుతుంది?

వాలంటీరు : అవును. దాన్నే నేల కోత అంటారు. భూమి సారం పోతుంది. పంటలు పండవు. భూమిలోపలి నీటిని భూగర్భజలాలంటారు, మెల్లగా అవి లోపలికి పోతాయి. ఇవి లేనిచో ఏ బావిలో, బోరులో నీరు లేకుండా పోతుంది. దాంతో సాగునీరే కాదు తాగునీరు కూడా ఉండదు. అందుకే ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనం.ఇదిగో ఈ బొమ్మ చూడండి.

అభ్యాసకులు : అబ్బ ఊరు ఎంత పచ్చగా ఉంది. కింద మొక్కలు నాటుతున్నారు.

వాలంటీరు : జూన్‌లో వానలు వచ్చేముందు మనమంతా చెట్లు నాటాలి. ఇంట్లో చోటు లేకుంటే ఇంటి ముందు రోడ్డుమీదైనా అందరూ చెట్లు నాటాలి. అందుకే ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనం అన్నారు. ఏమన్నారు? అందరూ చెప్పండి.

అభ్యాసకులు : ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనం. ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనం. మాకు తెలిసిందిలే ఈ రోజు పాఠం చెట్టు నాటడం గురించే.

వాలంటీరు : నిజమే. ఇప్పుడు మీరన్న మాటేమిటి ఇంటింటా చెట్టు...

అభ్యాసకులు : ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనం. కానీ ఎవరు చేస్తారు?

వాలంటీరు : అట్లా అనకు మునుపు ఎందరో అట్లా పూనుకుని ఎండిన ఊరిని బాగుచేశారు. సుందర్‌లాల్ బహుగుణ అన్నారు. చిప్‌కో (అతుక్కో) అని ఒక ఉద్యమం చేసి, ముఖ్యంగా ఆడవారిని ప్రోత్సహించి కలప వ్యాపారులను చెట్లు కొట్టకుండా ఆపాడు, అడవిని కాపాడాడు.

అభ్యాసకులు : ఓకే నువ్వు చెపుతున్నావు..ఇంటింటా చెట్టు ఉంటే ఊరంతా పచ్చదనం'.

వాలంటీరు : కరెక్ట్. ఇపుడా మాట రాస్తే ఎట్లా ఉందో ఇక్కడ చూడండి. ఇక్కడ జాగ్రత్తగా చూడండి.. మనం నేర్చుకోని అక్షరాలు ఏం ఉన్నాయో చూడండి. ఒకో అక్షరాన్ని విడిగా చూపుతూ చదవాలి. తెలిసినవి చదివించాలి. (ముందు పాఠాల్లో చెప్పినట్టు గుచ్చిగుచ్చి నిదానంగా చెప్పే అవసరం లేదు.. అభ్యాసకులను బట్టి ముందుకు పోవచ్చు)

ఈ పాఠంలో మనకు కొత్తగా ఇదిగో ఉ, ఊ లు వచ్చాయి. ఇంకా కొత్తగా అక్షరాలకు సంబంధించిన ఒత్తు నేర్చుకుందాం. ఇది ట– ్ట ఒత్తు, ఇది చ– ్చ ఒత్తు... అంటూ వాటి ఉపయోగం గురించి చెప్పి, ఈ ఒత్తులు ముందు పాఠాల్లో నేర్చుకున్న అక్షరాలకు కూడా చేర్చి చెప్పాలి. ఆ తరువాత మామూలే. బొమ్మల పేర్లు, వాటి కింద ఉన్న పదాలు చదివి వినిపించండి. చదివించండి. అభ్యాసాలు చేయించాలి. చక్కగా రాయడం నేర్పాలి.

సంఖ్యా జ్ఞానం : ఈ పాఠంలో 51 నుంచి 100 వరకు అంకెలు నేర్చుకోవాలి. గుణకారాలు చేయడం నేర్పుతాం. ఎక్కాలు నేర్పుతాం. ఎక్కాలు గుణకారాలు చేయడానికి అవసర పడతాయి.

## అదనపు సమాచారం

- చెట్లు పచ్చదనంతో పాటు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కల్గిస్తాయి. పూలు, కాయలు, పండ్లు ఆహారంగానే కాదు ఆరోగ్యానికి తోడ్పడుతాయి.
- పచ్చని వాతావరణం కలిగిన ప్రదేశంలో ఆక్సిజన్‌తో కూడిన గాలి ఉంటుంది. అది మనకెంతో మేలు చేకూరుస్తుంది.
- అనుకూలమైన ప్రదేశంలో విరివిగా చెట్లను నాటాల్సిన అవసరమున్నది. ముఖ్యంగా ప్రతి ఇంట్లో వీలైనన్ని చెట్లను పెంచాలి.
- కొన్ని చెట్లనుండి కాయలను పొందుతాము.
- ప్రతి చెట్టు యొక్క అన్ని భాగాలు నిత్య జీవితంలో ఏదో ఒకదానికి ఉపయోగపడేవే అయ్యుంటాయి.
- చెట్లు పరిశుభ్రమైన గాలికి, వర్షానికి మూలాధారం, చెట్లు లేకపోతే మనిషి మనుగడకే ప్రమాదం.
- నిమ్మ, జామ, కొబ్బరి, మామిడి, సపోటా చెట్లవల్ల కొంత ఆదాయం కూడా లభిస్తుంది.
- పూల మొక్కలు మనస్సుకు ఆహ్లాదాన్నిస్తాయి. పూల వ్యాపారం కూడా లాభసాటిదే. కొన్ని చెట్లు ఆయుర్వేద గుణాలు కలిగి ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి.
- ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి భావితరాలకు పచ్చని ప్రకృతిని ప్రసాదిద్దాం.

**"పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు"**

పాఠం – 6

# పూడిక తీద్దాం - చెరువులను నింపుదాం - వనరులను రక్షిద్దాం

## మాటా మంతి

రోజులాగే అందరిని చిరునవ్వుతో పలకరించాలి అందరిపై దృష్టి సారించి, ఎవరినైనా చిన్న పాట పాడమని ప్రోత్సహించాలి. పాట పాడిన వారిని చప్పట్ల ద్వారా అభినందించడంవల్ల ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు.

వాలంటీరు : అందరికి నమస్కారం.

మనం ఈ రోజు కొత్త పాఠాన్ని నేర్చుకుందాం. పాఠం కంటే ముందు ఒక చిన్న ఆట ఆడుకుందాం. ఆట అనగానే భయపడకండి. మనం ఇప్పటి వరకు నేర్చుకున్న పాఠాలను గుర్తుకు తెచ్చుకునే ఆటన్నమాట. మరి ఆడుకుందామా? మీరు రెడీనా?

అభ్యాసకులు : మేం రెడీ ...

వాలంటీరు : ఏంది కళావతీ, నువ్వు ఏం మాట్లాడుతా లేవు.

కళావతి : ఏం లేదు సారూ.

వాలంటీరు : ఏం లేదుకదా! అయితే అందరితో కలిసిపో మరి. ఇప్పుడు నేను ఒక్కొక్కరిని పాఠాల పేర్లు అడుగుతాను. మీరు చెప్పాలి. అడిగిన వాళ్ళు చెప్పకపోయినా, ఏం పర్లేదు. ఇంకొకరు చెప్పొచ్చు.

(వాలంటీర్ ఒక్కొక్కరిని చూస్తూ పాఠాల పేర్లు వరుసగా కాకుండా ఇష్టాను సారంగా అడగాలి. మళ్ళీ కొందరిని పాఠాలపేర్లు వరుసగా చెప్పమనాలి. తర్వాత పాఠం పేరు చెప్పి, పాఠం నెంబరెంతో అడగాలి. ఆటంతా సరదా సరదాగా సాగాలి. తప్పు చెప్పినా ఎవరినీ నొప్పించ కూడదు.

వాలంటీరు : ఆట బాగుందా? మీ అందరికీ నచ్చిందా?

ఇప్పుడు కొత్త పాఠాన్ని మొదలు పెడుదాం. మీరంతా 100 రోజుల పనికి వెళ్ళుతున్నారా?


అభ్యాసకులు : ఇక్కడున్న అందరు వెళ్ళేవాళ్ళే.

వాలంటీరు : 100 రోజుల పనిలో మీరేమేమి పనులు చేస్తారు.

అభ్యాసకులు : మట్టిపని చేస్తాం. కోపులు తీస్తం. బంటాలు పోస్తం. హరితహారం, పొరుకలు కొడుతం. కాలువల్లోని, చెరువుల్లోని పూడిక తీస్తం. ఇంకా ఏ పని చేయమంటే ఆ పనులన్నీ చేస్తాం.

వాలంటీరు : చాలా సంతోషం. ఈరోజు మనం నేర్చుకునే పాఠం పూడిక తీద్దాం చెర్లను నింపుదాం వనరులను రక్షిద్దాం. మీరు పుస్తకాలు తెరిచి 6వ పాఠంలోని బొమ్మను అందరూ పరిశీలించండి. తర్వాత అందరిని చిన్న చిన్న ప్రశ్నలు అడగాలి. బొమ్మలోని వారు





ఏయే పనులు చేస్తున్నారు? ఈపనులన్నీ మీరు కూడా చేస్తారుకదా!

సరే! ఇప్పుడు ఈ పాఠం ద్వారా మనం "క్ష" అక్షరం, ' ా ' (కొమ్ముదీర్ఘం) ' ీ ' (గుడిదీర్ఘం) ' ్ద ' (ద ఒత్తు), ' ్ల ' (ల ఒత్తు) లు నేర్చుకుంటారు.

పాఠంలోని బొమ్మలను చూపిస్తూ పదాలను చదివించాలి. పదంలోని అక్షరాలను పలుకుతూ వారితో పలికించాలి.

పాఠంలోని ఒక్కొక్క అక్షరాన్ని పరిచయం చేస్తూ వాటికి 'ా' (కొమ్ముదీర్ఘం) ఇచ్చినప్పుడు ఏవిధంగా పలకాలో చెప్పాలి. వాళ్ళతో అనిపించాలి. ' ీ ' (గుడి దీర్ఘం) '్ల' (ల ఒత్తు) '్ద' (ద ఒత్తు)ను పరిచయం చేయాలి.

ఇంతకు ముందు నేర్చుకున్న పాఠాలలోని మ, న, చ, ద, వ, గ, ల, య, ప, క, ర, ట, త, డ, స, ఘ,' అక్షరాలకు ' ా, ీ, ్ల , ్ద ' లు ఇచ్చినప్పుడు వాటిని ఏ విధంగా పలకాలో చెప్పి వారితో అనిపించాలి.

పాఠంలోని బొమ్మలకింద ఉన్న పదాలను కింద ఇవ్వబడిన ఖాళీ గడులలో రాయించాలి. పాఠంలో ఇచ్చిన పదాలను చదివించడం, మిగతావారితో అనిపించడం వల్ల అందరికి పదాలు చదవడం అలవాటవుతుంది. పదాలను చూసి కింద ఇవ్వబడిన గీతల మధ్య రాయించాలి. తర్వాత బొమ్మలను చూసి, బొమ్మల కింద ఇవ్వబడిన గడులలో వాటి పేర్లు రాయమని చెప్పాలి.

పూడిక తీద్దాం పాఠాన్ని చదివించి, దానిపై చర్చించాలి. పాఠం తర్వాత ఇచ్చిన అభ్యాసాలలోని జతపరచడం, క్ష అక్షరంతో కూడిన పదాలను పలికించాలి. ' ా, ీ, ్ల , ్ద' గల అక్షరాలకు సున్నా చుట్టించాలి. బొమ్మను చూసి పక్కనున్న గీతలపై పేర్లను రాయించాలి.

సంఖ్యా జ్ఞానం : ఈ పాఠంలో భాగహారం గుర్తును పరిచయం చేసి, భాగహార లెక్క చేయడం నేర్పించాలి. వీటితోపాటు గుణకార లెక్కలు చేయించాలి.

## అదనపు సమాచారం

- గ్రామాల పరిధిలో పూడికలు ఎక్కడ తీస్తారో తెలపాలి.
- పూడిక తీసిన మట్టిని ఎక్కడ వేస్తారో దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుందో రైతులకు తెలుపాలి.
- ప్రభుత్వ పరంగా పూడిక తీయడానికి, ఉపాధి హామీ పథకం ద్వారా మీ గ్రామంలో ఎన్నిరోజులు ఉపాధి దొరుకుతుందో, ఎంత మంది ప్రయోజనం పొందుతున్నారో కూడా తెలుపాలి.
- గ్రామాలలో గల వివిధ సహజ వనరులను గురించి తెలుపాలి.
- వనరులను రక్షించడం వల్ల భవిష్యత్ తరాలకు కలిగే మేలును తెలియజెప్పాలి.
- గ్రామాలల్లో సమిష్టి కృషి వల్ల పొందగలిగే అభివృద్ధిని తెలియజెప్పాలి.
- చెరువుల్లో, కాలువల్లో పూడిక తీయడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని చెప్పాలి.
- ఉపాధిహామీ కార్యక్రమం వల్ల గ్రామాలలో ఉపయోగంతో పాటు, ఏ యే పనులు చేయబడతాయో తెలుపాలి.
- చెరువులోని నీరు వ్యవసాయానికే కాకుండా, చేపల పెంపకం ద్వారా ఆర్థిక, వనరులు చేకూర్చబడతాయని తెలుపాలి.

**"కలిసి ఉంటే కలదు సుఖం"**

పాఠం – 7

# పోషకాహారలోపం - అనారోగ్యాలకు మార్గం



## మాటా మంతి

యథా ప్రకారం అందరిని నవ్వుతూ పలకరించాలి. పనులు చేసిచేసి అలసి వచ్చేవారికి ఉల్లాసం కలిగేలా ఏమైనా సరదాగా మాట్లాడండి. హాస్యం మంచి టానిక్.

వాలంటీరు : అందరికి నమస్కారం. (కేంద్రంలోకి వస్తూనే రోజూ నమస్కారం చెప్పడం వల్ల వాళ్లకు కూడా నమస్కారం చేసి పలకరించడం అలవాటు అవుతుంది.) పద్మక్క అంత బాగేనా? నీరసంగా కనిపిస్తున్నావు. రెండు రోజులుగా కేంద్రానికి కూడా రాలేదు.

పద్మ : అవును కొంచెం బాగాలేదు. మరీ నీరసంగా ఉండి రాలేదు. రెండుపూటలా గిన్నెడన్నం తింటున్నా.. ఈ నీరసం ఏమిటో!

పెద్దమ్మ : గిన్నెడన్నం అని అంటున్నావు గాని కారం మెతుకులే కదా! ఎప్పుడడిగినా కూర వండలేదనే అంటావు.

పద్మ : కూర లేకుంటే ఏమి? అన్నం తింటూనే ఉన్నా కదా.

వాలంటీరు : అట్లా కాదు. అన్నీ ఉన్న పోషకాహారం తినాలి అంటారు. లేదంటే అనారోగ్యాలకు మార్గం వేసినట్లే. మన తిండిలో పిండి పదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, సూక్ష్మ పోషకాలైన విటమినులు, ఖనిజలవణాలు మొదలైనవి ఉండాలి. వీటివల్ల మన శరీరం గట్టిగా ఆరోగ్యంగా ఉంటుంది. మనకు పనులు చేసుకోడానికి శక్తి వస్తుంది. లేదంటే నీరసమే. బియ్యం, గోధుమలు, జొన్నలు, సజ్జలు వంటి ధాన్యం నుంచి పిండి పదార్థం దొరుకుతుంది. ఇది శరీరానికి శక్తినిస్తుంది. శరీరంలో జీర్ణక్రియ వంటి పనులకు, పిల్లల్లో పెరుగుదలకు ఇది కావాలి. కంది, శనగ, పెసర వంటి పప్పులు, చేపలు, మాంసం, పాలు, గుడ్లు మొదలైన వాటితో దొరికే మాంసకృత్తులు అవయవాల నిర్మాణానికి ఉపయోగపడతాయి. ఇలా మన శరీరంలో ఆహారంతో వచ్చే శక్తిని రకరకాలుగా పొందాలి. పిల్లలకు కండ బలం మాంసకృత్తులతోనే వస్తుంది. నూనెలు, నెయ్యి, వెన్నలతో వచ్చే కొవ్వు పదార్థాల వల్ల ముఖ్యంగా పనిచేసే శక్తి వస్తుంది.

కొవ్వుపదార్థం శరీరంలో నిలవ ఉంటుంది. వీటితో పాటుగా విటమిన్‌లు, ఖనిజలవణాలు ఆరోగ్యాన్ని కాపాడ్డానికి, జీర్ణ వ్యవస్థ పనిచేయడానికి కావాలి. ముఖ్యంగా విటమిన్ ఏ, సిలు కంటి చూపుకు, రోగాలు రాకుండా చేయడానికి పనికి వస్తాయి. జింక్, ఇనుము శరీర భాగాలకు ఆక్సిజన్, శక్తిని పంపేందుకు కావాలి. ఇవి ఆకుకూరలు, పండ్లు, కాయ ధాన్యాలు, రాగులు, సజ్జలు, మాంసం, చేపలు,గుడ్లు మొదలైనవాటినుంచి వస్తాయి. లేదంటే రక్తం తగ్గిపోతుంది, అనారోగ్యానికి మార్గం పడుతుంది.

పద్మ : ఇదంతా నిజమా. అన్నం ఒక్కటి చాలని అనుకున్నా. నాకే కాదు. పాపం పిల్లలు కూడా నీరసంగానే ఉంటున్నారు. ఎప్పుడు చూసినా జ్వరాలు, ముక్కు కారడాలు.

వాలంటీరు : అదే కదా. ఈ రోజు మన పాఠం కూడా పోషకాహారలోపం– అనారోగ్యాలకు మార్గం' మీరంతా చెప్పండి.

అందరు : పోషకాహారలోపం – అనారోగ్యాలకు మార్గం, పోషకాహారలోపం– అనారోగ్యాలకు మార్గం

వాలంటీరు : మనం పాఠాలు ఊరికే వినడం కాదు. ఎంతో కొంత చెప్పేది పాటించాలి. ముఖ్యంగా పద్మక్క నువ్వు. సరే ఇటు చూడండి ఈ బొమ్మ.. రకరకాల ఆహార పదార్థాలు ఉన్నాయి. ఇవన్నీ మన ఆహారంలో ఉండాలి అని చెప్పడానికే. ఇక పాఠం పేరు చూడండి. ఇందులో మనం కొత్తగా చూస్తున్నవి ష, హ లు ఇది 'ష', ఇది 'హ', ఇవి కాకుండా ఈ గుర్తు ఉంది చూశారా ఇది 'ʼ' 'య' ఒత్తు అంటారు. 'గ' కి 'య' ఒత్తు ఇస్తే 'గ్య' ఆరోగ్యం అట్లానే ఈ గుర్తు '౧' 'గ' ఒత్తు 'ర' కు 'గ' ఒత్తు వస్తే 'ర్గ' 'మార్గంలో' అది వచ్చింది అన్నమాట. సరే అందరం పాఠం పేరులో ఒక్కో అక్షరం చదువుకుందాం.

ఇదిగో బొమ్మలు చూస్తూ కింది పేర్లను వేలుపెట్టి చదువుదాం. అంటూ చదవడంలో వాళ్లకు సాయం చేయాలి. పదాలు చదివించాలి. బొమ్మల కింద అక్షరాలను రాయించాలి. ముఖ్యంగా పాఠం చదివించి ... చెప్పాల్సిన మంచినంతా వారికి చెప్పాలి. ఆహారం, ఆరోగ్యాలకు సంబంధించి మీకు తెలిసినదంతా చెప్పండి.

ఇచ్చిన అన్ని అభ్యాసాలను చేయించండి.

గణిత భాగం : ఈ పాఠంలో 100 నుండి 1000 వరకు సంఖ్యలు, గుణకారం గురించి చెప్పాలి.

## అదనపు సమాచారం

మనందరం ఆరోగ్యానికి తప్పనిసరిగా ప్రాముఖ్యత నివ్వాలి. పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవడంతో పాటు మంచి అలవాట్లు కూడా మన ఆరోగ్యాన్ని పదికాలాలపాటు కాపాడుతాయి.

- ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండటం ఎంత అవసరమో తెల్పాలి.
- ఆరోగ్యంగా ఉండటంలో మానసిక, శారీరక ఆరోగ్యాల గురించి తెల్పాలి. వాటిని రక్షించుకోవడానికి ఏమి చేయాలో తెల్పాలి.
- పోషక ఆహారం అంటే ఏమిటో తెలుపుతూ, పోషక ఆహారములు ఎక్కడ నుండి లభిస్తాయో తెల్పాలి.
- ఆరోగ్యానికి ఉపయోగపడే కొన్ని పోషకాహారములు తెలుపాలి.
- సహజ పోషకాహారములు ఎక్కడ నుండి లభిస్తాయో గుర్తింపజేయాలి.
- పండ్లు, కూరగాయలు, మాంసం, పాలు, గుడ్లు, ధాన్యాల నుండి లభించే పిండి పదార్థాలు, మాంసపు కృతులు, కొవ్వు పదార్థాలు, సూక్ష్మ పోషకాలైన విటమినులు, ఖనిజ లవణాల గురించి తెల్పాలి.
- విటమిన్ ఎ, బి, సి, డి, ఇ, $బి_6$, $బి_{12}$ మొదలగున్నవి వేటినుండి లభిస్తాయో తెలుపాలి. వాటివల్ల ఆరోగ్యానికి ఏయే మేలు చేకూరుతుందో తెలుపాలి.
- నూనెలు, నెయ్యి, వెన్న లతో వచ్చే కొవ్వు పదార్థాలు మనకు ఏరకంగా ఉపయోగపడతాయో తెలుపాలి.
- విటమిన్‌లు, ఖనిజలవణాలు రోగనివారణలకు జింక్, ఇనుము, మొదలైన వాటి గురించి, పోషకాహారములు తీసుకోక పోయినచో ఏర్పడే జబ్బులు, రక్తహీనత మొదలగున్నవి తెలియజేయాలి.
- పిల్లలకు ఎప్పటికప్పుడు వచ్చే జ్వరాలు, ముక్కు కారడాలు, మొ॥వి కూడా పోషకాహార లోపం వల్లే వస్తాయని తెలుపాలి.
- పోషకాహారములు తీసుకోవడంవల్ల పిల్లలలో వచ్చే బరువుల పెరుగుదల శారీరక వికాసాలకు, ఎత్తు పెరగడానికి, ఎముకల బలానికి ఉపయోగపడ్తాయని తెలుపాలి.
- తక్కువ ఖర్చుతో మనకు అందుబాటులో దొరికే అన్నీ రకాల కూరలు, ఆకుకూరలు పండ్లతో కూడా మన శరీరానికి కావలసిన పోషకాలు ఉంటాయి.

"ఆరోగ్యమే మహాభాగ్యం"

పాఠం – 8

# అమ్మకు బ్యాంక్ ఖాతా తప్పనిసరి

## మాటా మంతి

అందరికీ నమస్కారం తో.. యథా ప్రకారం అందరిని నవ్వుతూ పలకరించాలి. మంచి చెడు మాట్లాడండి. పనులు చేసిచేసి అలసి వచ్చేవారికి ఉల్లాసం కలిగేలా ఏమైనా సరదాగా మాట్లాడండి. ఆ తరువాత విషయంలోకి రండి.

వాలంటీరు : ఈ రోజు మనం ఒక మంచి ఆట ఆడుకుందాం. ఇప్పటి వరకు మనం నేర్చుకున్న అక్షరాలు, విషయాల గురించి మాట్లాడుకుందాం. అక్షర బ్యాంకు కోసం మీరు ఈ రోజు తెచ్చిన అక్షరాలు ఇవ్వండి అని అడిగి తీసుకోండి.

గుడ్.. అందరం పోటీ పడడంతో చూడండి...మనకు ఇప్పటికి మూడు డబ్బాల అక్షరబ్యాంకులు తయారయ్యాయి. ఈ రోజు మనం వీటితో ఆడుకుందాం. మీరు అక్షర బ్యాంకులో ఉన్న అక్షరాలు తీసి, మనుషులు, వస్తువులు, వంటసరుకు ఇలా రకరకాల పదాలు తయారు చేయాలి. ఎవరు ఎక్కువ పదాలు పేరుస్తారో వాళ్లు గెలిచినట్లు.

అభ్యాసకులు : నేను మనుషుల పేర్లు తయారు చేస్తా..

అభ్యాసకులు : నేను మనం నేర్చుకున్న పాఠాల్లో పదాలే పేర్చి చూపిస్తా..

వాలంటీరు : ఏదైనా చేయండి. కానీ తొందరగా చేయండి. ఇది పోటీ. ఇదిగో అక్షరబ్యాంకుల్లో ఉన్న అక్షరాలు అన్నింటిని కింద పోస్తున్న, ఏరుకోడానికి వీలుగా ఉంటుంది. తొందరగా పదాలు పేర్చండి. ఎవరు గెలుస్తారో!

అభ్యాసకులు : చెప్పిన పని చేస్తారు.


వాలంటీరు : అమ్మో పెద్దమ్మ చాలా పదాలు పేర్చింది. గెలిచింది. సూపర్. అందరూ చప్పట్లు కొట్టండి. ఇక్కడో విషయం గెలవని వాళ్లు బాధపడకూడదు. ఇంకోసారి గెలవడానికి చూడాలి. అంతే.

అభ్యాసకులు : చెప్పిన పని చేస్తారు.

అరే అందరూ పోటీలో ఆడారు... ఇవన్నీ సర్దేది ఎవరు? మనం బ్యాంకునుంచి అక్షరాలు తీసుకున్నాం. మళ్లీ బ్యాంకులో జమ చేసేయాలి కదా. లేకుంటే బ్యాంకే ఉండదు. మనం మన అక్షర బ్యాంకును కాపాడుకోవాలి అంటే బ్యాంకునుంచి తీసుకుని వాడుకున్న అక్షరాలను మళ్లీ భద్రంగా బ్యాంకులో జమ చేయాలి.

అభ్యాసకులు : అక్షర బ్యాంకులో తిరిగి జమ చేయాలా... బాగుందే... మన ఊర్లో బ్యాంకు వాళ్లు ఇంటికి వచ్చి మరీ ఖాతాలు అందరికీ ఉండాలి అంటున్నారు. ఎట్లానో?

వాలంటీరు : అవును అందరికీ ఈ రోజుల్లో బ్యాక్ ఖాతా ఉండాలి. లేకుంటే కుదిరే కాలం కాదు.




మరి మీ అందరికీ బ్యాంక్ ఖాతా ఉందా. ఈ పాఠంలో ఆ విషయాలు తెలుసుకుందాం. బొమ్మను చూశారా. ఇక్కడ ఏమున్నాయి.

అభ్యాసకులు : పోస్టాఫీసులో డబ్బులు జమ చేయడానికేమో నించున్నారు. బ్యాంకులో డబ్బులు తీసుకుంటున్నట్లు ఉన్నారు.

వాలంటీరు : ఇంతకు ముందు ఖాతా కోసం ఏం చేయాలో అడిగావు కదా. ఇప్పుడు మనం ఆ విషయాలు తెలుసుకుందాం. ఖాతా అందరికి ఉండి తీరాలి. 'అమ్మకూ బ్యాంకు ఖాతా తప్పని సరి' అని ఎవరూ మరవ కూడదు.

బ్యాంక్ ఖాతా తెరవడం ఇప్పుడు చాలా తేలిక. అందుకు మీ పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మూడు, ఆధార్ కార్డుగాని, జాబ్ కార్డు గాని, రేషన్ కార్డు గాని లేదా ఫోటో ఉన్న ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని బ్యాంకుకు వెళ్లండి. అక్కడ ఒక ప్రత్యేక ఫారమ్ ఉంటుంది. దాన్ని నింపి ఇస్తే మన పేరుతో ఖాతా వస్తుంది.

ఖాతా వల్ల చాలా లాభాలు ఉన్నయి. పొదుపు డబ్బులు బ్యాంకులో భద్రంగా ఉంటాయి. దొంగల భయం ఉండదు. వడ్డీకో దేనికో ఎకరికైనా ఇస్తే వాళ్లు తిరిగి ఇచ్చేవరకు భయం. పైగా ఇప్పుడు ప్రభుత్వం మనకు ఎన్నో సబ్సిడీలు ఇస్తున్నది. ఆ డబ్బు బ్యాంకులలోనే వేస్తున్నారు. గ్యాస్ సబ్సిడీ డబ్బులు, ఆసరా డబ్బులు, రైతు బంధు వంటివి అన్నీ బ్యాంకులోనే పడతాయి. ఇంకా బ్యాంకు ఖాతా ఉంటే మనతోటి వారికి జన్‌ధన్ యోజన కింద ప్రమాద భీమా ఉంది. ఇంకా పేటిఎం, ఫోన్ పే వంటి సౌకర్యాలు బ్యాంకు ఖాతా ఉంటేనే. జామకాయలమ్ముతున్న అవ్వకూడా పేటిఎం తీసుకుంటున్నది మరి. అలవాటు చేసుకుంటే ఇవన్నీ తేలికే. అందుకే అమ్మకు బ్యాంక్ ఖాతా తప్పని సరి. ఏమంటారు?

అభ్యాసకులు : ఏమంటాం. ఇంత చెప్పావు. మేమూ అదే అంటాం. అమ్మకు బ్యాంక్ ఖాతా తప్పనిసరి.

వాలంటీరు : బాగుంది. మీలాగా ఇష్టంగా చదువుకుంటున్నవాళ్లు, నాకు అదృష్టం కొద్దీ దొరికారు. సరే మన పాఠం కూడా అదే. అమ్మకు బ్యాంక్ ఖాతా తప్పనిసరి. ఈ పేరులో మనకు ఏయే అక్షరాలు ముందే తెలుసో చూడండి. నేనూ చూస్తా. ఒకొక్క అక్షరం వేలు పెట్టి చదవండి.

ఇక్కడ కొత్త అక్షరాలు .. వేలు పెట్టి చూపుతూ ఇదిగో ఇది 'బ', ఇది 'ఖ', దీన్ని ' ౯' పొల్లు అంటారు. ఇది ప్' 'ప' ఒత్తు. చూడండి...

తరువాత బొమ్మల కింద పేర్లు చూడండి. చదివించండి. ఆ తరువాత ఇచ్చిన పదాలు, వాక్యాలు, చదివించాలి. అభ్యాసాలు చేయించాలి. రాసేటప్పుడు ప్రతి కొత్త అక్షరం ఎలా రాయాలో వివరించాలి. కొత్తగా చెప్పిన ఒత్తులు పాత పాఠాల్లో నేర్చుకున్న అక్షరాలకు చేర్చి చూపాలి. చదివించాలి. వాళ్లతో వాళ్ల సొంత పదాలు వాక్యాలు కూడా చెప్పించాలి. నిత్యజీవితంలో మీరు నేర్పుతున్న అక్షరజ్ఞానాన్ని వాళ్లు ఏమాత్రం ఉపయోగిస్తున్నారో చూసుకోవాలి, ఉపయోగించేలా చేయాలి. దుకాణలమీద బోర్డులు, పోస్టర్లు, పేపర్‌లో హెడ్డింగ్‌లు చదివేలా చూసుకోండి. వాళ్లతో వాళ్లకు తెలిసిన వారి పేర్లు, ఊరి పేర్లు రాయడం చదవడం లాంటివి చేయించండి. దాని వల్ల వారు అక్షరాలను చదవడం రాయడం మర్చిపోరు.

సంఖ్యా జ్ఞానం : ఈ పాఠంలో తూనికలు కొలతలు, బరువుల గుంచి తెలుసుకుందాం.

నిత్య జీవితంలో రకరకాల కొలతలు వాడుతాం. బియ్యం, పప్పులు వంటివి కిలో, అర కిలో, పావు కిలో అని కొలుస్తాం. అదే ద్రవాలయితే లీటర్లలో కొలుస్తాం. పాఠంలో ఇచ్చిన లెక్కలు చేయించండి.

## అదనపు సమాచారం

- బ్యాంక్ పనిదినములు, పనిచేయు సమయంపై అవగాహన కలిగి ఉండాలి.
- బ్యాంక్‌లో ఉపయోగించే విత్‌డ్రాలు, జమ, డి.డి. ఫారంలపై అవగాహన కలిగి ఉండాలి.
- బ్యాంక్ సేవింగ్స్ ఖాతా నెంబర్, చెక్‌బుక్ వినియోగము గురించి తెలయజెప్పాలి. సంతకం ఎక్కడ చేయాలి, తేది, పైకం రాసేటప్పుడు కొట్టివేతలు లేకుండా రాయడం తెలియాలి.
- బ్యాంక్ సేవింగ్స్ ఖాతా బుక్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం తెలియాలి. తప్పనిసరిగా నామిని పేరు చేర్చాలి.
- ఇతరులకు పైసలు పంపే విధానములు, నెఫ్ట్, చెక్కు, డి.డి. ఆన్‌లైన్ పేమెంట్, ఏ.టి.ఎం, డెబిడ్‌కార్డు, క్రెడిట్‌కార్డుల వినియోగాలపై వివరంగా తెలుపాలి.
- బ్యాంక్ నుండి రుణాలు పొందుటకు, అర్హతలు, నింపవల్సిన ఫారమ్‌లపై అవగాహన కల్గి ఉండి సంతకములు ఎక్కడ పెట్టాలో తెల్సుకుంటూ, జతపర్చవలసిన జిరాక్స్ ప్రతులు గురించి తెలిసి ఉండాలి.
- మనకు సంబంధించిన బ్యాంక్ ఖాతా నెంబర్, ఏ.టి.ఎం., పిన్ నెంబర్., ఓ.టి.పి.లు ఇతరులకు ఎవరికి చెప్పకూడదు.
- ఫోన్‌లలో హ్యాకర్స్, ఫ్రాడ్, సమాచారములు అడుగువారికి ఎలాంటి సమాచారములు ఇవ్వకూడదు.
- ప్రతి ఎకౌంట్ ఓపెనింగ్‌కు, లాకర్స్ ఓపెనింగ్‌కు నామిని ఫోటోలతో పాటు ఆపరేటింగ్ విధానము ముందస్తుగా నిర్ణయించుకోవలెను. అట్టి పత్రములు బ్యాంక్‌కు సమర్పించవలెను.
- ఇంట్లో ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతా తప్పనిసరిగా తెరిపించి ఉంచాలి. మహిళలకు గ్యాస్ సబ్సిడీ మరియు మహిళా గ్రూపుల లోన్‌లకు చెల్లింపులకు పురుషులకు రుణమాఫీ, ధరణి భూములపై రైతు బంధు, ఇన్స్యూరెన్స్‌లు పొందుటకు వీలుగా ఖాతాలు తెరువ వలెను.

**"గోరంత పొదుపు కొండంత అండ"**

పాఠం – 9

# చట్టాన్ని తెల్సుకుందాం - భద్రంగా బతుకుదాం

## మాటా మంతి

యథా ప్రకారం అందరిని నవ్వుతూ పలకరించాలి. పనులు చేసి చేసి అలసి వచ్చేవారితో ఉల్లాసం కలిగేలా ఏమైనా సరదాగా మాట్లాడండి. హాస్యం మంచి టానిక్.

వాలంటీరు : నమస్కారం...

పునశ్చరణం : ఇప్పటి వరకు మనం నేర్చుకున్న అక్షరాలు, విషయాల గురించి మాట్లాడుకుందాం. మీరెవరైనా నేర్చుకున్న అక్షరాలు చెప్పగలరా. చెపుతూ వాటిని రాయడమో, ఈ అక్షర బ్యాంకులోంచి తీసి పెట్టడమో చేద్దాం. ఏమంటారు.

అభ్యాసకులు : ఓ ఇప్పుడే చేద్దాం. నువ్వు చెప్పినట్లు కొన్ని అక్షరాలను మా రాజుగాడి నోటుబుక్ అట్టను కత్తిరించి రాసాను. ఇదిగో చూడు.

వాలంటీరు : గుడ్. చాలా బాగుంది. ఇట్లా రాయడం వల్ల నువ్వు మర్చిపోవు. ఇట్లా రాస్తూంటే మీకు అక్షరాలు బాగా గుర్తుంటాయి. అందరూ ప్రయత్నించండి.
ఇదిగో ఇక్కడో బొమ్మ. ఏమిటో చూడండి.

అభ్యాసకులు : ఇక్కడ ఇది కోర్టు బొమ్మలా ఉంది.

అభ్యాసకులు : ఇక్కడ లాయరమ్మలా ఉంది.

అభ్యాసకులు : ఇది న్యాయదేవత బొమ్మ కదూ. నేను సినిమాలో చూసాను.

వాలంటీరు : అవును సరిగ్గా చెప్పారు. ఇవన్ని కోర్టుకు సంబంధించిన బొమ్మలే. పైన ఒక పెద్దావిడ గుడిసెముందు తల పట్టుకు కూర్చున్నది. రెండో దానిలో ఒక ఆమె ఏడుస్తుంటే మగాయన బెదిరిస్తున్నట్లు ఉంది చూడండి.

అభ్యాసకులు : ఆలుమగలేమో, గొడవపడుతున్నారేమో!

వాలంటీరు : నిజమే. అవ్వ ఏదో బాధ పడుతున్నది. వాళ్లు గొడవపడుతున్నారు. అంటే వీళ్ల సమస్యలకు పరిష్కారం కావాలి. మీకు తెలుసు గొడవలు జరిగితే పోలీసు కేసు, కోర్టులు ఉంటాయి. చట్ట ప్రకారం తప్పు చేసిన వారికి శిక్షలు ఉంటాయి.

అభ్యాసకులు : అసలు చట్టం గురించి.. చెప్పు.

వాలంటీరు : ఈ పాఠం అందుకే ఉంది. మనం 'చట్టాన్ని తెల్సుకుందాం.. భద్రంగా బతుకుదాం" ఏమంటారు?

అభ్యాసకులు : నువ్వన్నమాటే అంటున్నాం కదా. మళ్లీ చెప్పు.

వాలంటీరు : 'చట్టాన్ని తెల్సుకుందాం.. భద్రంగా బతుకుదాం'

అభ్యాసకులు : 'చట్టాన్ని తెల్సుకుందాం – భద్రంగా బతుకుదాం', చట్టాన్ని తెల్సుకుందాం – భద్రంగా బతుకుదాం'

వాలంటీరు : 'చట్టాన్ని తెల్సుకుందాం – భద్రంగా బతుకుదాం' అక్షరాలు వేలుపెట్టి ఒకటి ఒకటి చూడండి. మనం నేర్చుకోని, తెలియని అక్షరాలు ఇక్కడ ఏమున్నాయో చూడండి.

అభ్యాసకులు : నువ్వు చెప్పావు కదా... చట్టాన్ని తెల్సుకుందాం.. ఇగో ఈ అక్షరం కొత్తగ ఉంది.

వాలంటీరు : అవును అది 'భ ' చూడండి అందరు ... ఈ అక్షరం ఇది 'భ' ఎట్లా ఉందో చూడండి.

అభ్యాసకులు : బ్యాంకు పాఠంలో 'బ' వచ్చింది. ఇది చూడడానికి వేరేగా ఉంది.

వాలంటీరు : గుడ్ బాగా గుర్తు పట్టారు. అది 'బ' అంతే. దానిని వత్తిపట్టి చదవం. ఇక్కడ ఉన్నది కింద గీత, తలకట్టు ఉన్నాయి. ఇదిగో ఇట్లా రాస్తాం. దీన్ని గట్టిగా నొక్కి చదువుతాం. 'ఒత్తు – 'భ' అంటారు. బడి... భద్రం .. వంటి పదాలు అభ్యాసకులతో అనిపించి తేడా తెలిసేలా చేయాలి. ఇంకా కొత్తగా మనం ఇప్పటి వరకు చెప్పుకోనివి ఏమున్నాయో చూడండి.

అభ్యాసకులు : చట్టాన్ని.. ఇదిగో ఈ 'ని' పక్కన ఉంది చూడు ఇది.... తెలు.. పక్కన ఉంది. ఇదిగో ఇదీ కొత్తగనే ఉంది.

అభ్యాసకులు : ఇంకా ... ఇగో ద కి పక్కన ఉంది

వాలంటీరు : అన్ని కొత్త పదాలు మీరు పట్టుకున్నారు. ఇది 'న' గుర్తు... 'న' ఒత్తు అని అంటారు. ఇక్కడ 'ని' కి 'న – ్న' ఒత్తు వచ్చింది. 'న్ని' అని చదువుతాం ఒత్తు లేకుంటే 'ని' అంటాం. అట్లే ఈ న ఒత్తు ఎక్కడెక్కడ వస్తుందో చెప్పన్న నువ్వు.

అన్న : నువ్వే చెప్పు.

వాలంటీరు : 'అన్న' అంటేనే ఉంది గదా. ఇదిగో ఇది 'అ' పక్కకు 'న' రాసాం. ఏమయింది. అ...న ... మనం 'అన్న' అనాలంటే 'న' కు ఇదిగో ఇట్లా 'న' కు 'న' ఒత్తు ' ్న' రాయాలి. అప్పుడే అన్న అవుతుంది.

మరో అభ్యాసకుడు : 'నాన్న' కూడా అంతే కదా! 'బన్ను' కూడా కదా!

వాలంటీరు : అవును. ఇక ఈ 'లు', కింద ఉన్నది 'స' వత్తు. మనం రాయలేదు గాని నోటితో అనుకున్నాం కదా 'తెల్సు..'లో .. 'లు' పక్కన 'స వత్తు రాస్తే 'ల్సు' అని చదవాలి. ఈ 'భ' తరువాత ఇది 'ర' వత్తు. 'ద' కి 'ర' ' ్ర' ఒత్తు చేరిస్తే 'ద్ర' అవుతుంది. ఇదిగో ఇక్కడ ఉన్న బొమ్మలు చూడండి. అన్ని మీకు తెలిసినవే. చెప్పండి.

అభ్యాసకులు : అందరు కలిసి భజన చేస్తున్నట్లుంది. పెన్ను, నర్సు, గుర్రం

వాలంటీరు : కరెక్ట్. చూడండి.

పేర్లు కింద ఉన్నవి కదా... కాస్త వేలు పెట్టి ఒక్కొక్క అక్షరం చూపుతూ చదివించండి.

తరువాత కొత్త అక్షరాలు రాయించే ప్రక్రియ. ఆ తరువాత పదాలు రాయించడం. తరువాత కథ చదివించి, చర్చించండి. తరువాత అభ్యాసాలు చేయించండి. వాళ్లతో సొంత వాక్యాలు రాయించండి. లెక్కలు చేసేటప్పుడు కూడా చుట్టుపక్కల జరుగుతున్న విషయాల గురించి చెప్పండి. బాగా గుర్తుండిపోతుంది.

ఈ పాఠంతో లెక్కలకు సంబంధించి, ఈ పాఠంలో ద్రవాలు కొలతలు గురించి తెల్సుకుందాం. పాలు, నీరు, నూనె, పెట్రోలు, డీజిల్, ద్రవరూప మందులు వీటిని లీటర్లు / మి.లీ.లో కొలుస్తారు. పాఠంలో ఇచ్చిన లెక్కల సహాయంతో అర్థమయ్యేలా చెప్పాలి.

బోధనోపకరణాలు : అందరితో అట్ట ముక్కలపై కొత్త అక్షరాలు, గుర్తులు రాయించి అక్షర బ్యాంకులో జమ చేయడం వదలకండి. ఆ ఫ్లాష్ కార్డులను తరచుగా ఉపయోగిస్తూ పునఃశ్చరణ చేయిస్తూండండి.

అభ్యాసకులు : చట్టం చట్టం అంటున్నావు. దీని గురించి చెప్పనే లేదు.,

వాలంటీరు : చట్టం అనేది రాజ్యాంగబద్ధమైన విధానం. నియమం. హక్కు మనకు. మనం ఎలా ఉండాలి, ప్రభుత్వ పరిపాలన ఏ పద్ధతిలో సాగాలి, తప్పులకు ఎలాంటి శిక్షలు అనే విషయాలు చెప్పడానికి ఒక రాజ్యాంగం రాసుకున్నాం. ప్రభుత్వం ఏదైనా మన మంచికే చేస్తుంది. ఇప్పుడు మనకు వచ్చే పెన్షన్, రేషన్, అంగన్‌వాడి, ఆసుపత్రులు ఇతర సౌకర్యాలు అన్నీ చట్టం ప్రకారం జరుగుతాయి. కొందరికి వచ్చి మనకు రాకపోతే ఏమిటిది అని అడిగే హక్కును కూడా మనకు చట్టం సమాచార హక్కుతో ఇచ్చింది. మనకు జాబ్ కార్డు, రేషన్ కార్డు, అన్ని చట్ట ప్రకారం వస్తున్నాయి. చట్ట ప్రకారం మనకు రావలసినవి రాకుంటే హక్కుగా అడిగి సాధించుకోడానికి న్యాయస్థానాలు ఉన్నాయి. ఇవే కాకుండా మనందరి మంచి కోసం కూడా కొన్ని చట్టాలు చేశారు. బాల్య వివాహాల రద్దు చట్టం, వరకట్న నిషేధ చట్టం, బాల కార్మిక చట్టం, గృహ హింస చట్టం, నిర్భయ చట్టం, ఫోక్సో చట్టం, అంటరానితనం నిషేధ చట్టం వంటి అనేక చట్టాలు ఉన్నాయి. ఈ చట్టాల ప్రకారం.. చేయరాని పని లేదా ఎవరికైనా అన్యాయం జరిగినా మనం పోలీసులకు పిర్యాదు చేయాలి. పోలీసులు ఉన్నది చట్టాన్ని కాపాడ్డం కోసమే. కొన్ని విషయాల్లో లాయరు సహాయంతో కోర్టుకు పిర్యాదు చేయవచ్చు. అక్కడ న్యాయం జరుగుతుంది.

అభ్యాసకులు : కోర్టులో న్యాయం జరిగినా... ఆ ఖర్చు, కష్టాలు మనం పడగలమా!

వాలంటీరు : ఎందుకు? ఖర్చు మనం పెట్టలేకపోతే మనలాంటి వారికోసం, ఆడవారు, పిల్లలు, ముసలివారు, మైనారిటీల కోసం ఉచిత న్యాయ సహాయం పొందే సౌకర్యం కూడా ప్రభుత్వం ద్వారా చట్టం మనకు ఇచ్చింది. మన రాష్ట్ర, జిల్లా, మండల కేంద్రాల

స్థాయిల్లో న్యాయసేవా కేంద్రాలు ఉన్నాయి. అక్కడికి పోయి మన సమస్యలను చెప్ప గలిగితే సమస్య తీరుతుంది. రాష్ట్ర స్థాయిలో ఉండే రాష్ట్ర న్యాయ సహాయ కేంద్రం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గారి నేతృత్వంలో నడుస్తుంది. దీనికి పదవిలో ఉన్న లేక పదవి విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి కార్యనిర్వాహక అధ్యక్షులుగా నియమితులయి ఉంటారు.

అట్లే జిల్లా స్థాయిలో కూడా ఈ ఉచిత న్యాయ సహాయ కేంద్రాలు ఉంటాయి.

ఏది మనకు కావాలన్నా మనకు దాని గురించి తెలియాలి. అందుకే మనం అందరం చదువుకోవాలి. తెలుసుకోవాలి.

సంఖ్యా జ్ఞానం : ఈ పాఠంలో ద్రవాల కొలతల గురించి తెలుసుకుందాం.

## అదనపు సమాచారం

- ప్రతి వ్యక్తి కుటుంబ పరంగా, సమాజ పరంగా చట్టపరిధిలో జీవించాలని తెలియజెప్పాలి.
- వ్యక్తులకు, కుటుంబాలకు, వ్యవస్థలకు జరిగే అన్యాయములకు చట్టాన్ని ఆశ్రయించు హక్కు ఉంటుందని తెలియ జెప్పాలి.
- వ్యాపార లావాదేవీలలో, కుటుంబ పంపకాలలో, భవిష్యత్‌లో వీలునామాల అమలుకు, చట్టరీత్యా, పొందగల్గే వివిధ హక్కులకు రక్షణ కల్పించబడి ఉంటుందని అవగాహన పర్చాలి.
- చీటింగ్ కేసులకు (420), భూదురాక్రమణలకు, ఇతరులపై దౌర్జన్యాలు, దొంగతనములకు మొదలైన ఎన్నో అత్యాచారములకు, కిడ్నాపులకు, శిశు అపహరణలకు సంబంధించి వివిధ సెక్షన్ల ద్వారా పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేయబడి, కోర్టుకు పంపుతారని తెలియ పర్చాలి.
- చట్టాలను రక్షించడానికి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలలో గల కోర్టుల్లో సివిల్, క్రిమినల్, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో పాటు అప్పుడప్పుడు లోక్ అదాలత్‌లలో కేసు ఉపసంహరణలు కూడా జరుపుకుని కాంప్రమైస్ (సర్దుబాటు) చేసుకోవచ్చని తెలియపర్చాలి.
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మనం తెల్సుకోగలిగే కనీస చట్టాల పేర్లు తెలియపర్చాలి. వరకట్న నిషేధ చట్టం, బాల్యవివాహ చట్టం, బాలకార్మిక చట్టం, గృహహింస చట్టం, నిర్భయ చట్టం, ఫోక్సో చట్టం, అంటరానితనం, కులవివక్ష, దూషణ, పిల్లలను దత్తత తీసుకొనుట, వ్యక్తిగత దూషణ, అక్రమంగా వ్యక్తులపై దాడి చేయుట, ఎదుటి వ్యక్తుల హక్కులను హరించుట మొ॥లగు ఎన్నో చట్టాలు మనం నిత్యం చూస్తుంటామని తెలియపర్చాలి.

**"కలిసి ఉంటే కలదు సుఖం"**

పాఠం – 10

# స్వచ్ఛ భారత్ అంటే ఏమిటో బిడ్డలకు నేర్పాలి

## మాటా మంతి

ఎప్పటిలా నమస్కారం చెపుతూ అందరినీ నవ్వుతూ పలకరించాలి. హాస్యం మంచి టానిక్ అనుకున్నాం కదా ఏమైనా సరదాగా మాట్లాడండి. నలుగురితో వాళ్లకు తెలిసిన జోక్స్ చెప్పించి అందరూ నవ్వుకోండి. సంభాషణను పాఠ్యాంశం దిక్కు మళ్లించండి.

వాలంటీరు : ఈ రోజు మనం ఒక మంచి ఆట ఆడుకుందాం. ఇప్పటి వరకు మనం నేర్చుకున్న అక్షరాలు, విషయాల గురించి మాట్లాడుకుందాం. అక్షర బ్యాంకు కోసం మీరు ఈ రోజు తెచ్చిన అక్షరాలు ఇవ్వండి.

గుడ్.. అందరూ పోటీ పడుతూ చూడండి...మనకు ఇప్పటికి నాలుగు డబ్బాల అక్షర బ్యాంకులు తయారయ్యాయి. ఈరోజు మనం వీటితో ఆడుకుందాం. మీరు అక్షర బ్యాంకులో ఉన్న అక్షరాలు తీసి రకరకాల పదాలు తయారు చేయాలి. ఎవరు ఎక్కువ పదాలు పేరుస్తారో వాళ్లు గెలిచినట్లు.

అభ్యాసకులు : ఈ ఆట ఎన్నిసార్లు ఆడినా బాగుంటుంది.

అభ్యాసకులు : అవును నేను ఈ సారి ఊరిపేర్లు పేరుస్తా.


వాలంటీరు : ఏదైనా చేయండి. కానీ వేగంగా చేయండి. మళ్లీ చెపుతున్నాను. ఇది పోటీ. సరదాగా ఆడుకుందాం. దీనివల్ల మనం నేర్చిన చదువు గట్టి పడుతుంది. ఇదిగో అక్షరబ్యాంకుల్లో ఉన్న అక్షరాలు అన్నింటిని కింద పోస్తున్న ఏరుకోండి. తొందరగా పదాలు పేర్చండి. ఎవరు గెలుస్తారో.


వాలంటీరు : నరసయ్య మామ గెలిచాడు. ఓ పెద్దమ్మ ఎప్పటిలా చాలా పదాలు పేర్చింది. ఈసారి అందరూ బాగానే చేసారు. సూపర్. అందరూ చప్పట్లు కొట్టండి.

అరే మీకు మళ్లీ మళ్లీ చెప్పాలా? అందరూ పోటీతో ఆడారు... ఇవన్ని సర్దేది ఎవరు? అసలే మన పాఠం స్వచ్ఛభారత్. అవును భాగ్యం వదిన, సీతక్క రాలేదు. ఈ పోటీ అయ్యేవరకు వస్తారు అనుకున్నాం ఇంకా రాలేదు. సీతక్క నిన్న కూడా రాలేదు.

అభ్యాసకులు : వాళ్ల పిల్లలకు బాగా లేదట. విరేచనాలు, జ్వరాలతో బాధపడుతున్నారు. ఇందాక ఏఎన్ఎం అక్క వచ్చి అందరికీ జాగ్రత్తలు చెప్పి వెళ్లింది. సీత పిల్లలకు సెలైన్ కూడా ఎక్కుతున్నదట రెండురోజులుగా. పాపం పిల్లలు ముందే బక్కపిల్లలు. ఎట్లా తట్టుకుంటారో ఏమో!

వాలంటీరు : ఎఎన్ఎం ఏం చెప్పారు.



అభ్యాసకులు : శుభ్రత గురించి చెప్పింది.

వాలంటీరు : అవును పరిసరాలు, ఇంట్లో శుభ్రత ఉంటే ఇన్ని బాధలే ఉండవు. కొందరి పిల్లలు చూడండి ఎంత ఆరోగ్యంగా ఉంటారో. సరే ఇప్పుడు మన పాఠంలోకి వద్దాం ఈ బొమ్మ చూడండి.

అభ్యాసకులు : బడి దగ్గర, రోడ్డు, రైలు దగ్గర అంతా ఊడుస్తున్నారు. శుభ్రం చేస్తున్నారు.

వాలంటీరు : అవును. శుభ్రం చేస్తున్నారు. ఇట్లా మనం ఇల్లు వాకిలి, చుట్టుపక్కల కూడా శుభ్రం చేసుకుంటే కొన్ని జ్వరాలు మన దగ్గరికే రావు. విరేచనాలు, వాంతులు, జ్వరాలు శు భ్రత లేకపోవడం వల్ల వస్తాయి. ముఖ్యంగా బహిరంగ మల విసర్జన చాలా ప్రమాదకారి. అందుకే ప్రభుత్వం మనందరికి డబ్బు ఇచ్చి మరీ మరుగుదొడ్లు కట్టించుకోమంది. మనూళ్లో అందరం కట్టించుకున్నాం కదా.

అభ్యాసకులు : మేం ముందు కట్టించుకున్నందుకు మాకు నష్టం.

వాలంటీరు : తప్పదు అన్న. ఒక్కొక్కసారి ఇట్లా జరుగుతుంది. కానీ ఇన్నిరోజులు మీ ఇంటివారంతా మంచిగా బతికారు. చెంబు పట్టుకుని రోడ్డుకెక్కలేదు. దాని విలువ కట్టుకో. ఎన్ని వేలైనా సరిపోవు. నువ్వే ఆలోచించు. సరే మనం అందరం స్వచ్ఛభారత్ గురించి రకరకాలుగా వింటూనే ఉన్నాం.

అభ్యాసకులు : దీని గురించి కొంచెం చెప్పు.

వాలంటీరు : మనలో చాలామంది సింగపూర్, అమెరికా. జపాన్‌లాంటి దేశాలు చాలా శుభ్రంగా ఉంటాయి. కాని మన దేశం అట్లా ఉండదు అని అంటుంటారు. నిజానికి మన దేశం ఇట్లా ఉండడానికి కారణం మనమే. మనందరికి గాంధీ తాత తెలుసు కదా. ఆయన శుభ్రత గురించి చాలా శ్రద్ధ తీసుకున్నారు. స్వచ్ఛ భారత్ ఆయన కన్న కల. పరిశు భ్రత వల్ల మన పరిసరాలు, మన ఆరోగ్యాలు బాగుంటాయి. అనారోగ్యాల బారిన పడకపోతే డాక్టర్ ఖర్చులు, అప్పుల బారినుండి మనను మనం కాపాడుకుంటే మన

బతుకులు బాగుపడతాయి. మనుషులు బాగుపడితే ఊరుతో పాటు దేశం బాగుపడుతుందని ప్రభుత్వం ఆలోచించింది. అంతే కాదు. మహాత్మాగాంధీ 150వ జన్మ దినోత్సవాన్ని ప్రత్యేకంగా జరపాలని నిర్ణయించుకుంది. ఆయన కల అయిన స్వచ్ఛభారతాన్ని ఆయనకు నివాళిగా అందించి ఆయన పట్ల మన గౌరవాన్ని చాటుకోవాలని నిర్ణయించుకుంది. ఇది ఒక్కరోజులో అయ్యేపని కాదు.

స్వచ్ఛభారత ఉద్యమాన్ని 2014 అక్టోబర్ 2న ప్రారంభించారు.

గాంధీ తాత 150 వ పుట్టినరోజు, 2019 అక్టోబర్ 2. ఆ నాటికి అంటే అయిదేళ్లలో అనుకున్నది సాధించాలన్నది లక్ష్యం.

స్వచ్ఛభారత్ ఉద్యమానికి ఒక లోగో.. అంటే గుర్తు ఉంది. ఆ గుర్తులో గాంధీ తాత వాడిన కళ్లజోడు ఇది ఆయన కల అని చెప్పడానికి ఉంచారు. రెండు అద్దాలను కలుపుతూ మన మూడు రంగుల జెండా ఉంచారు... ఓ బాపూ నీ కలను నిజం చేయడానికి మొత్తం దేశం ఒకటవుతున్నాం అని చెప్పడానికి ఆ జెండా రంగులు. ఒక కంటి అద్దంలో స్వచ్ఛ అని మరో అద్దంలో భారత్ అని ఉంటుంది. దానికి అర్థం... స్వచ్ఛతను మన దేశంతో కలపడం లక్ష్యం.

అనారోగ్యాలకు ముఖ్య కారణమైన బహిరంగ మలవిసర్జన లేకుండా చేయడానికి కనీసం 9 కోట్ల మరుగుదొడ్లను మొదటిదశలోనే కట్టించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.

ఉద్దేశ్యం : స్వచ్ఛభారత్‌కు ముఖ్యంగా కావలసినవి .. మరుగుదొడ్లు, వ్యర్థపదార్థాలు అంటే చెత్త నిర్వహణ, గ్రామ శుభ్రత, రక్షిత మంచినీటి పంపిణీలు కాబట్టి వీటిని కల్పించడానికి ప్రభుత్వం ఈ ఉద్యమ కాలంలో పనిచేస్తుంది.

ఈ స్వచ్ఛభారత్ ఏమిటన్నది, ఎందుకో మన బిడ్డలకు నేర్పాలి. అప్పుడు పిల్లలు కూడా శుభ్రత అవసరాన్ని తెలుసుకుంటారు. లేదంటే వారికి తెలియదు. అందుకే స్వచ్ఛభారత్ ఏమిటన్నది మన బిడ్డలకు నేర్పాలి. ఏమంటారు?

అభ్యాసకులు : నిజం. స్వచ్ఛభారత్ ఏమిటన్నది బిడ్డలకు నేర్పాలి.

వాలంటీరు : విషయం అందరికీ తెలిసినట్లే ఉంది. ఇప్పటికే టీవీలు, ఇతర విధాలుగా ఈ స్వచ్ఛత గురించి చాలా ప్రచారం జరిగింది. సరే ఈ పేరులో మనకు వచ్చిన కొత్త అక్షరాలు నేనే చెప్పేస్తాను.. ఏ అక్షరం, 'వ' ఒత్తు '్వ', 'ఛ' ఒత్తు '్ఛ', 'ద' ఒత్తు '్ధ 'లు కొత్తవి. కింది బొమ్మలను ఆ తరువాత పేర్లను చూస్తూ వాటిని వేలు పెట్టి చూపుతూ చదవండి. ఎప్పటిలా తప్పులు లేకుండా రాసేలా చూడండి.

గణితం : ఇక్కడ దూరాల కొలతలు గురించి అర్థమయ్యేలా చెప్పాలి.

## అదనపు సమాచారం

- మన గ్రామ పరిశుభ్రత గురించి మనం ఏమేంచేశామో గుర్తు చేయాలి. అప్పుడు చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఫలితాలను విశదీకరించాలి.
- వస్తున్న సామాజిక మార్పులకు అనుగుణంగా గ్రామ పరిశుభ్రత తీరు మెరుగు పడ్డదా! లేదా ఇంకా చేయాల్సిన మార్పులను గుర్తించారా?
- స్వచ్ఛ భారత్ నిర్వాహణ ఉద్దేశ్యము ఏమిటో గ్రహించారా?
- స్వచ్ఛ భారత్ నిర్వాహణతో గ్రామ, పట్టణాలలో వస్తున్న సమూల మార్పులు గమనించే రీతిలో అవగాహన కల్పించాలి.
- స్వచ్ఛ భారత్‌లో పాల్గొనేందుకు ఎవరెవరిని ఆహ్వానించాలో తెలియ పర్చాలి.
- స్వచ్ఛ భారత్‌లో వ్యక్తుల, కుటుంబాల సభ్యుల, గ్రామ పెద్దల, యువకుల గృహిణుల, పిల్లల, గ్రామస్థుల సహకారం ఏమేరకు ఉండాలో నిర్దేశించాలి.
- పరిశుభ్రత లేనట్లయితే వ్యక్తుల, కుటుంబాల, గ్రామాల, వ్యవస్థల పనితీరు ఎలా ఉంటుందో కూడా ఊహింపజేయాలి.
- స్వచ్ఛ భారత్‌లో గ్రామ ప్రజాప్రతినిధుల, అధికారుల, గ్రామస్థుల, యువతీ యువకుల, కుటుంబాల పిల్లల బాధ్యతలను గుర్తింపజేయాలి. చేయాల్సిన పనులను నిర్దేశించాలి.
- భవిష్యత్ తరాలకు స్వచ్ఛ భారత్ అవసరాలను యువతకు, పిల్లలకు పెద్దలకు, ప్రతి పౌరునికి తెలియజెప్పాలి.
- గ్రామ స్థాయి స్వచ్ఛ భారత్ కమిటి ఏర్పరచాలి. హద్దు మీరిన గ్రామస్థులకు జరిమానా విధించి సక్రమ మార్గంలోకి తీసుకురావాలి.
- చెట్లను పెంచాలి. పరిసరాలు శుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలి.

**"పరిశుభ్రతే ఆరోగ్యానికి దగ్గరిదారి"**

పాఠం – 11

# ఫోన్ లేకుంటే ఈ రోజుల్లో ఇబ్బందే

## మాటా మంతి

నమస్కారం చెపుతూ అందరిని నవ్వుతూ పలకరించాలి.

వాలెంటీర్ : ఓ యాదమ్మ ఏమిటో ఆలోచనల్లో పడ్డావు. పిలిచినా పలకనే లేదు.

లింగమ్మత్త : ఏం లేదు. ఈ రోజు ఇంట్లో పెద్దగొడవ. నా మనుమరాలు నా చదువుకు ఫోన్ కావాలి అని అడిగింది. నా కొడుకు, కోడలు ఫోన్ ఎందుకు? నీకన్ని పుస్తకాలు కొనిచ్చాము. ఫోన్‌తో ఆటలు ఆడడానికి అలవాటు పడ్డావు అంటూ తిట్టారు. అదేమో ఏడ్చింది. నిజం నాయనమ్మ చదువుకోసం అడుగుతున్నా. మా ఫ్రెండ్స్ అందరూ ఫోన్ పెట్టుకుని చదువుకుంటున్నారు. అంది నిజమేనా?

వాలంటీరు : అత్తా ఫోన్‌తో చాలా పనులు చేస్తున్నాం. పిల్లల చదువుకు సంబంధించి ఫోన్‌లో చాలా ఉన్నాయి. బావ అన్నట్లు ఫోన్‌లో అనవసరపు ఆటలు, సినిమాలు ఉంటాయి గాని, మనం జాగ్రత్త పడాలి. పిల్లలకు పనికి వచ్చే విషయాలు చాలా ఉంటాయి. పిల్లలు ఒకరికి ఒకరు చదువులో అనుమానాలు ఉంటే మాట్లాడి పంపుకోడానికి వీలు ఉంటుంది. సరిగ్గా వాడుకోవాలి. పిల్లలు ఫోన్ ఎందుకు వాడుతున్నారో.. మనం చూసుకుంటూ ఉండాలి. సరే అందరూ ఈ బొమ్మ చూడండి. ఏమేమి కనిపిస్తున్నాయి.

అభ్యాసకులు : ఒకాయన ఫోన్ పట్టుకుని చూస్తున్నాడు.
కింద అరక పట్టుకుని దున్నడానికి పోతుంటే ఆమె హారతి ఇస్తున్నది.
పిల్లలు చూడు ఎంత సంతోషంగా నవ్వుతున్నారో!

వాలంటీరు : ఇంకా చూడండి. ఫోన్‌లో ఆయనేం చూస్తున్నాడు. ఇంకా చూసి ఆలోచించి చెప్పండి.

అభ్యాసకులు : ఫోన్‌లో గల్లగురిగి కనిపిస్తోంది.
ఆకాశంలో మబ్బులు కూడా కనిపిస్తున్నాయి.
ఏరువాక పున్నమేమో? పూజచేసి సాగు పనులు మొదలు పెడతారు కదా. పండుగ కదా పిల్లలు సంతోషంగా ఉన్నారు.

వాలంటీరు : నిజమే. గల్ల గురిగి బొమ్మ అంటే ఆయన ఫోన్‌లో తన బ్యాంకులో దాచుకున్న డబ్బు. బ్యాంక్‌లో ఉన్న డబ్బు ఎంతో చూసుకోవచ్చు. ఎవరికన్నా డబ్బు ఇవ్వాలంటే ఇస్తుండవచ్చు. ఇక మబ్బుల బొమ్మ ఇదో ఫోన్ యాప్. వాతావరణం ఎట్లా ఉంది. వానలు పడబోతున్నాయా లేదా లాంటి సమాచారంతో రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఎరువుల సంచి బొమ్మ ఎందుకంటే... అందులో ఎరువుల ధరలు, నిల్వల సమాచారం దొరుకుతుంది. అధికారుల సలహాలు తీసుకోవచ్చు. తోటి రైతులతో




మాట్లాడి నిర్ణయాలు తీసుకోవచ్చు. సరే బొమ్మ చూసాం. ఇప్పుడే పాఠం పేరు చూడండి. వేలుపెట్టి ఒకో అక్షరం చదువుతూ .... 'ఫోన్ లేకుంటే ఈ రోజుల్లో ఇబ్బందే'.

అభ్యాసకులు : నిజం. 'ఫోన్ లేకుంటే ఈ రోజుల్లో ఇబ్బందే'.

ఇందులో కొత్త అక్షరాలు ఏమేమి వచ్చాయో చూడండి. ఫ్లాష్ కార్డులో, నోట్ బుక్ లేదా బోర్డుమీద రాసో అక్షరాలను విడివిడిగా చూపండి. ఇదిగో మొదటి అక్షరం 'ఫ' కొత్తగా వచ్చింది. మళ్లీ చూడండి. మనం ముందే 'ప' నేర్చుకున్నాం. ఇది ఒత్తు 'ఫ' . ఇదిగో చూడండి ఇది 'ప '. ఇది 'ఫ'. తేడా ఏమిటో మీరే చెప్పండి. అవును ఈ గీతే. సరే ఇక ఈ 'ఫ' కి ఓత్వం ఇస్తే 'ఫో' అవుతుంది. మళ్లీ చూడండి.. ఇది 'న' కి నకారపు పొల్లు ఇస్తే 'న్' . 'ల' కి 'ఏత్వం' ఇస్తే 'లే', 'క' కి కొమ్ము ఇస్తే 'కు', 'కు' కు 'సున్నా' పెడితే 'కుం'. 'ట' కు 'ఏత్వం' ఇస్తే 'టే'.

ఇగ ఇదిగో ఇది కొత్త అక్షరం 'ఈ ' ఇది. ఇక ఇది 'జ'. 'జ' కు 'కొమ్ము' ఇస్తే 'జు' 'జ' కు 'కొమ్ము' కొంచెం వేరుగా ఇస్తాం చూడండి. జాగ్రత్తగా చూడండి. గుర్తుంచుకోవాలి మరి. పెద్దమ్మ నీ మనమరాలు జయ పేరు ఈ 'జ' తోనే మొదలవుతుంది.

పెద్దమ్మ : ఇప్పుడు నేర్చుకున్న 'జ' రాసి పక్కన ముందు నేర్చుకున్న 'య' రాస్తే చాలు మా మనవరాలి పేరు. నేను ఇవాళ దానికి దాని పేరు రాసి చూపిస్తా.

వాలంటీరు : ఎంత సంతోషమో. సరే ఈ 'జ' తరువాత మనకు ఇంకా కొత్తవి ఏమున్నాయి.? ఇబ్బందే లో 'బ' ఒత్తు వచ్చింది చూడండి.

ఇట్లా ఒకో అక్షరం గురించి నిదానంగా మాట్లాడుకుని, చదివించి రాయించి... పాఠం వేగంగా చెప్పవచ్చు. వాళ్లతో సొంత వాక్యాలు రాయించాలి. అభ్యాసాలు చేయించాలి.

గణితం : ఈ పాఠంలో ఘన పరిమాణంకు సంబంధించిన అంశాలు అర్థమయ్యేలా వివరంగా చెప్పాలి.

పునఃశ్చరణం : ఈ పాఠంలో నేర్చుకున్న అక్షరాలు , ఒత్తులే కాదు.. పూర్వ పాఠాల్లో నేర్చుకున్న అక్షరాలకు ఇక్కడ నేర్చిన 'ల' వత్తు, 'బ' ఒత్తులను కలిపి చెప్పండి. 'జ' గుణింతం రాసే పద్ధతి కొంచెం చెప్పండి.

## అదనపు సమాచారం

- గతంలో ఫోన్‌లు లేనప్పుడు పడ్డ ఇబ్బందులు గుర్తు చేయాలి.
- ఫోన్‌ల వినియోగంకై ప్రస్తుత సమాజంలో ఆధారపడ్డ పరిస్థితులు తెలుపాలి.
- ఫోన్‌ల వినియోగం వల్ల పొందుతున్న లాభాలు తెలియపరచాలి.
- ఫోన్‌ల వినియోగంలో ముఖ్యంగా ఎన్నిరకాల Appలు ఉన్నాయో వాటి ఉపయోగాలు కొన్నింటివల్ల వచ్చే అనర్థాలను తెలియపర్చాలి.
- ఫోన్‌లతో Phone Pay, Google Pay, ఇతర Payment Appని జాగ్రత్తగా వాడుటకై అవగాహన కల్పించాలి.
- ఫోన్‌లు చిన్నపిల్లలకు ఆటవస్తువులు వలె ఇవ్వకూడదని తెల్పాలి.
- ఫోన్‌లు పిల్లలకు గేమ్స్ కోసం, బొమ్మలను చూడటంకోసం, హింసాత్మక గేమ్స్ ఆడకుండా చూసే విధంగా తెలియజెప్పాలి.
- తక్కువ రేటు, చైనా ఫోన్ లాంటివి వాడటం వలన ప్రమాదాలుంటాయని తెలియజెప్పాలి.
- వ్యక్తిగత సమాచారములపై ఫోన్‌లలో ఉంచాల్సిన రహస్యతను గురించి చెప్పాలి.
- ఫోన్‌లలో Net ద్వారా విస్తృత సమాచారం పొందుటకు కావల్సిన National, International, Historical, Ticket booking, Guest house booking మొ॥లగు ఎన్నో Important వివరాలను తెలుసుకోవచ్చని చెప్పాలి.
- ఫోన్‌ల ద్వారా సమాచారం చేరవేత, మార్పిడి లాంటి ఎన్నో విషయాలు సులభతరం అయిన విధానములు తెలియపర్చాలి, చేతిలోనే ప్రపంచ సమాచారం మొత్తం సేకరించ గల్గుతున్నాము అని తెల్పాలి.
- ఫోన్‌లలో మెసేజ్‌లు మనం కావల్సిన భాషలో చదువుకుంటూ, తిరిగి సమాధానాలు కూడా ఇవ్వవచ్చని తెల్పాలి.

పాఠం – 12

# ఎన్నికల్లో ఓటా? నోటా?... నిర్ణయం మీదే.

## మాటా మంతి

వాలంటీరు : నమస్కారం చెపుతూ అందరినీ నవ్వుతూ పలకరించాలి.
అవును మనం నిన్నటి వరకు మొత్తం 11 పాఠాలు నేర్చుకున్నాం. చాలా అక్షరాలు, గుర్తులు, ఒత్తులు కూడా నేర్చుకున్నాం కదా. వీటితో మీరు తెలిసినవారి పేర్లు ఎన్ని పేర్లు రాయగలరో రాయండి పది నిముషాలే టైం. ఎక్కువ రాసిన వారు గెలిచినట్లు.
మాటలొద్దు చూపులొద్దు రాయడమే,..
అంతా టకటకా రాసేస్తున్నారు. ఇంకా తొందర .. మీరే గెలవాలి. పెద్దమ్మ అయిపోయిందా?

పెద్దమ్మ : మాకూ తొందరే. ఇవాళ మీటింగ్ ఉంది కదా. నేనైతే పోయి వినాలనుకుంటున్నా. అగో మైక్ సప్పుడు రానే వచ్చింది.

అభ్యాసకుడు : ఈ ఎన్నికలేందో గాని ఊరంతా గోల గోల. ఎంత ఖర్చు చూడు... ఆ జెండాలు, పెద్ద పెద్ద బోర్డులు, ర్యాలీలు, ప్రకటనలు, రోజుకోపార్టీ మీటింగు ఖర్చులు..

అభ్యాసకులు : అరే ఎప్పుడున్నదే గదా! కొత్తగా చెపుతున్నావు. ఎన్నికలు వస్తాయంటే ఊరిపనులు ఏవో జరిగిపోతాయి. రోడ్లు వేస్తారు. చెత్త తీస్తారు. మీటింగులు, ర్యాలీలు, ఇంటింటికి బొట్లు...

వాలంటీరు : ఆ మీకు తెలియనిదేముంది. నాకు మీరే చెప్పాలి. సరే ఈ బొమ్మ చూడండి.

అభ్యాసకులు : ఏం కనబడుతున్నదని అడగకు. ఇక్కడ ఎన్నికల బూత్ కనిపిస్తున్నది.
ఓటు వేయడానికి కాబోలు ఆడా మగా అంతా నిల్చున్నారు.
ఒకాయన పోస్టర్ చదువుతున్నాడు.
ఇంకో దగ్గర ఇద్దరు ఆడమనుషులు ఓటు వేశాక వేళ్లు చూపుతున్నారు.

వాలంటీరు : కరెక్టు... ఇక ఈ పేరు చూడండి. ఎన్నికల్లో ఓటా... నోటా? నిర్ణయం మీదే.

అభ్యాసకులు : గమ్మత్తుగా ఉంది. పేరును బట్టి చూస్తే ఏందో గట్టిగా నిర్ణయం తీసుకో అన్నట్లే ఉంది కదా.

వాలంటీరు : అవును. అతిముఖ్యమైనవి ఎన్నికలు. మన ప్రభుత్వాలఏర్పాటును మనం తేలికగ తీసుకుంటున్నాము ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి. దానివల్ల మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఓటు ద్వారా దేశాన్ని పాలించే పాలకులను ఎన్నుకునే రాజులం మనం. ఓటు లేకుంటే మనం రాజులం కాదు. సున్నాలం. సరే పాఠం పేరేమిటో మీరు చెప్పండి...

**మాటా మంతీ**

1) మీరు ఎప్పుడైనా ఓటు వేశారా?
2) ఎన్నికలలో మీరు ఎప్పుడైనా పోటీ చేశారా?
3) ఓటు వేయడానికీ, ఎన్నికలలో పోటీ చేయడానికీ తేడా ఏమిటి?
4) ఏ వయస్సులో ఓటు హక్కు వస్తుంది?
5) ఓటు వేయడంలో మీకు ఎప్పుడైనా ఏదైనా ఇబ్బంది కలిగిందా?




అభ్యాసకులు : ఎన్నికల్లో ఓటా? నోటా? నిర్ణయం మీదే.

వాలంటీరు : మళ్లీ చెప్పండి.. మళ్లీ చెప్పండి.

అభ్యాసకులు : ఎన్నికల్లో ఓటా? నోటా? నిర్ణయం మీదే.

వాలంటీరు : వినడానికే బాగుంది. మనం మన పాలకులను నిర్ణయించే హక్కును ఓటు ఇస్తుంది. ఇక ఈపేరు చూడండి..

కొత్త అక్షరాలు 'ఎ', 'ఓ', 'ణ' ఒత్తు... లను వేలితో చూపిస్తూ చెప్పండి. ఎక్కువ, ఎన్ని, ఎవరు అంటూ 'ఎ' ను కాస్త వాడతాం గాని, ఈ 'ఓ', 'ణ' లను తక్కువగా వాడతాం. ఇక కింద బొమ్మలు చూడండి. జాగ్రత్తగా వేలు పెట్టి చూస్తూ పేర్లు చదవండి. (పదాలు పాఠం అన్ని చదివించి ఎన్నికల గురించి చర్చించండి). ఎన్నికల్లో ఎట్లా నడుచుకోవాలి, ఏం చేయకూడదు అనే విషయాలు మాట్లాడండి. నోటాను ఉపయోగాన్ని వివరించండి. పాఠంలో అన్ని విషయాలు చెప్పడం జరిగింది. వివరంగా చర్చించండి.

## గణితం

కాలమానం లెక్కలు వివరించడం జరిగింది. ఇవి మన అభ్యాసకులకు రోజువారీ జీవితంలో ఎక్కువగా ఉపయోగపడతాయి.

వారానికి, నెలకు, సంవత్సరానికి ఎన్నిరోజులు వంటి విషయాలను సరదాగా చర్చించవచ్చు. లెక్కలు సరిగ్గా ఉన్నయో లేదో అభ్యాసకులచేతే చెప్పించండి. నెలలు, వారాల పేర్లతో అంత్యాక్షరి ఆడించవచ్చు. ఎవరి పుట్టినరోజులు పెళ్లిరోజులు ఏవారం, ఏ నెలనో అడగవచ్చు. అక్షర బ్యాంకునుంచి వారాలు, నెలల పేర్లు పేర్చమనండి.

## అదనపు సమాచారం


- ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఏమిటో తెలుపాలి.
- ఓటును సక్రమంగా వాడితే అభివృద్ధిని చేసే ప్రభుత్వాలు వస్తాయో వివరించి, ఓటును అమ్ముకుంటే జరిగే పరిణామాలు తెలియపర్చాలి.
- ఓటు వినియోగం ఎన్ని సంవత్సరములకొకసారి వస్తాయి, అసెంబ్లీ, పార్లమెంట్ ఏర్పాటులో ఓటు పాత్రను తెలియపర్చాలి.
- ఓటు వినియోగములో బంధుప్రీతి, దౌర్జన్యం, నగదు తీసుకోవడం నేరం చట్టప్రకారం శిక్షార్హులు.
- ఓటు వేసేటప్పుడు అభ్యర్థులు నీకు నచ్చనట్లయితే నోటా హక్కును వినియోగించుకోవచ్చు.
- ప్రతీ సంవత్సరం జనవరి 25వ తేదిన ఓటరు దినోత్సవంగా నిర్వహిస్తారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడానికి వీలుకల్పించబడింది. కావున అందరూ తమ ఓటును వినియోగించుకోవడానికి ప్రచారము చేయాలి. మన కుటుంబ సభ్యులను కూడా విధిగా నమోదు చేయించాలి.
- "నోటా" ఓటు హక్కును వినియోగించుకున్నవారు నిర్ణీత శాతం కన్న ఎక్కువ ఉన్నట్లయితే మళ్ళీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుంది.
- ఓటరు కార్డు మనకు జాతీయ స్థాయిలో గుర్తింపు కార్డుగా కూడా పనిచేస్తుందని తెల్పాలి.

**"చదువే మనిషికి జీవం.... చదువే మనిషికి జ్ఞానం"**

పాఠం – 13

# నైపుణ్యాలను పెంచుకో అభివృద్ధిని సాధించు

## మాటా మంతి



వాలంటీరు : అందరికీ నమస్కారం. ఏమిటి భాగ్యం వదినా, ఈ మధ్య తరచుగా కేంద్రానికి ఆలస్యంగా వస్తున్నట్టున్నావు. పని అంతా చేసుకుని వదిన టైంకి వచ్చేస్తుంది అనుకునేవాడిని.

భాగ్యం : నీకు తెలుసు కదా. నేను కుట్టు క్లాసుల్లో చేరాను. దాని వల్ల కాస్త ఆలస్యం అవుతున్నది.

అభ్యాసకులు : నువ్వు ముందు కూడా నేర్చుకున్నావు కదూ.

భాగ్యం : అవును నేర్చుకున్నాను. అయితే ఇప్పుడు జె.ఎస్.ఎస్. వాళ్లు అడ్వాన్స్డ్ ట్రైనింగ్ అని మొదలు పెట్టారు. అందులో చేరాను. కుట్టుపనిలో మరింత బాగా చేయడానికి ఈ కోర్స్.

వాలంటీరు : మంచిపని చేస్తున్నావు వదినా. ఇట్లా ప్రతిపనిలో మెళకువలు పెంచుకోవాలి. అంటే నైపుణ్యాలు పెంచుకుంటే ఆ పనిలో మనం మరింత లాభాలను పొందగలుగుతాం. ఇప్పుడు వ్యవసాయమైనా అంతే కదా. రోజురోజుకు మారుతున్న విషయాలు తెలుసుకుంటే మన వ్యవసాయం ఇంకా బాగుంటుంది. లాభాలు బాగుంటాయి. అందుకే అంటారు.. నైపుణ్యాలను పెంచుకో అభివృద్ధిని సాధించు. ఇప్పుడు కరెంట్ పనే ఉంది. ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటూ నేర్చుకుంటేనే కదా పనులు వచ్చేది. ఇంటికి రంగులు వేసే విషయంలో కూడా ఎన్ని మార్పులు వచ్చాయో...

సరే అందరూ ఈ బొమ్మను చూడండి. ఏం కనిపిస్తున్నాయి.

అభ్యాసకులు : కొందరు కుట్టుపని చేస్తున్నారు. కొందరు కూర్చుని మిషన్ చూస్తున్నారు. ఈ బొమ్మలో ఎక్కువమంది కుట్టుపని దగ్గర కనిపిస్తున్నారంటే జన శిక్షణ సంస్థాన్ లేక మరో శిక్షణ సంస్థ అంటే పని నేర్పించే సంస్థ కావచ్చు.

భాగ్యం : అవును. నేను ఇప్పుడు జన శిక్షణ సంస్థాన్ దగ్గరే కుట్టు శిక్షణ నేర్చుకుంటున్నాం. వాళ్లు ఇది ఒక్కటే కాదు. నేర్చుకునే వాళ్లు ఉంటే ప్లంబర్ పని, కరెంట్ పని, బ్యాగుల తయారీ ఇట్టా చాలా నేర్పుతారట.

వాలంటీరు : అవును . మన దగ్గర ఇట్లా ఉచితంగా పనులలో శిక్షణ ఇవ్వడానికి చాలా సంస్థలు ఉన్నాయి. ప్రభుత్వం తరపున పనిచేసేవి, కొన్ని స్వచ్ఛంద సంస్థలు నడిపే సంస్థలు కూడా ఉన్నాయి. కొన్ని కంపెనీలు కూడా ఉచిత శిక్షణ కార్యక్రమాలు చేపట్టాయి. కంపెనీలకు మంచి నైపుణ్యాలు కల కార్మికులను అందించడానికి నేషనల్ అకాడమీ ఫర్ కన్స్ట్రక్షన్ (నాక్) పని చేస్తున్నది. అట్లా శిక్షణ పొందిన మేస్త్రీలు, ప్లంబర్‌లు, కరెంటు పనివారు, డ్రైవాల్ ఫాల్స్ సీలింగ్ వారు వేలాది మంది ముందుగా ఒకరి కింద పని చేసినా చాలామంది సొంతంగా కాంట్రాక్టు పనులు తీసుకోడం ప్రారంభిచారు. నాక్ (NAAC) సంస్థ జిల్లా కార్మిక శాఖ నుండి గ్రామాల్లోని నిరుద్యోగులను గుర్తించి వారికి రెండు వారాలనుంచి మూడు నెలల వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భోజన, వసతులు ఉచితం.

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, పి.ఎం.ఆర్.వై. (PMRY) వారు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పథకం కింద శిక్షణ పొందిన 35 సంవత్సరాల లోపు వారికి రూపాయలు 5000/-ల నుండి రూపాయలు 15 లక్షల వరకు రుణసౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఇదే కాదు పేరున్న అన్ని సంస్థల్లో పని నేర్చుకున్నవారికి రుణ సౌకర్యం కల్పిస్తున్నారు.

శిక్షణ పొంది నైపుణ్యాలను పెంచుకోగలిగితే జీవితంలో అభివృద్ధిని సాధించగలం. ఈ రోజు సంపన్నులు ఎందరో అట్లా ఏదో పనిలో అభివృద్ధి చెంది పైకి వచ్చినవారు ఉన్నారు. అట్లా మనం కూడా అభివృద్ధిచెందాలి. మన వెనకబాటు తనాన్ని రూపు మాపు కోవాలి. ఏం చేయాలో ఆలోచించండి.

వాలంటీరు : ఎవరూ మాట్లాడరేంటి? నేనే చెపుతా... 'నైపుణ్యాలను పెంచుకో... అభివృద్ధిని సాధించు.' మనం ఇదే లక్ష్యంతో పని చేయాలి., ఇది మన ఎదుగుదలకే కాదు మొత్తం దేశం అభివృద్ధికి అవసరం. మన ఆదాయం పెరిగింది అంటే, దేశం ఆదాయం కూడా పెరిగినట్లే. దేశంనుంచి పేదరికం, వెనుకబాటుతనం తొలగిపోవాలి. అందుకు ఏం చేయాలి.

అభ్యాసకులు : నవ్వుతూ ..'నైపుణ్యాలను పెంచుకో.. అభివృద్ధిని సాధించు.' ఇది మన పాఠం. వేలుపెట్టి ఒక్కో అక్షరం చదవండి. అంటావు.

## పాఠ్య బోధన

వాలంటీరు : మీ అందరికీ తెలిసిపోయింది... మరి వేలుపెట్టి అక్షరాలు చూడండి. ఇందులో కొత్త అక్షరాలు చెప్పండి. చాలాసేపు మాట్లాడుకున్నాం కదా. నేనే చెపుతాను చూడండి... ఇదిగో ఇది 'ణ' రాణి, వాణి అంటాం చూడండి. అది. దీనిని ఒత్తుగా మనం ముందే నేర్చుకున్నాం. ఇదిగో 'వ' కింద 'ృ' దీనిని రుత్వం అంటాం. మనం ఇప్పటికి నేర్చుకోని 'ఋ' అక్షరం గుర్తు ఇది. కృప, బృందావనం ఇట్లా రాస్తాం. సమృద్ధి పథకం కూడా

ఉంది కదా. కృషి.. తరువాత ఇదిగో అభివృద్ధిలో ఇది ‘ ధ ’ ‘ధ’ ఒత్తు . వత్తి చదువుతాం. ఆ తరువాత ఇది ఒత్తు ‘ధ’ కి గుడి ఇస్తే ‘ధి’ అయింది. ఈ విషయాలను అవసరమైతే మళ్లీ చెప్పాలి. ఫ్లాష్ కార్డులు చూపుతూ వివరించాలి. వాళ్లతో చదివించాలి. బొమ్మలు వాటికింద పేర్లు చదవడం షరా మామూలే.

## సంఖ్యాజ్ఞానం

ఈ పాఠంలో డిజిటల్ గడియారం గురించి నేర్చుకుంటాం. ఈ గడియారాలు ఎక్కువగా రైల్వేస్టేషన్‌లు, విమానాశ్రయాలలో ఉంటాయి. మధ్యాహ్నం 12 గంటల తరువాత నుండి 13, 14, 15 అలా రాస్తారు. పాఠంలో ఇచ్చిన లెక్కల సహాయంతో వివరంగా చెప్పండి.

## అదనపు సమాచారం

- నైపుణ్యం అంటే ఏమిటో ముందస్తుగా వివరించాలి. అది ఎలా అలవడుతుందో తెల్పాలి.
- నైపుణ్యం పొందడంలో సాధన అవసరాన్ని గుర్తింపజేయాలి. ప్రతి పనికి నైపుణ్యత అవసరం అని తెలియజెయ్యాలి.
- నైపుణ్యం అనేది ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, బొమ్మలతయారీ, ఫోన్‌రిపేరింగ్, అద్దకపు పనులు, మగ్గం వర్క్, బ్యూటీపార్లర్, కుట్లు, అల్లికలు, చిత్రలేఖనము, సాహిత్యము, గానము మొ॥లగు ఎన్నో రంగాలలో నైపుణ్యత వల్ల పొందగల్గే అభివృద్ధిని తెలియజెప్పాలి.
- నైపుణ్యత అనేది అన్ని వయసులవారికి, వారి వారి రంగాలలో అభివృద్ధి సూచికలుగా ముందుకు తీసుకువెళ్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని తెల్పాలి.
- అక్షరాస్యత సాధించడంలో కూడా, చదవడం, రాయడం, గణితం మొదలగు రంగాలలో అభివృద్ధిని పొందుతూ ఆర్థిక అక్షరాస్యత దిశగా అభివృద్ధిని సాధించగలుగుతాము.
- నైపుణ్యాలను ప్రతిరంగానికి అన్వయించుకున్నట్లయితే, గ్రామ, రాష్ట్ర, దేశ, జాతీయ ఆర్థిక ఉత్పత్తులు పెరగడం ద్వారా జాతీయ స్థూలఉత్పత్తిని పెంచుకోవచ్చని తెల్పాలి.

**“చదువే మనిషికి జీవం.... చదువే మనిషికి జ్ఞానం”**

పాఠం – 14

# దేశాన్ని ప్రేమిద్దాం - జాతి ఘనతను చాటుదాం

## మాటా మంతి

వాలంటీరు : (నమస్కారం చెపుతూ అందరినీ నవ్వుతూ పలకరించాలి). ఊరంతా సందడిగా ఉంది కదూ. పండుగ వాతావరణం ఎంత బాగుందో. పిల్లలు అందరూ ఉదయం బడికి సంతోషంగా వెళ్లడం చూశాం. అవునా.

అభ్యాసకులు : అవును ఇవాళ జెండా పండుగ ఆగస్టు 15 కదా. మీ పెదనాన్న కూడా పంచాయితీ దగ్గర జెండా ఎగురవేస్తున్నారంటూ వెళ్లాడు.

వాలంటీరు : నువ్వెందుకు వెళ్లలేదు. ఇది మనందరి పండుగ. అందరం జెండా రెపరెపలాడుతూ ఎగురుతుంటే గర్వంగా చూడగలుగుతాం. జెండా వందనం... జెండాకు నమస్కరించుకోవాలి.

అసలీ పండుగ ఎందుకు చేసుకుంటాం. ఆ మధ్య కూడా జెండా ఎగురవేసి జెండా పండుగ అన్నారు.

అవును, జెండా పండుగలు రెండు. ఒకటి జనవరి 26, రెండవది ఆగస్టు 15. మనల్ని 200 ఏళ్లపాటు పాలించిన ఇంగ్లీషు వాళ్లు ఆగస్టు 15, 1947న మన దేశాన్ని వదిలిపోయారు. అంటే మనకు స్వాతంత్ర్యం వచ్చింది. వాళ్లు సంపదకోసం మన దేశానికి వస్తుండేవారు. మన దేశాన్ని అన్ని విధాలా దెబ్బ తీశారు. మన సంపద దోచుకుపోయారు. ఇక్కడ మనతో పత్తి పండించి వాళ్ల దేశానికి తీసుకుపోయి కంపెనీలను పెంచుకున్నారు. ఇట్లా ఎన్నో.. మన దేశంలోని కోహినూరు వజ్రాన్ని కూడా తీసుకుపోయారు. మన దేశాన్ని పేద దేశంగా మార్చేశారు.

అభ్యాసకులు : అట్లా ఎట్లా మారుస్తారు? మనది పేద దేశమే కావచ్చు.

వాలంటీరు : కాదు. మన దేశం ఎన్నో వనరులు ఉన్న దేశం. అందుకే మొదటినుంచి వేరే దేశాలవారు మన దేశానికి వస్తుండేవారు మన సంపద కోసం. మనకు నలందా అనే ఒక విశ్వవిద్యాలయం జ్ఞాన సంపద ఉండేది. ఇప్పుడు మన పిల్లలు అమెరికా పోతున్నట్లు అప్పట్లో ఇతరులు మన దేశం వచ్చేవారు. మన వీధుల్లో రత్నాలు కుప్పలు పోసి అమ్మేవారట. వ్యాపారం కోసం ఎక్కడెక్కడి వారో ఇక్కడికి వచ్చేవారు అట్లా వచ్చిన వారే ఈస్ట్ ఇండియా కంపెనీ, టర్కీ, అరబ్బు దేశాలనుంచి ఎందరో వచ్చారు. ఘజనీ మహమ్మద్ దండ యాత్రల గురించి విన్నారుగా. 18 సార్లు మన దేశంమీదికి దండెత్తి వచ్చాడు. ఘోరీ, ఘజనీ మహమ్మద్‌లు పట్టు వదలకుండా దాడులు చేస్తూ చివరికి మనలో వెన్నుపోటు దార్లను పట్టుకుని దొడ్డిదారిలో లోపలికి వచ్చారు. వాళ్ల పెత్తనం వందల ఏండ్లు సాగింది. వాళ్ళు అణచివేత ధోరణిలో దేశాన్ని పాలించారు. ఇక్కడి

గుళ్ళు గోపురాలే కాదు... వాళ్ళు అంటించిన నిప్పుతో మన నలందా విశ్వవిద్యాలయం కొన్ని నెలల పాటు కాలుతూనే ఉండిందట. మీకు ఇంకో విషయం చెప్పనా ఇప్పుడు గొప్పదేశంగా చెప్పుకుంటున్న అమెరికా గురించి ఇంగ్లీషు వాళ్ళకు మొదట్లో తెలియదు. చైనా వాళ్ళు దారిమూసేయడంతో మన దేశానికి రావడానికి ఏ దారి ఉందా అని వెతుక్కున్నారు. ఆ వెదుకులాటలో కొలంబస్ అనే ఆయన పడవపై పోతూ పోతూ ఒక దేశం కనిపించగానే వెళ్ళి కలిశాడు. అక్కడ అందరూ ఎర్రగా కనిపించారు. మామూలుగా వాళ్ళకు తెలుసు మనం అందరం ఎర్రగా ఉండం. నల్లగా చామనఛాయలో, కాదంటే కొందరం తెల్లగా ఉంటాం. దాంతో ఆయన వాళ్లను రెడ్ ఇండియన్స్ అన్నాడు. అంటే ఎర్రభారతీయులు అని అన్నాడు.అట్లా పడవలపై చాలా మందే వచ్చి మన దేశాన్ని వీలైనంత దోచుకుపోయారు. రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు. వాళ్ళు ఎప్పటినుంచో ఉన్న కత్తులు కటార్ల యుద్ధం కాక తుపాకి మందు కనిపెట్టి, తుపాకులు, ఫిరంగుల యుద్ధం మొదలు పెట్టి మన వాళ్ళను అంటే అప్పట్లో రాజుల పాలన ఉండేది కదా.. ఓడించి వాళ్ళు రాజ్య మేలారు. మనం నల్లవాళ్ళం అని వాళ్లు తెల్ల వాళ్ళని మనలను చాల చిన్నచూపు చూసేవారు. అందరూ మనను మన సంస్కృతిని తక్కువచేసి వాళ్ళు గొప్ప అని చెప్పుకునే ప్రయత్నం చేశారు. మన గుళ్ళు గోపురాలను కూల్చి అవమానాలు చేశారు. కొందరు ఎదిరించినా దొడ్డి దారిన కూడా వచ్చిన వాళ్ళు మనను ఓడించిన సంఘటనలు ఉన్నాయి. అలెగ్జాండర్ కూడా మనను మనలో ఉన్న ఒక మోసగాడి సాయంతోనే ఓడించాడు. మీకు తెలుసా ఇంగ్లీషువాళ్ళు కరెంటు, ఫోన్ అన్నీ వాళ్ళే కనుక్కున్నారని గొప్పగా చెపుతారు. మన విశ్వవిద్యాలయాలు పని చేస్తున్నప్పుడు మన వాళ్ళు కూడా చాలానే కనుక్కున్నారు. పడవ వ్యాపారం మన పూర్వీకులే చేశారు. ఇప్పుడైనా మనం ఆ విదేశాల పాలకుల దోపిడీ తరువాత పేదవాళ్ళం అయ్యాం గాని మన దేశం చాలా గొప్పదని నమ్మి ఆ గొప్పదనాన్ని తిరిగి సాధించుకోవాలంటే మనమేం చేయాలో ఆలోచించాలి.

అభ్యాసకులు : మనం ఏం చేయగలం. నాయకులు చేయాలి. పెద్దోళ్ళు చేయాలి.

వాలంటీరు : లేదు మనం కూడా తలచుకుంటే చేయగలం. 'నైపుణ్యాలను పెంచుకో.. అభివృద్ధిని సాధించు.' అన్నది అందుకే. మనందరం మనం ఎందుకు వెనుకబడి ఉన్నామో, ఎట్లా ఎదగాలో ఆలోచించుకుందాం. మనం స్వచ్ఛభారత్‌ను ఆచరిద్దాం. రోగాలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉంటే ఎన్నో చేయగలం. నైపుణ్యాలను పెంచుకుని అదనపు ఆదాయాన్ని పొందుదాం. కష్టాలు వచ్చినప్పుడు అందరం కలిసి కట్టుగా ఒకరికి ఒకరం సాయం చేసుకుందాం. మన వనరులను కాపాడుకుంటూ దేశాన్ని పచ్చగా ఉండేలా చేద్దాం. చట్టబద్దంగా నడుచుకుంటూ మంచి పౌరులుగా బతుకుదాం. ప్రతి ఒక్కరం డబ్బును పొదుపుగా వాడి పిల్లలకు మంచి భవిష్యత్తు ఇద్దాం. అట్లా మనం బాగుపడితే మొత్తం దేశం బాగుపడుతుంది. గాంధీ తాత, సుభాస్ చంద్రబోస్, పటేల్ లాంటి వారి వలనే మన ప్రాంతాల్లో కూడా వారి దారిలో నడిచిన వారు

ఎందరో ఉన్నారు. వారు చేసిన త్యాగాల ఫలితం మన దేశం. మనం మన దేశం కోసం, మనకోసం కష్టపడదాం. దేశాన్ని ప్రేమిస్తూ మనం బాగుపడదాం. దేశాభివృద్ధిని కూడా సాధిద్దాం.

మనకు మూడు రంగుల జెండా ఉంది కదా. అదంటే మనందరికీ చాలా గౌరవం. ఆ జెండాలో కింద ఆకుపచ్చ, పైన కాషాయం రంగు, మధ్యనున్న తెల్లరంగులో 24 ఆకుల ధర్మ చక్రం ఉంటుంది. ఈ జెండాను తయారు చేసింది పింగళి వెంకయ్య. జెండాను జెండాగా కాక మరోరకంగా వాడకూడదు. అది అవమానించడం అవుతుంది. చట్ట ప్రకారం నేరం. మురికిగా ఉన్న, నలిగి పాతబడిన జెండాలను ఎగురవేయరాదు.

## అభ్యాసాలు

కొత్త అక్షరాలకోసం చూపిన బొమ్మల పేర్లు చదివించడం ద్వారా ఆయా అక్షరాలు, గుర్తులు నేర్పడం దగ్గరనుంచి అన్ని అభ్యాసాలు శ్రద్ధగా చేయించాలి.

## సంఖ్యాపరిజ్ఞానం

ఈ పాఠంలో క్యాలెండర్ ఎలా చూడాలో నేర్పించాలి.

## అదనపు సమాచారం

- దేశభక్తి అంటే ఏమిటో ముందుగా తెలియపర్చాలి.
- దేశభక్తితో సాధించగల్గిన విజయాలను, పొందిన స్వాతంత్ర్యము గురించి తెలియపర్చాలి.
- విద్యార్థి దశ నుండే ప్రతి పౌరుడుగా ఎదుగుదలతో పాటుగా దేశభక్తిని పెంపొందింపజేయుటకు ప్రేరణ పొందేట్లు చేయాలి.
- జాతీయపండుగలు అంటే ఏమిటో తెలియపరుస్తూ, వాటి విజయాల వెనుక ఉన్న దేశభక్తి నాయకులను గుర్తుకు తెచ్చుకుంటూ ప్రతి సంవత్సరం ఉత్సాహంగా జాతీయ పండుగలు నిర్వహింప చేసుకోవాలి.
- దేశంకోసం పాటుబడిన, స్వేచ్ఛాభారతికై ప్రాణాలర్పించిన ఎందరో మహనీయుల శ్రమ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న ప్రజాసామ్య భారతదేశం.
- దేశభక్తితో ఉన్న వ్యక్తులు, వారు ఏదేశంలో ఉన్న మనజాతి ఉన్నతిని ఘనతను చాటి చెపుతూనే ఉన్నారని తెలియపర్చాలి.
- భారతజాతి నిండుగౌరవాన్ని ఖండాంతరములకు వ్యాప్తినొందింపజేసిన మహానుభావులను ఎల్లవేళలా స్మరించుకునేవిధంగా దేశభక్తిని కలిగి ఉండాలి.
- దేశాన్ని ప్రేమించగల్గే వ్యక్తులు జాతి ఘనతను చాటడంలో కూడా ముందు శ్రేణిలో ఉంటారని తెల్పాలి.

పాఠం – 15

# జాగ్రత్తలు తీసుకుందాం.. విపత్తులను ఎదుర్కొందాం

## మాటా మంతి

వాలంటీరు : నమస్కారం అందరూ వచ్చారా. మనం చాలానే చదువుకున్నాం ఇక చివరికి వచ్చాం కదా. ఇవాళ మనం ఒక పోటీ పెట్టుకుందాం. ఈ పుస్తకాలు చూడండి. ఎవరు వేగంగా చదువుతారో చూద్దాం. ఈ పాఠాలన్నీ అయ్యేలోపు మనకు చదవడం రాయడం రావాలి కదా.

అభ్యాసకులు : ముందుగా ఈ పాఠంలో కొత్త అక్షరాలు నేర్చుకున్న తరువాత చదివితే బాగుంటుందేమో.



వాలంటీరు : అమ్మో నాకే పాఠాలు చెపుతున్నారు. సంతోషం. కానీ ఈ పాఠంలో మనకు కొత్త అక్షరాలు వచ్చినట్లు లేదు. మనం చెప్పుకోబోయే పాఠం.. జాగ్రత్తలు తీసుకుందాం.. విపత్తులను ఎదుర్కొందాం.

విపత్తు అంటే మీకు తెలుసు కదా. "అనుకో కుండా వచ్చిపడి, భారీ ఎత్తున ప్రాణ ఆస్తి నష్టాలను కలిగించే పెద్ద కష్టం విపత్తు.

అగ్నిప్రమాదాలు, భూకంపం, వరదలు, కొండచరియలు విరిగి పడడం, తుఫానులు, రోడ్డు ప్రమాదాలు మొదలైనవి. ఈ విపత్తులలో ప్రకృతి సహజాలు, మానవ తప్పిదాలు కూడా ఉంటాయి. అవేవో మీరు చెప్పగలరు. మనం మానవ తప్పిదాలు లేదా పొరపాట్లను ఆపడానికి జాగ్రత్త పడగలం. రోడ్డు ప్రమాదాలు, పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు ఇందులోకి వస్తాయి. అట్లానే కరువును జాగ్రత్తలతో ఆపగలం.

అదే అగ్నిపర్వతాల పేలుడు, భూకంపాలు, వరదలు, తుఫానుల నుంచి ఎలా జాగ్రత్త పడగలం? జాగ్రత్తలు ముందుగా తీసుకోగలిగితే మనం వాటిని ఆపలేకున్నా జరిగే నష్టాన్ని చాలా వరకు, కొన్నిసార్లు పూర్తిగా ఆపగలం. అందుకు గాను మనం ప్రభుత్వ విపత్తు నిర్వహణ విభాగం వారి హెచ్చరికలు వినాలి. చెప్పిన జాగ్రత్తలు తీసుకోవాలి. పంటలకు వచ్చే తెగుళ్ళు, కోవిడ్ లాంటి వ్యాధులను కూడా విపత్తుల్లో చేరుస్తున్నారు.

చెరువు కట్ట తెగి ఊరు మునగడం కూడా విపత్తే. జాగురూకతతో ఉన్నా, ఎవరైనా చెరువు కట్ట తెగే ప్రమాదాన్ని గుర్తించి హెచ్చరించగలిగితే పెద్ద విపత్తును ఆపినట్లే. ఆ పని మీరో, నేనో ఎవరైనా చేయవచ్చు.

అట్లానే రైలు పట్టాల విషయంలో కూడా ఎవరైనా ప్రమాదం గుర్తించి ప్రమాదాలు ఆపవచ్చు. మనవంతు సేవగా, ఉపశమన చర్యలలో పాల్గొనవచ్చు.

మన దేశంలో వాతావరణశాఖ విపత్తులనుండి ప్రజలను కాపాడ్డానికి అవసరమైన హెచ్చరికలను చేస్తూ ఉంటుంది.

విపత్తులను కాపాడే చర్యలు 1930 నుంచే మనకు వ్యవస్థాగతంగా చేపడుతూ వస్తున్నారు. ప్రతిచోట అగ్నిమాపక దళం ఉండడం మనకు తెలుసు. ఏ అగ్ని ప్రమాదం జరిగినా వారికి ఫోన్ చేయాలి.

ఇప్పుడు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ .. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఉంది. అనేక రకాల విపత్తులు, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం విషయంలో నిరంతరం పరిశోధన జరుగుతోంది. ప్రతి రాష్ట్రంలో దాని తాలూకు శాఖలు ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లో సంభవించే విపత్తుల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో వాటిపై దృష్టి పెట్టి, అందుకు కావలిసిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉంటారు. జనాలను హెచ్చరించడం కూడా జరుగుతుంది.

## సంఖ్యాపరిజ్ఞానం

ఇక్కడ విపత్తుల తరువాత ఏర్పాటయ్యే సహాయశిబిరాలలో తీసుకునే చర్యల ఆధారంగా లెక్కలు వచ్చాయి. చూడండి. ఇవేకాకుండా భిన్నాలు లేక భాగాల లెక్కలు నేర్చుకుంటాం. ఈ భాగాల లెక్కలను సులభంగా అర్థమయ్యేలా పాఠంలో ఇచ్చిన విధంగా వివరించండి.

## అదనపు సమాచారం


- గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఆకస్మాత్తుగా వచ్చే ప్రమాదాలు, విపత్తులు ఏమిటో అడగాలి.
- గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ఎదుర్కొనే, అగ్ని ప్రమాదాలు చిన్నపిల్లలు, పెద్దల అనారోగ్యాలు, దొంగతనాలు, పిడుగుపాటులు, కరెంట్ షాకులు, చెరువులలో మునిగిపోవడం, వర్షాకాలంలో ఆకస్మికంగా వచ్చే వరదలు తేలు / పాము కాటు, వాహన ప్రమాదాలు మొదలగు ఎన్నో విషయాలతో ప్రమాదాలు ఏర్పడతాయి. వాటన్నింటిని ఎదుర్కోవాలంటే ముందు చూపుతో జాగ్రత్తలు తీసుకున్నట్లయితే కొన్నింటిని ముందస్తుగా నివారించుకోవచ్చునని తెలియపర్చాలి.
- ప్రకృతి విపత్తులుగా, భూకంపాలు, జోరువానలు – వరదలు, పిడుగుపాటులు, తుఫాన్ బీభత్సాలు మొదలగు వాటన్నిటిని అధిగమించాలంటే మీడియా ద్వారా ముందస్తు సమాచారము గమనిస్తూ ఆయా సందర్భముల కన్నా ముందుగా తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియపర్చాలి.
- మనం చేసే పనిలో కూడా అనుకోని ప్రమాదాలు ఏర్పడవచ్చు వాటిని అధిగమించడానికి కూడా ప్రణాళికతో పాటు తగిన జాగ్రత్తలు పాటించినట్లయితే ఎన్నో ప్రమాదాల నుండి మనం మన ప్రజలను కూడా కాపాడు కోవచ్చు.
- చిన్న పిల్లల ఆరోగ్య విషయంలో, వృద్ధుల ఆరోగ్య విషయాలలో, గర్భిణీస్త్రీల విషయంలో, పాము కాటు, తేలుకాటు మొదలగు అనుకోని సంఘటనల నుండి కూడా మనం ముందు జాగ్రత్తతో వ్యవహరిస్తే ఎన్నో ప్రమాదాల నుండి బయటపడటానికి ఆస్కారం ఉంటుందని తెలియజెప్పాలి.

పాఠం – 16

# జజ్జనకరి జనారే.. తెలంగాణ భళారే!

## మాటా మంతి

వాలంటీరు : నమస్కారం అందరూ వచ్చేశారా. మనం చివరి పాఠానికి వచ్చాం. ఏవో తక్కువగా వాడే కొన్ని అక్షరాలు తప్ప మనకు అన్ని అక్షరాలు వచ్చేసాయి. మనం ఇప్పుడు చిన్న చిన్న కథల పుస్తకాలు, బస్సు బోర్డులు, పేపరు చదవగలం. ఏమంటారు? అవునా కాదా.



అభ్యాసకులు : చదువుతాం. మీలాగా వేగంగా చదవలేము గాని... నిదానంగా చదవగలం. నీ పుణ్యాన చదవడం మీద ఇష్టం పెరిగింది. పేపరుకూడా చదువుతున్నాం.

వాలంటీరు : సంతోషం. అందరం చదువుకోవడంలో ఒక సంతోషం. మన ఊరంతా చదువుకున్న వారుంటే... మనది సంపూర్ణ అక్షరాస్యతను సాధించిన ఊరు. అక్షరాస్యులు ఉన్నచోట అభివృద్ధి ఉంటుంది. ఇట్లా అన్ని ఊళ్లల్లో అందరూ చదువుకుంటే మన రాష్ట్రం పూర్తి అక్షరాస్యతను సాధించిన రాష్ట్రం అవుతుంది. మనం సంతోషంగా "జజ్జనకరి జనారే.. తెలంగాణ భళారే!" అని పాడుకోవచ్చు.

అభ్యాసకులు జజ్జనకరి జనారే.. తెలంగాణ భళారే! అందరూ నవ్వుతారు.

వాలంటీరు : అవును మన రాష్ట్రం భళా అని చెప్పుకోడానికి అన్ని హంగులూ ఉన్న రాష్ట్రమే. ముందు మనం ఇక్కడ కొత్తగా ఏం నేర్చుకుంటామో మీరే చూడండి. చెప్పండి.

అభ్యాసకులు : 'జజ్జ' ఇక్కడ 'జ' కింద 'జ' ఒత్తు.

వాలంటీరు : అవును. సూపర్ పెద్దమ్మ నువ్వు. అందరూ చెప్పారనుకోండి. పెద్దమ్మ అందరికంటే పెద్దది. కొంచెం ముందు చెప్పింది. తరువాత 'ళ' తక్కువగా వాడతాం . కానీ కళ్లు, పళ్లు, కళ, కేరళ వంటి చోట్ల మనం ఈ 'ళ' ను వాడతాం.

అభ్యాసకులు : మంగళహారతిలో 'ళ' వాడతాం.

వాలంటీరు : అవును. ఇంకా ఎక్కడెక్కడ 'ళ' వస్తుందో చెప్పండి.

సరే ఈ పాఠంలో వచ్చే బొమ్మల పేర్లు చూద్దాం అంటూ ఎప్పటిలా చదివించి అభ్యాసాలు చేయించండి.

ఇప్పటివరకు రాని అక్షరాలు అంటూ, ఇచ్చిన అక్షరాలను పరిచయం చేయండి.

## సంఖ్యాపరిజ్ఞానం

లెక్కల భాగానికి వస్తే చివరగా మనం నిత్య జీవితంలో చూస్తుండే రకరకాల ఆకారాలు (ఆకృతులను) గురించి చెప్పడం జరిగింది. ఇక్కడ ఉన్నవే కాక మీ పరిసరాల్లో కనిపించిన వస్తువుల ఆకృతులేమిటో చెప్పమని అడగండి.

## అదనపు సమాచారం

- దేశం మొత్తంలోనే తెలంగాణకు ఒక ప్రత్యేక స్థానం ఉన్నదని చెప్పవచ్చు. తెలంగాణ ధిక్కారానికి, ఎదిరించడానికి, అతిపెద్ద ఉదాహరణగా తెలంగాణ సాధించడమే.
- ఇక్కడ నివసించే ప్రతీ కులానికి, మతానికి ప్రత్యేక సంస్కృతి ఉంది. కొన్ని కులాలు సంస్కృతికి వారధులుగా నిలిచాయని చెప్పవచ్చు.
- "జజ్జనకరి జనారే జనకు జనా జనారే" పాటలోని సారమే జానపదులకు చెందిన అనేక కళారూపాలు తెలంగాణలో కనపడతాయి.
- ఇక్కడి పాట పనిలో భాగమై, పనిలోని అలసటను మించి పోవడానికి కొన్ని కళారూపాలను పరిశీలిద్దాం. గంగిరెద్దుల వారు, భాగవతులు, పంచాలోళ్లు, ఫకీరోళ్ళు, బుడబుక్కలవారు, పెద్దమ్మోళ్ళు, బాలసంతోళ్ళు, ఎరుకలోళ్ళు, తుపాకి రాముడు, గొల్లసుద్దులు, సాధనాశూరులు, గారడోళ్ళు, పగటి వేషగాళ్ళు, కాటిపాపలోళ్ళు, సార్థకాళ్ళు వారి జీవనోపాధికి కళలను ప్రదర్శిస్తూ జీవనం కొనసాగించే వాళ్ళు.

  బతుకమ్మ, దండారి, గుస్సాడి, కోలాటం మొదలగు కళారూపాలతో దేశంలో విభిన్న సంస్కృతి సాంప్రదాయాలు కనపడతాయి.

**అన్ని కళారూపాలు వచ్చే పాట :**

**పండు వెన్నెల్లలోని వెన్నెల్లోన పాడేటి పాటలేమాయె**
**నా పల్లెటూరులోన ఆడేటి ఆటలేమాయె**
**బాలనాగమ్మ భక్త శిరియాళ హరిశ్చంద్ర**
**అల్లిరాణి ఆటలు ఏవి?**
**నా పల్లెటూరులోన పాడేటి పాటలు ఏవి?**

ఇట్లా నాట్లు వేయడం, కోతలు కోయటం, వడ్లు దంచడం, రాళ్ళుకొట్టడం, రాయి విసరడం, పిల్లలను నిద్రపుచ్చడంలో తెలంగాణ పాటలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

ఇక్కడి ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం. తాగునీరు, సాగునీరు పుష్కలంగా ఉండి పచ్చని పంటపొలాలతో అలరారే రాష్ట్రంగా చెప్పవచ్చు.

తెలంగాణలో 33 జిల్లాల్లో వివిధ రకాల వృత్తులు చేసుకుంటూ అడవుల్లో నివసించే ఆదివాసీల నుండి నగర జీవన విధానం వరకు అడుగడుగున భిన్నత్వం కనపడుతుంది.

# అక్షరాస్యత అభ్యసన ఫలితాలు

## అభ్యసన ఫలితాల పరిచయం

మనం ఏదైనా కొత్త విషయం లేదా నైపుణ్యం నేర్చుకున్నప్పుడు దానిని నేర్చుకునే ముందు నేర్చుకునే సమయంలో దాని తర్వాత ఏదో ఒక లక్ష్యాన్ని మనసులో ఉంచుకుంటాం. ఉదాహరణకు ఒక పరికరాన్ని వాడే విధానం అభ్యసించడం లేదా కొత్తభాషను అభ్యసించడంలో లక్ష్యాన్ని సాధించినారో లేదో తెలుసుకోవడానికి మిమ్మల్ని మీరు పరీక్షించుకోవచ్చు. నేను ఇప్పుడు నేర్చుకున్న భాషను నా జీవితంలో ఉపయోగించగలనా? భాష యొక్క అన్ని ఉపయోగాలను నేను పూర్తిగా అర్థం చేసుకున్నానా? భాషకు సంబంధించిన అన్ని పదాల యొక్క సరైన అర్థాన్ని నేను అర్థం చేసుకున్నానా?

ఇలా ఈ ప్రశ్నల అన్నింటికీ సమాధానాలు భాషను నేర్చుకున్న తర్వాత అభ్యాసకుని ప్రవర్తన అతని ఆలోచన పని తీరులో కొన్ని మార్పుల రూపంలో మీకు కనిపిస్తాయి. ఈ మార్పులను అభ్యసన ఫలితాలుగా పిలుస్తాము.

అభ్యసన ఫలితాలు అంటే అభ్యసన ప్రక్రియలో ఉన్నప్పుడు అంతకు మించి అభ్యాసకుడి ప్రవర్తన చర్యలలో స్పష్టంగా ప్రతిబింబించే లేదా కనిపించే ప్రవర్తనలోని ఫలితాలు లేదా మార్పులు.

## ప్రాథమిక అక్షరాస్యత (భాష) అభ్యసన ఫలితాలు

1 ఒక పదంలో ఉన్న అక్షరాలను విడి విడిగా గుర్తించడం

2 అక్షరాల శబ్దాలతో వాటి ఆకారాలను జోడించడం

3 అచ్చుల సంకేతాలతో హల్లును గుర్తించడం

4 చదవడం, రాయడం ప్రక్రియలు రెండు స్థాయిలలో ఉంటాయి–అక్షరాల నుండి పదం వరకు, పదం నుండి వాక్యం వరకు

5 నిత్యజీవితంలోని వివిధ సందర్భాలను చదవడం, రాయడంలో ఉపయోగించుకోవడం

6 ఒకటి కంటే ఎక్కువ పద్ధతులను ఉపయోగించి చదవడం, మొత్తం పదాలను గుర్తించడం, బొమ్మల ఆధారంగా ఊహించి చదవడం.

7 ఇచ్చిన అక్షరం లేదా ధ్వనితో మొదలయ్యే లేదా ముగిసే అక్షరాలతో పదాల జాబితాను రూపొందించడం.

8 అక్షరాలు, పదాలు, చిన్న చిన్న వాక్యాలను స్పష్టంగా రాయడం.

9 భాషలో తరచుగా వచ్చే పదాలు గుర్తించడం.

10 అభ్యాసకులు పాఠాలు చదివి వారి నిత్యజీవితంలోని అనుభవాలు, పరిస్థితులతో సమన్వయం చేసుకోవడం.

11 పరిచయ భాషలో లేదా మాతృ భాషలో విషయాలను గ్రహించడం, రాయడం.

12 వాక్యాన్ని స్వతంత్రంగా కాని మరొకరి సహాయంతో కాని చదవడం.

13 పాఠ్యాంశంలోని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం.

14 పాఠ్యాంశంలోని ప్రత్యేక సూచికలను తెలుసుకొని సంభాషణలో పాల్గొనడం.

## సంఖ్యా పరిజ్ఞానం (లెక్కింపు, స్థలం కొలతలు, పరిమాణం) అభ్యసన ఫలితాలు

1 నిత్య జీవితంలో 1 నుండి 100000 వరకు సంఖ్యలను గుర్తించడం, చదవడం, రాయడం

2 1 నుండి 999 వరకు ఉన్న సంఖ్యలలోని పదుల, వందల సంఖ్యలను, స్థానాలను గుర్తించడం

3 సమానమైన '=', కూడిక '+', తీసివేత '−', గుణకారం '×', భాగహారం '÷' యొక్క సంకేతాలను గుర్తించడం.

4 రోజువారీ జీవితంలో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారాలను ఉపయోగించడం.

5 చలామణిలో/అందుబాటులో ఉన్న రూపాయి నోట్లు / నాణెలములను (1,2,5,10,20,50, 100,200,500) మొదలైనవి గుర్తించి వాటితో లావాదేవీలు చేయడం.

6 దైనందిన జీవితంలో వివిధ సందర్భాలలో వస్తువులు, స్థలాలు మొదలైనవి వివిధ భాగాలుగా విభజింపబడతాయి. ఆ భాగాల ఆధారంగా ఒకవంతు, సగం, మూడు, నాలుగవ వంతులుగా గుర్తించడం.

7 ఒకవంతు, సగం, మూడవ, నాలుగవ వంతు భాగాలు వేర్వేరుగా రాయబడతాయి.

8 త్రిభుజం, చతురస్రం, దీర్ఘచతురస్రం, వృత్తాకార, స్థూపాకార, శంఖు, ఘన ఇలా మొదలైన ఆకారాలను తెలుసుకొని వాటిని రోజువారీ జీవితంలో ఉపయోగించుకోవడం.

9 ఆకారాలు, సంఖ్యల నమూనాలను గుర్తించడం నమూనా ఆకారాలను తయారుచేయడం.

10 ప్రామాణిక యూనిట్లలో పొడవు, వెడల్పు, బరువులను కొలవడం, సంబంధిత యూనిట్ల మధ్య పరస్పర సంబంధాలను వివరించడం.

11 రోజువారీ జీవితంలో ఉపయోగించే వస్తువుల ధర వాటి పరిమాణం, విలువపై ఆధారపడి ఉంటుంది. వాటిని లెక్కించి దాని ప్రకారం లావాదేవీలు జరపడం.

12 గడియారంలో (అనలాగ్, డిజిటల్) సమయాన్ని గంటలు, నిమిషాలు, సెకన్లుగా చదవడం, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి పరంగా వివరించడం.

13 గంటలు, నిమిషాలు, సెకన్ల మధ్య సంబంధాన్ని చర్చించడం.

14 సమయాన్ని 24 గంటల గడియారం నుండి 12 గంటల గడియారానికి మార్చడం.

15 క్యాలెండర్‌లో వారంలోని రోజులు, ప్రత్యేక తేదీలు, సంవత్సరంలోని నెలలను గుర్తించడం.

जन जन साक्षर

उल्लास
ULLAS
नव भारत साक्षरता कार्यक्रम